www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ



హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 228 | గురువారం | 7 ఫిబ్రవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad | పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00




స్వయంగా తనిఖీ చేస్తా

పంచాయతీలు పచ్చగా, పారదర్శకంగా ఉండాలి

350మంది పంచాయతీ రిసోర్సు పర్సన్లకు అవగాహన

రోడ్డుపై చెత్త వేస్తే ఫైన్

ఐదేళ్లలో రూ.40వేల కోట్లు

కరెంటు బిల్లు బకాయిపడితే సస్పెన్షన్

పన్నులు వందశాతం వసూలు చేయాలి

ప్రతి ఇంటికి ఆరు మొక్కలు నాటాలి

మధ్య మధ్యలో పద్యాలతో

కర్తవ్య బోధ చేసిన సిఎం కెసిఆర్

మన తెలంగాణ /హైదరాబాద్

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలన్నీ గ్రీన్ విలేజ్, క్లీన్ విలేజ్‌లుగా మారాలని ముఖ్యమంత్రి కెసిఆర్ స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి ముడిపడి ఉందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామాలను అభివృద్ధి చేయడంలో సర్పంచ్‌లు, కార్యదర్శి సమిష్టిగా పనిచేయాలని, అవినీతికి పాల్పడినా, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినా వారిపట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని, సీరియస్ చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. సర్పంచ్‌లకు కొత్త పంచాయతీరాజ్ చట్టం అమలు, విధుల నిర్వహణ, నిధుల వినియోగం, గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం తదితర పలు అంశాలపై అవగాహన కల్పించేందుకు పంచాయతీరాజ్ శాఖకు చెందిన సుమారు 350 మంది రిసోర్స్ పర్సన్లకు ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కెసిఆర్ దాదాపు ఆరు గంటల పాటు అవగాహన కల్పించారు. గ్రామాల తరువాయి 6లో

పంచాయతీలకు సంపూర్ణ అధికారాలు, సహకారం

పారదర్శక పాలనే ధ్యేయం

రాష్ట్రస్థాయి రిసోర్సు పర్సన్ల బృందం

పనితీరుపై 25తనిఖీ టీంలు

ఒక బృందలో నేనూ ఉంటా

పనిచేయకపోతే తీవ్ర చర్యలు



గంగదేవిపల్లి మాజీకి వేదికపై చోటు

పెదిరిపాడులో సర్పంచ్ బాలప్పను నేలపై కూర్చోబెట్టినందుకు సిఎం ఖండన



జిశాట్-31 సక్సెస్ 12

రామగుండం విద్యుత్‌లో

85% వాటా మనకే 3



జయరాం హత్యకేసు హైదరాబాద్‌కు బదిలీ

అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తాం : సిపి అంజనీకుమార్

జయరాం భార్య ఫిర్యాదుపై ప్రత్యేక దర్యాప్తు

మన తెలంగాణ/హైదరాబాద్

తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టించిన ఎన్నారై జయరాం హత్య కేసు ఎపి పోలీసులు తెలంగాణ రాష్ట్రానికి బదిలీ చేశారు. జయరాం హత్య జరిగిన ప్రదేశం తెలంగాణ రాష్ట్ర పరిధిలోనిది కావడంతో ఎపి పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ నగర పోలీసులకు కేసును బదిలీ చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ డిజిపి ఆర్పీ ఠాకూర్ వెల్లడించారు. తన భర్త హత్య కేసు విచారణలో ఎపి పోలీసులపై తనకు నమ్మకం లేదని హతుడి భార్య పద్మశ్రీ పేర్కొన్న విషయం విదితమే. జూబ్లీహిల్స్ తరువాయి 6లో

అడ్వకేట్ ప్రశాంత్ భూషణ్‌కు సుప్రీం ధిక్కార నోటీసులు 10

వచ్చే విద్యావత్సరం నుంచే

గిరిజన వర్శిటీ

ములుగు నుంచే తరగతులు ప్రారంభం

కేంద్ర మంత్రి హామీ

ఫలించిన టిఆర్ఎస్ కృషి



మన తెలంగాణ/ న్యూఢిల్లీ, హైదరాబాద్

రానున్న విద్యా సంవత్సరం (2019–20) నుంచే ములుగు జిల్లా కేంద్రంలో గిరిజన విశ్వవిద్యాలయం ప్రారంభమవుతుందని, కొన్ని కోర్సులకు ప్రవేశాలు కూడా జరుగుతాయని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం కోరినట్లుగా 21 కొత్త జిల్లా కేంద్రాల్లో కాకపోయినా కనీసం సగం జిల్లా కేంద్రాల్లో జవహర్ నవోదయ విద్యాలయాలను నెలకొల్పడానికి కూడా ఆయన హామీ ఇచ్చారు. వచ్చే మంత్రివర్గ సమావేశంలోనే దీనిపై చర్చించి ఆమోదం తెలియజేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, శాసనసభ్యుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు బుధవారం ఢిల్లీకి వెళ్ళి రాష్ట్రానికి సంబంధించిన పలు విద్యాపరమైన అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించిన సందర్భంగా పై హామీ లభించింది. కేంద్ర మంత్రితో భేటీ అనంతరం మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్నట్లుగా తెలంగాణలో గిరిజన తరువాయి 6లో

మరో ఘాతుకం

ప్రేమించలేదని 15 కత్తి పోట్లు

విషమస్థితిలో విద్యార్థిని మధులిక

బుధవారం ఉదయం హైదరాబాద్ కాచిగూడ పరిధిలో దారుణం

కాలేజీకి వెళుతుండగా మధులికపై భరత్ దాడి

ప్రేమించకపోతే చంపేస్తానని అరుస్తూ వెనుక నుంచి కొబ్బరి కత్తితో వేట్లు

క్లాస్‌కు వెళ్లాలని ప్రాధేయపడినా వినిపించుకోకుండా పైశాచిక చర్య

భరత్ అరెస్టు

మన తెలంగాణ/ (హైదరాబాద్/కాచిగూడ)

ప్రేమించలేదనే కోపంతో ఓ ఉన్మాది ఇంటర్ చదువుతున్న మధులిక అనే విద్యార్థినిపై కొబ్బరిబోండాల కత్తితో భరత్ అనే యువకుడు విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. కాచిగూడా పరిధిలోని సత్యానగర్‌లో నివాసముంటున్న మధులికపై అదే కాలనీలో ఉంటున్న భరత్ అలియాస్ సోనూ బుధవారం ఉదయం 8:30 గంటలకు కాలేజీకి వెళుతున్న మధులికపై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. దాడికి ముందు వారి మధ్య 15 నిమిషాల పాటు వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. తనను ప్రేమించాలని, లేకపోతే చంపేస్తానని గట్టిగా అరుస్తూ మధులికపై ఆగ్రహం



వ్యక్తం చేశాడు. తాను కాలేజీకి వెళ్ళాలి అని ప్రాధేయపడిన మధులికపై వెనుక నుంచి ఒక్కసారిగా తన వెంట తెచ్చుకున్న కొబ్బరిబోండాలు నరికే కత్తితో దాడి చేశాడు. మధులిక భుజం, తల, చేతులపై తరువాయి 6లో



టివి నటి ఝాన్సీ ఆత్మహత్య

మన తెలంగాణ/హైదరాబాద్

నగరంలోని శ్రీనగర్ కాలనీలో సాయి అపార్ట్‌మెంట్‌లోని తన నివాసంలో మంగళవారం అర్ధరాత్రి వర్ధమాన సీరియల్ నటి ఝాన్సీ ఉరి వేసుకుని బలన్మరణానికి పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఝాన్సీ తరువాయి 6లో

ఐఎఫ్ఎస్‌లో తెలుగు విద్యార్థి మందాడి నవీన్‌రెడ్డికి ఫస్ట్ ర్యాంక్ 3

నెలాఖరులోగా లోక్‌పాల్

చైర్మన్, సభ్యుల నియామకానికి కేంద్రం నోటిఫికేషన్ 10

నూతన ఆవిష్కరణలకు అవకాశాలు -కెటిఆర్ 3



శబరిమలపై సుప్రీం తీర్పును గౌరవిస్తాం

ట్రావెన్కూర్ బోర్డు Uటర్న్ 10

కుంచెపోటు



నేను పార్టీ మారలేదు, సిబిఐ నావెంట పడకుండా ఈ గుర్తు అతికించుకున్నా..!



ఇటీవల ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు స్వీకరించిన నిజామాబాద్ ఎంపి కవితను బుధవారంనాడు తన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్

సేంద్రియ ఉత్పత్తులే మేలు

కొలువుదీరిన 150 స్టాల్స్



మనతెలంగాణ/మాదాపూర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్గానిక్ రంగంలో మహిళ రైతులను, వ్యాపార వేత్తలను పోత్సహిస్తుంది. ప్రస్తుత తరుణంలో ఆహారపు పద్ధతుల్లో మార్పులు రావడంతో ప్రజలు సేంద్రియ పద్ధతులతో తయారు చేయబడిన ఉత్పత్తులపై మక్కువ పెంచుకుంటున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో కేంద్ర ప్రభుత్వ మహిళ, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆద్వర్యంలో ఉమెన్ ఆఫ్ ఇండియా ఆర్గానిక్ ఫెస్టివల్ 7వ ఎడిషన్‌ను ఘనంగా నిర్వహించింది. రాష్ట్రంలో ఆర్గానిక్ ఉత్పత్తులను పెంపోందించి, వాటిపై అవగాహన పెంచేందుకు ప్రభుత్వాలు, పలు స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయి. ఐదు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో సేంద్రియా పద్ధతులతో కూడిన పలు ఉత్పత్తులు కొలువుదీరాయి. ప్రభుత్వాలు మహిళ అభ్యున్నతికి పెద్దపీట వేస్తు మహిళ రైతులను, వ్యాపారులను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుందని నిర్వాహకులు తెలిపారు. దేశ వ్యాప్తంగా మహిళ రైతులు ఉత్పత్తి చేసిన సేంద్రియ పద్ధతితో కూడిన ఆహారపు ఉత్పతులను ప్రభుత్వం ప్రోత్సహించి మార్కెటింగ్ చేసి పండించిన వారికి, తయారీదారులకు లబ్ధిచేకూరేలా చేస్తుంది. ఈ ప్రదర్శనలో 150కి పైగా కొలువుదీరిన స్టాల్స్‌లలో సహజసిద్ధంగా తయారు చేయబడిన ఉత్పత్తులను అందుబాటులో ఉంచారు.

నెంబర్ వన్‌గా తీర్చిదిద్దాలి : హోంమంత్రి

తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధిపై ముఖ్య మంత్రి కేసీఆర్ ప్రత్యేక కృషి చేస్తున్నారని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. మాదాపూర్ శిల్పారామంలోని సాంప్రదాయ వేదికలో నిర్వహించిన ఆర్గానిక్ ఫుడ్ ఫెస్టివల్‌కు అడిషనల్ సెక్రటరీ అజయ్ టిర్కీ, జాయింట్ సెక్టటరీ, ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ నందిత మిశ్రా, రాష్ట్ర మహిళ చైల్డ్ ప్రిన్సిపల్ సెక్రటరీ జగదీశ్వర్, ఉమెన్ డెవలప్‌మెంట్, చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ విజిందర బోయ్, రాష్ట్ర మహిళ కమిషన్ గుండు సుధారాణి, రంగారెడ్డి జిల్లా రీజనల్ ఆర్గనైజేషన్ నిర్వాహకురాలు సుశీలరెడ్డి, వీరమణి, నటీమణులు అక్కినేని అమల, మంచు లక్ష్మి, ప్రియాంక, మధుమితలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. రాష్ట్రంలోని రైతుల అభివృద్ధి కోసం బడ్జెట్‌లో 12వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని రైతులకు పంట పెట్టుబడి సహాయం కింద ఎకరాకు పదివేల రూపాయలను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ రోజుల్లో ప్రతి ఆహారపు ఉత్పత్తులు విషపూరితంగా మారుతున్నాయని అందుకు సేంద్రీయ ఆహారపు ఉత్పత్తులను ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కృషి చేస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని, తెలంగాణ నలుమూలల నుండి విచ్చేసిన మహిళ ఎంటర్‌ప్రెన్యూర్‌లకు ఉమెన్ ఇండియా ఆర్గానిక్ సహకారం ఉంటుందన్నారు. దేశ వ్యాప్తంగా మహిళ రైతులు పండిస్తున్న ఆర్గానిక్ ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించనున్నట్లు తెలిపారు.

ఆన్‌లైన్ ద్వారా వ్యాపారాన్ని కొనసాగిస్తాం ...



ప్రస్తుత తరుణంలో మనం తినే ఆహర పదార్థాలు విషపూరితంగా మారడంతో రాష్ట్ర ప్రభు త్వం సేంద్రియ ఉత్పత్తులను ప్రోత్సహించడంతో సేంద్రియ పద్ధతిలో ఉత్పత్తులను తయారు చేయాలనే ఆలోచన వచ్చింది. సహజ పద్ధతిలో హెర్బల్ టీ, పలు రకాల క్రీంలు, ఆయిల్, జెల్ ఆలోవిరా, సబ్బులు వంటి వివిధ ఉత్పత్తులను తయారు చేసి ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలను చేస్తాను. గత నాలుగు సంవత్సరాల నుండి ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాను.

–రేఖా శర్మ, ఉత్తరాఖాండ్

ఆరోగ్యాన్ని పెంచే పదార్థాలు ...

శరీర ఎదుగుదల, ఆరోగ్యాన్ని పెంచేటువంటి స్నాక్స్ వంటి పదార్థాలను తయారు చేస్తాను. వీటిని సహజ పద్ధతిలో తయారు చేసి అమ్మకాలు చేస్తుంటాను. గుమ్మడి విత్తనాలు, సూర్యకాంతి విత్తనాలు, వాటర్ మిలాన్ విత్తనాలు, జౌషగింజలు, కొర్రలు, మునగాకులను కలిపి పలు రకాల పల్లీ చక్కీలను తయారు చేస్తాను. స్నాక్స్ లాగా తినడానికి గుమ్మడి విత్తనాలు, సూర్యకాంతి విత్తనాలు, వాటర్ మిలాన్ విత్తనాలను స్నాక్స్‌లాగా వాడవచ్చు. ఇవి శరీరంలో గ్లూకోజ్ శాతాన్ని క్రమంగా తగ్గిస్తుంది. గత రెండు సంవత్సరాలుగా ఈ వ్యాపారాన్ని చేస్తున్నాను.

– సునీల్ కుమార్, బెంగుళూరు

అన్ని కులాలు, జాతులకు ప్రభుత్వం అండ

మాజీ మంత్రి ఈటల రాజేందర్



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో అన్నీ కూలలాలకు, జాతులకు ప్రభుత్వం అండగా ఉండాలన్నదే సిఎం కెసిఆర్ ఆలోచన అని మాజీ మంత్రి ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. 'చిన్న కులాలకు నోరు ఉండదు, ముందుకు వచ్చి అడిగే నాయకుడు ఉండరు. కాబట్టి వారికి సాయం చేస్తే మర్చిపోరు' అని సిఎం ఎప్పుడూ చెప్తూ ఉంటారని, తాము సిఎం ఆలోచనల మేరకే మేము నడుచుకుంటూ అణగారిన వర్గాలను ఆదుకునేందుకు అన్నివిధాలుగా ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. రవీంద్రభారతిలో బుధవారం జరిగిన ఆరెకటిక సంఘం ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజేందర్ ప్రసంగిస్తూ, సిఎం కెసిఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని, మిగతా కులాల మాదిరిగానే ఆరె కటిక కులంవారికి కూడా ప్రభుత్వపరంగా పూర్తి సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే పలు పథకాలను సిద్ధం చేశామని, ఈ సంవత్సరం నుంచి వాటిని అమలు చేసి మేలు చేస్తామని వెల్లడించారు. ఐదున్నర దశాబ్దాల సమైక్య అంధ్రప్రదేశ్ చరిత్రలో నలభై ఏళ్లకు పైబడి అంధ్రా ప్రాంతంవారే పాలించారని, తెలంగాణ వస్తే ఆగమవుతామని శాపనార్థాలు పెట్టారుగానీ ఇప్పుడు వాళ్లెక్కడున్నారు, మనం ఎక్కడ ఉన్నామని ప్రశ్నించారు. అతి తక్కువ కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో సిఎం కెసిఆర్ విజయవంతమయ్యారన్నారు. రైతుబంధు, 24 గంటల విద్యుత్‌తో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో ఉంటే మేము ప్రజల హృదయాల్లో ఉన్నామని ఆయన పేర్కొన్నారు. కష్టపడితే అందరూ విజయం తప్పక సాధిస్తారని ఈటల వ్యాఖ్యానించారు.

9 వేల వివిప్యాట్‌లు సమకూర్చండి !

సిఇఒను కోరిన రాష్ట్ర ఎన్నికల సంఘం

నగర స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు షురూ

మన తెలంగాణ/హైదరాబాద్: రానున్న జూలై 2వ తేదీకి పట్టణ స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు ముగుస్తున్నందున ఆ ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి సారించింది. మే నెల చివరలో లేదా జూన్‌లో వీటికి ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం కమిషనర్ వి.నాగిరెడ్డి ఇప్పటికే ప్రకటించారు. తొలి సారిగా నగర స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటింగ్‌కు ఇవిఎంలను వినియోగించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. పారదర్శకంగా నిర్వహించేందుకు వీలుగా ఇవిఎంలతో పాటు వివిప్యాట్‌లను వినియోగించాలనుకుంటోంది. అందులో భాగంగా వివిప్యాట్‌లను ఇచ్చి సహకరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రజత్ కుమార్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి లిఖితపూర్వకంగా కోరారు. ప్రస్తుతం ఎన్నికల సంఘం దగ్గర సరిపోయేంత సంఖ్యలో ఇవిఎంలు ఉన్నాయని, అయితే వివిప్యాట్‌లు లేవని ఆ లేఖలో పేర్కొన్నారు. వివిప్యాట్‌లను కొనుగోలు చేసేందుకు బడ్జెట్‌ను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన విషయాన్ని ప్రస్తా వించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు వివిప్యాట్‌లు వాడు తున్నందున, వాటినే పట్టణ స్థానిక సంస్థ ఎన్నికల్లోనూ వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించిందని, సుమారు 9వేల వివిప్యాట్‌లు అవసరమౌతాయని, ఎన్నికలప్పుడు వాటిని ఇచ్చేందుకు సహ కరించాలన్నారు. దాదాపు 12 వేల ఇవిఎంలు రాష్ట్ర ఎన్ని కల సంఘం దగ్గర ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆరు మున్సిపల్ కార్పొరేషన్‌లు, 42 మున్సిపాలిటీలు ఉన్నాయి. గడువు ముగిసిన వాటికి కొత్తగా ప్రకటించనున్న తుది ఓటర్ల జాబితా ప్రకారం ఎన్నికలు నిర్వహించనున్నారు.

రైతుబీమా రూ.338 కోట్లు చెల్లింపులు

మన తెలంగాణ/హైదరాబాద్: రైతుబీమా పథకం కింద రైతుల నామినీల బ్యాంకు ఖాతాల్లో పది రోజుల్లోపే పరిహారాన్ని జమ చేస్తున్న ఎల్‌ఐసి అధికారులను వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారధి అభినందించారు. బీమా పరిధిలో ఉన్న రైతులు దురదృష్టవశాత్తు మృతి చెందితే వారి కుటుంబాలకు వెంటనే ఆర్థికంగా చేయూతనిస్తుండటంతో కొంత ఉపశమనం లభిస్తోందన్నారు. సచివాలయంలో పార్థసారధి ఎల్‌ఐసి అధికారులతో రైతుబీమా పథకంపై సమీక్షించారు. ఇప్పటివరకు 6775 మంది రైతులు మృతి చెందగా, వారి నామినీలకు రూ.338.75 కోట్లు జమ చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో అధిక మొత్తంలో చిన్న, సన్నకారు రైతు కుటుంబాలకు న్యాయం జరిగిందన్నారు. బీమా కార్యక్రమంపై వ్యవసాయ శాఖ, బ్యాంకు అధికారులతో సమీక్షలు నిర్వహించాలని సూచించారు. గ్రామాలలో రైతుబీమా క్లయిమ్స్‌ను వ్యవసాయ విస్తరణ అధికారులు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు విజయ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వరి సాగు 13.86 లక్షల ఎకరాలు

- సాధారణ సాగు విస్తీర్ణంలో 79% మేర నాట్లు
- వందశాతం పప్పు పంటల సాగు
- వ్యవసాయ శాఖ తాజా నివేదిక


మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో యాసంగి సీజన్ సాధారణ సాగు విస్తీర్ణం 33.45 లక్షల ఎకరాలు కాగా ఇప్పటివరకు 24.33 లక్షల ఎకరాల్లో (74 శాతం) మేర పంటల సాగు విస్తీర్ణం నమోదైనట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఆహారధాన్యాల్లో కీలకమైన వరి రబీ సాధారణ సాగు విస్తీర్ణం 17.62 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 13.83 లక్షల (79%) ఎకరాల్లో నాట్లు వేసినట్లు పేర్కొంది. ఇక పప్పు పంటలు సాధారణ అంచనాల ప్రకారం వంద శాతం మేర, అంటే 3.08 లక్షల ఎకరాలకు గాను 3.07 లక్షల ఎకరాల్లో, సాగైనట్లు వెల్లడించింది. రాష్ట్రంలో ఆహార పంటల సాధారణ సాగు విస్తీర్ణం మొత్తం 26.12 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 19.99 లక్షల (77%) ఎకరాల్లో సాగయ్యాయి. అలాగే మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 4.15 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.61 లక్షల (64%) ఎకరాల్లో సాగైంది. ఇక నూనె గింజల సాగులో కీలకమైన వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 3.54 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.66 లక్షల (75%) ఎకరాల్లో సాగైంది. శనగ పంట అత్యధికంగా 113 శాతం 2.64 లక్షల ఎకరాల్లో సాగైంది. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. వరంగల్ రూరల్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, జనగామ, యాదాద్రి భువనగిరి, మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో 120 నుంచి 59 శాతం లోటు వర్షపాతం నమోదైంది. మరో 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయ శాఖ నివేదిక తెలిపింది. నాగర్‌కర్నూల్, సూర్యాపేట, ఆదిలాబాద్ మూడు జిల్లాల్లో 100 శాతం పంటల సాగు నమోదైంది.

గిరిజన సర్పంచులతో ప్రత్యేక సదస్సు

మన తెలంగాణ/హైదరాబాద్: గిరిజన తండాల్లో గెలిచిన సర్పంచ్‌లతో ప్రత్యేక సదస్సు నిర్వహించేందుకు టిఆర్‌ఎస్ గిరిజన సంఘం ప్రణాళిక సిద్ధంచేసి పార్టీ అనుమతి కోసం వేచి చూస్తోంది. దశాబ్దాల కోరిక టిఆర్‌ఎస్ ప్రభుత్వంలో నెరవేరడంతో గిరిజన తండాలు ప్రత్యేక పంచాయితీలుగా ఏర్పాటయ్యాయని, టిఆర్‌ఎస్ బలపర్చిన అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారని, విజయోత్సవాన్ని నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు టిఆర్‌ఎస్ అనుబంధ గిరిజన విభాగం అధ్యక్షుడు ధరావత్ మోహన్ తెలిపారు. ఈ నెలలో చేసే సభ్యత్వనమోదు కంటే ముందే గిరిజన సర్పంచులతో సమావేశాలు నిర్వహించి పార్టీని బలోపేతానికి యోచిస్తున్నట్లు తెలిపారు.

డిజిటల్ విధానంలో డిగ్రీ ప్రవేశాలు

- హెల్ప్‌లైన్ కేంద్రాల్లోనే కాల్ సెంటర్ ఏర్పాటు
- అక్కడే విద్యార్థుల సమస్యలకు పరిష్కారం
- రిపోర్టింగ్, ఫీజు చెల్లింపు ఆన్‌లైన్‌లోనే



మన తెలంగాణ/హైదరాబాద్ : డిగ్రీలో ప్రవేశాలకు నిర్వహించే 'దోస్త్' కౌన్సెలింగ్ మరింత సరళతరం కానుంది. పూర్తిగా పేపర్ రహితంగా ప్రవేశాల ప్రక్రియ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. డిగ్రీ ప్రవేశాల కోసం వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు అలాట్‌మెంట్ ఆర్డర్, హాల్ టికెట్ నెంబర్ కేటాయింపు వరకు పూర్తిగా కాగితం అవసరం లేకుండా డిజిటల్ రూపంలోనే నిర్వహించనున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సిబిఎస్‌ఇ, ఐసిఎస్‌సి, ఎపి ఇంటర్ బోర్డు వెబ్‌సైట్లతోపాటు విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల కోసం పదేపదే దరఖాస్తు చేసుకోకుండా 'ఇ–పాస్' వెబ్‌సైట్‌ను కూడా వెబ్‌సైట్‌కు అనుసంధానం చేసి ఆన్‌లైన్‌లోనే సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసే విధానంపై కసరత్తు చేస్తున్నారు. వీటితోపాటు సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖలకు చెందిన గురుకుల డిగ్రీ కళాశాలలను కూడా ఇదే వెబ్‌సైట్‌కు అనుసంధానం చేయనున్నారు. రాష్ట్రంలోని 'దోస్త్' హెల్ప్‌లైన్ కేంద్రాల్లోనే విద్యార్థుల సమస్యలు పరిష్కారమయ్యే ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులు హైదరాబాద్‌లోని కార్యాలయానికి వచ్చే అవసరం లేకుండా హెల్ప్‌లైన్ కేంద్రాల్లోనే సమస్యలు పరిష్కారం చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థుల సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్ కేంద్రాల్లో కాల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఉన్నత విద్యామండలి కార్యాలయంలో బుధవారం డిగ్రీ ప్రవేశాలపై జరిగిన సమావేశంలో దోస్త్ కౌన్సెలింగ్‌లో ఈ ఏడాది ఎదురైన సమస్యలు, వచ్చే ఏడాది ప్రవేశాలలో తీసుకు రావాల్సిన మార్పులపై చర్చించారు. సమావేశంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ టి.పాపిరెడ్డి, కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిట్టల్, వైస్ ఛైర్మన్, దోస్త్ కన్వీనర్ ఆర్.లింబాద్రి, మరో వైస్ ఛైర్మన్ వెంకటరమణ, కార్యదర్శి శ్రీనివాస్‌లు పాల్గొని చర్చించారు.

ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపు...?

డిగ్రీ ప్రవేశాలలో కూడా ఆన్‌లైన్ రిపోర్టింగ్ విధానం, ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు విధానం అందుబాటులోకి రానుంది. కౌన్సెలింగ్‌లో సీటు లభించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లోనే ఫీజు చెల్లించడంతోపాటు కళాశాలల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లు అందజేసే విధానానికి స్వస్తి పలుకనున్నారు. ప్రైవేట్ యజామాన్యాల ఆగడాలను కట్టడి చేసి విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు నూతన విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రభుత్వ అనుమతి లభిస్తే 2019–20 విద్యా సంవత్సరం నుంచే డిగ్రీ ప్రవేశాలలో ఈ నూతన విధానం అమలులోకి రానుంది. పాత విధానంలో తొలి విడతలో కౌన్సెలింగ్‌లో సీటు లభించిన విద్యార్థులు కళాశాలలో ఫీజు చెల్లించి ఒరిజినల్ సర్టిఫికెట్లు అందజేయాల్సి ఉండేది. దాంతో రెండవ దశ కౌన్సెలింగ్‌లో వేరే కళాశాలలో సీటు లభిస్తే మొదటి కళాశాల యాజమాన్యం ఫీజును తిరిగి ఇచ్చేందుకు ఇబ్బందులు పెడుతున్నారు. విద్యార్థులను విసిరించి చెల్లించిన ఫీజులో కొంత మొత్తాన్ని మినహాయించుకుని ఫీజు తిరిగిచ్చేవారు. విద్యార్థులు కొంత నష్టపోవాల్సి వచ్చేది. ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించే ఎంసెట్ కౌన్సెలింగ్ మాదిరిగానే డిగ్రీ ప్రవేశాలలోనూ ఆన్‌లైన్ ఫీజు చెల్లింపుతోపాటు చివరి విడత కౌన్సెలింగ్ ముగిసి కళాశాల ప్రారంభరోజున ఒరిజినల్ సర్టిఫికెట్లు అందజేసే విధానాన్ని తీసుకువచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



సిఎం కెసిఆర్‌ను కలిసి తన కుమార్తె వివాహానికి రావాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందజేసిన కోదాడ ఎంఎల్‌ఎ బొల్లం మల్లయ్య యాదవ్



సిఎం కెసిఆర్‌ను కలిసి తన కుమారుడి వివాహానికి రావాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందజేసిన అంకాపూర్ గ్రామానికి చెందిన గంగారెడ్డి



సిఎం కెసిఆర్‌ను కలిసి తన కుమారుడి వివాహానికి రావాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందజేసిన టిఎస్ ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ స్వామిరెడ్డి

నేడు బాన్సువాడకు సిఎం కెసిఆర్

మనతెలంగాణ/హైదరాబాద్ : శాసనసభ స్పీకర్ పోచారంశ్రీనివాస్ రెడ్డి తల్లి పాపవ్వ మృతితో శోక సముద్రంలో ఉన్న పోచారం కుటుంబసభ్యులను ఓదార్చేందుకు నేడు ముఖ్యమంత్రి కెసిఆర్ వెళ్లనున్నారు. బుధవారం అధికారిక కార్యక్రమాల్లో ఉండటంతో వెళ్లలేక పోయినప్పటికీ ఫోన్‌లో పోచారం శ్రీనివాస్ రెడ్డితో మాట్లాడి ఓదార్చారు. పోచారం శ్రీనివాస్ రెడ్డికి ముఖ్యమంత్రి కెసిఆర్‌కు అనేక సంవత్సరాల అనుబంధం ఉంది. ఉద్యమాల్లో కెసిఆర్ నాయకత్వంలో పనిచేశారు. అత్యంత సన్నిహితుడైన పోచారం శ్రీనివాస్ రెడ్డి తల్లి మృతి చెందడంపట్ల విచారం వ్యక్తం చేసిన సిఎం కెసిఆర్ నేడు బాన్సువాడలోని పోచారం నివాసానికి వెళ్లి పాపవ్వ చిత్రపటానికి నివాళులు అర్పించి పోచారం శ్రీనివాస్ రెడ్డి కుటుంబాన్ని ఓదార్చనున్నారు.

సంతాపం ప్రకటించిన కెటిఆర్

శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తల్లి పాపవ్వ మృతిపట్ల టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విచారం వ్యక్తం చేశారు. పాపవ్వ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి తల్లి మృతి ఆకుటుంబానికి తీరని లోటన్నారు.

ఒప్పోతో ఒప్పందం అభినందనీయం



మనతెలంగాణ/హైదరాబాద్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఉద్ఘాటించారు. దినసరి పనులకు ఆటంకం కలగకుండా నూతన ఆవిష్కరణలకోసం ప్రత్యేక ఫెలోషిప్ కూడా అమల్లో ఉందని గుర్తు చేశారు. సుప్రసిద్ధ ఒప్పో మొబైల్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకోవడాన్ని ఆయన అభినందించారు. ఈ ఒప్పందం మేరకు ఒప్పో సంస్థ రాష్ట్రంలో తమ ఉత్పత్తులను ప్రారంభించనుంది. ప్రైవేటు రంగంలోని ఈ సంస్థ ద్వారా అనేక మంది నైపుణ్యతగల యువకులకు అవకాశాలు రానున్నాయి. అలాగే వ్యాపారవేత్తలుగా మారే అవకాశాలున్నాయన్నారు. ఉప్పందం చేసుకున్న ఒప్పో సంస్థ యాజమాన్యానికి, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్‌ను అభినందించారు. కొత్తగా వ్యాపారరంగంలోకి వచ్చేవారు కాలుష్యరాహితానికి ప్రాధాన్యత ఇచ్చే రంగాలవైపు దృష్టి సారించాలని చెప్పారు. 10 తరగతి పూర్తి చేసిన 21 ఏళ్ల సాయితేజ రూపొందించిన నూతనావిష్కరణను ఆయన ప్రశంసించారు. జనవరిలో సిరిసిల్లా జిల్లా ఆసుపత్రిలో 214 ప్రసవాలు చేసినందుకు రాజన్న సిరిసిల్ల జిల్లాసుపత్రి వైద్య సిబ్బందికి, జిల్లా కలెక్టర్‌కు ట్విట్టర్‌లో శుభాకాంక్షలు తెలుపుతూ కెటిఆర్ పోస్టు చేశారు.

కేంద్రం కక్షసాధింపు చర్యలు : సురవరం



మన తెలంగాణ / హైదరాబాద్ : విజయ్ మాల్యా, నీరవ్ మోడీ లాంటివారు దేశం విడిచి వెళ్ళడానికి సహకరించిన కేంద్ర ప్రభుత్వం వారిపై కేసుల నమోదుగానీ, విచారణగానీ జరపకుండా పాత కేసులను తెరపైకి తెస్తూ పశ్చిమబెంగాల్ విషయంలో మాత్రం రాజకీయపరంగా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. కోల్‌కతాలో రెండు రోజులుగా హైడ్రామా నడుస్తోందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రాజ్యాంగ సంక్షోభాన్ని తీసుకొచ్చాయని ఆరోపించారు. శారదా చిట్ ఫండ్ విషయంలో తృణమూల్ నేతలు 2500 కోట్ల రూపాయలు నొక్కేశారని, ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం ఇప్పుడు ఈ వ్యవహారాన్ని తెరపైకి తీసుకురావడం రాజకీయ ప్రత్యర్థులపై దాడిగానే స్పష్టమవుతోందన్నారు.

సింగరేణి మాజీ ఉద్యోగి అరెస్టు

మన తెలంగాణ/హైదరాబాద్: ఉద్యోగులను అన్‌ఫిట్ చేయించి సింగరేణిలో డిపెండెంటు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ అమాయకుల నుంచి లక్షలాది రూపాయల దందాకు పాల్పడిన సంపత్ కుమార్ అనే మాజీ ఉద్యోగిని అవినీతి నిరోధక శాఖ అరెస్టు చేసింది. ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులను తన పలుకుబడితో అన్‌ఫిట్ చేయించి డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఒక ఏరియా నుంచి మరో ఏరియాలకు బదిలీ చేయిస్తామని చాలా మంది ఉద్యోగులను ప్రలోభాలకు గురిచేసి లక్షలాది రూపాయల అవినీతికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో ఈ అరెస్టు జరిగింది. ఈ ఆరోపణలపై గతంలోనే సింగరేణి విజిలెన్స్ శాఖ విచారణ చేపట్టి అతనిపై కఠిన చర్యలు తీసుకుంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా (2014లో) అతనిపై అవినీతి ఆరోపణలు వచ్చాయి.

కేంద్ర మంత్రులతో ఎంఎల్‌ఎ చందర్ భేటీ

ఎన్‌టిపిసి, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ సమస్యలపై వినతి

మన తెలంగాణ / న్యూఢిల్లీ, హైదరాబాద్ : ఎన్‌టిపిసి థర్మల్ విద్యుత్ కేంద్రం, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలకు సంబంధించిన అంశాలపై ఆ నియోజకవర్గ ఎంఎల్‌ఎ కోరుకంటి చందర్ బుధవారం ఢిల్లీలో ఇద్దరు కేంద్ర మంత్రులను కలిశారు. సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోకపోతే ఆందోళన చేపట్టక తప్పదని హెచ్చరించారు. కేంద్ర మంత్రులను కలిసిన అనంతరం చందర్ మీడియాతో మాట్లాడుతూ, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ పునరుద్ధరణ పనులు దాదాపుగా పూర్తికానున్నాయని, వీర్లపల్లి గ్రామాన్ని పునరావాసం కింద తీసుకోవాలని బహిరంగ విచారణలో కోరినా యాజమాన్యం పట్టించుకోవడం లేదని కేంద్ర మంత్రి సదానందగౌడకు వివరించారు. గతంలో పరిశ్రమలో పనిచేసిన కార్మికుల వారసులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ గాంగ్వర్‌ని కలిశామని, కాంట్రాక్టు కార్మికులు ఎక్కువ ఉన్న ఈ ప్రాంతంలో ఈఎస్‌ఐ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రి స్థాయికి పెంచాలని కోరామన్నారు.

నవీన్‌రెడ్డికి ఆలిండియా టాప్ ర్యాంక్

యుపిఎస్‌సి ఐఎఫ్‌ఎస్ ఫలితాలు వెల్లడి

మనతెలంగాణ/హైదరాబాద్ : కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(యుపిఎస్‌సి) ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్(ఐఎఫ్‌ఎస్) 2018 ప్రధాన పరీక్ష తుది ఫలితాలను బుధవారం ప్రకటించింది. ఈ పరీక్షలో మందాడి నవీన్‌రెడ్డి మొదటి ర్యాంకు సాధించారు. ఆరుషి మిశ్రా రెండవ ర్యాంకు సాధించగా, జివాని కార్తీక్ నాగ్జిభాయి మూడవ ర్యాంకు సాధించారు. ఐఎఫ్ఎస్ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు మందాడి నవీన్‌రెడ్డి మొదటి ర్యాంకు సాధించగా, పసుపులేటి మోనికా కిశోర్ 41వ ర్యాంకు, లక్ష్మి ఎన్ 50వ ర్యాంకు కైవసం చేసుకున్నారు. ఇండియన్ ఫారెస్ట్ సర్వీసుల్లో ఉద్యోగాల కోసAం గత ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ విడుదల చేసిన యుపిఎస్‌సి, డిసెంబర్‌లో ఐఎఫ్‌ఎస్ మెయిన్ పరీక్ష నిర్వహించింది. ఈ ఏడాది జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు వ్యక్తిత్వ పరీక్ష ఆధారంగా 89 మంది అభ్యర్థులను ఎంపిక చేసింది. ఎంపికైన అభ్యర్థుల వివరాలను యుపిఎస్‌సి వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొంది.

సాగర్‌కు విడుదలైన నీటి లెక్కలను పంపండి

ఈనెల 12 కల్లా పంపాలని ఎపికి బోర్డు లేఖ

మన తెలంగాణ / హైదరాబాద్ : శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు గతేడాది, ఈ ఏడాది విడుదల చేసిన నీటి వివరాలను ఈనెల 12వ తేదీకల్లా పంపాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కృష్ణా నది యాజమాన్య బోర్డు బుధవారం లేఖ రాసింది. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీటిని విడుదల చేసినప్పటికీ గతేడాది (2017–18)లో సుమారు 40 టిఎంసిలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018–19) సుమారు 30 టిఎంసిల నీరు తమకు అందలేదని తెలంగాణ ప్రభుత్వం రాసిన లేఖకు బదులుగా కృష్ణా బోర్డు ఆంధ్రప్రదేశ్‌కు ఈ లేఖ రాసింది. శ్రీశైలం నుంచి విడుదలవుతున్న నీరు నాగార్జునసాగర్‌కు చేరకుండా పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమ ప్రాంతానికి నిబంధనలకు విరుద్ధంగా వెళ్తోందని గత కొంతకాలంగా తెలంగాణ ఆరోపిస్తూ ఉంది. దీంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి బుధవారం లేఖ రాసిన కృష్ణా బోర్డు ఈ నెల 12వ తేదీకల్లా శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు విడుదల చేసిన నీటి వివరాలను తెలియజేయాలని స్పష్టం చేసింది. ఈ గణాంకాల గురించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మూడుసార్లు లేఖలు రాసినా స్పందించలేదని తెలంగాణ ప్రభుత్వం బోర్డుకు రాసిన లేఖలో ప్రస్తావించింది. తెలంగాణ ప్రభుత్వం అన్ని వివరాలు సమర్పించినా ఆంధ్రప్రదేశ్ నుంచి ఆ తరహా స్పందన లేకపోవడంతో ఈ నెల 12వ తేదీ వరకు కృష్ణా బోర్డు ఆ ప్రభుత్వానికి లెక్కలు పంపాల్సిందిగా గడువు విధించింది.

మన విద్యుత్ మనకే

● రామగుండం విద్యుత్‌లో 85% వాటా మనకే ● కేంద్ర కేబినెట్ ఆమోదం



మన తెలంగాణ / హైదరాబాద్ : మన రాష్ట్రంలో ఉత్పత్తి అయిన విద్యుత్‌లో 85% మనమే వాడుకునేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.పెద్దపల్లి జిల్లా రామగుండంలో నిర్మిస్తున్న 4000 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం ఉత్పత్తి చేసే విద్యుత్‌లో 85% వాటాను మనమే వాడుకునేలా ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన బుధవారం ఢిల్లీలో సమావేశమైన కేంద్ర మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. దీంతో రాష్ట్రానికి విద్యుత్ రంగంలో పెద్దస్థాయిలో ఉపశమనం లభించినట్లయింది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని పదమూడవ షెడ్యూలు ప్రకారం రామగుండంలో రూ. 11,811.26 కోట్ల ఖర్చుతో 4000 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించడానికి అప్పటి కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ ప్రకారం తొలి దశలో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడు యూనిట్లు, రెండవ దశలో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లు 2020 డిసెంబరు నాటికి వినియోగంలోకి రానున్నాయి. ప్రస్తుతం తొలి దశ పనులు జరుగుతున్నాయి. గతేడాది మార్చి నాటికే సుమారు రూ. 1849 కోట్ల ఖర్చు జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి తీవ్రమైన విద్యుత్ కొరత ఉన్న నేపథ్యంలో 4000 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పడానికి కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ మేరకు 2016 జనవరి 29న రూ. 11,811.26 కోట్లను మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తొలి దశ పనులు ప్రస్తుతం జరుగుతున్న సమయంలో కేంద్ర మంత్రివర్గం 85% విద్యుత్‌ను తెలంగాణ రాష్ట్రమే వినియోగించుకునేలా ఆమోదం తెలపడం గమనార్హం. జార్ఖండ్ రాష్ట్రంలోని 4000 మెగావాట్ల పట్రాటు థర్మల్ విద్యుత్ కేంద్రానికి సైతం ఇదే తరహాలో 85% విద్యుత్‌ను ఆ రాష్ట్రమే వినియోగించుకునేలా ఆమోదం తెలిపింది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ రూపొందించిన ఈ ప్రతిపాదనలను లోతుగా చర్చించిన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం విశేషం. త్వరలో కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తవుతుందని, ఆ తర్వాత విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో 85% విద్యుత్‌ను మనమే ఉపయోగించుకునేలా అనుమతి లభించడం ఆహ్వానించదగిన పరిణామం.

నేడు కేస్లాపూర్ దర్బార్

● నాగోబా జాతరకు భారీగా తరలివస్తున్న భక్తజనం
● భారీగా పోలీసు బందోబస్తు ● స్టాళ్ల వద్ద పథకాలపై అవగాహన



మన తెలంగాణ/ ఇంద్రవెల్లి : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో నాగోబా జాతర వైభవోపేతంగా కొనసాగుతుంది. బుధవారం మెస్రం మహిళలు బాన్ దేవతలకు పూజలు నిర్వహించారు. పురాతన కోనేరు నుంచి నీటిని తీసుకొచ్చి మట్టిగోలలను తయారు చేసి బానోదేవతలుగా పూజించారు. అనంతరం ఆదివాసీ గిరిజనుల సంప్రదాయ వాయిద్యాలు డోల్ సన్నాయి, కాలికోమ్ వాయిస్తూ మెస్రం పటేళ్లు వెంకట్‌రావ్, చిన్ను పటేల్, బాదిరావ్ పటేల్ ఆధ్వర్యంలో కటోడ హనుమంతురావ్ పెర్సపేన్(పెద్దదేవుడు)కు వారి సంప్రదాయ ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నైవేద్యాలు సమర్పించి సహపంక్తి భోజనాలు చేశారు. జాతరకు భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కేస్లాపూర్ జనసంద్రాన్ని తలపించింది. గురువారం ఆదివాసీ గిరిజన దర్బార్ నాగోబా జాతరలో పూజలతో పాటు ఏటా అక్కడ ఏర్పాటు చేసే దర్బార్‌కు కూడా ఎంతో విశిష్టత ఉంది. దీనికి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు కూడా హాజరవుతారు. గిరిజనులు తాము ఎదుర్కొంటున్న సమస్యల వినతిపత్రాలను అందజేస్తే అధికారులు అక్కడికక్కడే వాటిని పరిష్కరిస్తారు. ఇంగ్లండ్‌కి చెందిన మానవ పరిణామ శాస్త్రవేత్త హైమన్‌డార్ఫ్ 1946లో ఈ ప్రజా దర్బార్‌కు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి ఏటా ప్రభుత్వం దీన్ని నిర్వహిస్తోంది. నాగోబా జాతరలో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు జాతరలో వివిధ ప్రభుత్వం శాఖల అధికారులు స్టాళ్ల ఏర్పాటు చేశారు. ఎటు చూసిన జనం రంగురంగుల రాట్నాలు నలుదిక్కులు వెలసిన ఘుమఘుమలాడే తీను బండరాలు జాతర ప్రత్యేకమైన మిఠాయిలు ఆతివలకు ఆకట్టుకుంటున్న ఆభరణాలు చిన్నారుల అటబొమ్మల దుకాణాలలో భక్తులకు ఆకట్టుకుంటుంది. ఇదిలా ఉంటే ఆదివాసీ జిల్లాగా పేరొందిన ఆదిలాబాద్‌కు గురువారం సెలవు దినంగా ప్రకటిస్తు జిల్లా కలెక్టర్ దివ్య దేవరాజన్ ఉత్తర్వులు జారీ చేశారు.

వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన కలెక్టర్



మనతెలంగాణ/కొత్తకోట : అవినీతి అధికారులపై కలెక్టర్ శ్వేతమహంతి చర్యలకు పూనుకున్నారు. వనపర్తిజిల్లా కొత్తకోట మునిసిపాలటీలో జరుగుతున్న అవినీతి చర్యలను ఉటంకిస్తూ బాధితుడు వాట్సప్ ద్వారా తన బాధను వెళ్లబోసుకున్నాడు. ఈ మెసేజ్‌ను చూసిన కలెక్టర్ తక్షణమే సంబంధిత ఉద్యోగులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అధికారలును ఆదేశించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కొత్తకోట పట్టణానికి చెందిన చిలకటి హన్మమంతు అనారోగ్యానికి గురయ్యాడు. అతని పేరిట ఉన్న ఆస్తిని తన ముగ్గురు కుమారులకు సమానంగా పంచాడు. తమ తండ్రి పంచిన ఆస్థిని తమ పేర్లపై మార్చుకునేందుకు కావలసిన అన్ని పత్రాలను మునిసిపల్ అధికారులకు సమర్పిస్తూ సదరు ఆస్థిని తమ తండ్రి కోరిన విధంగా తమ ముగ్గురు అన్నదమ్ముల పేర్లపైకి మార్చాలని హన్మంతు చిన్న కుమారుడు రాము అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. ఇలా ఆస్థి ముగ్గిరి పేరిట మార్చేందుకు మునిసిపల్ కార్యాలయంలో పనిచేసే బిల్ కలెక్టర్ భాస్కర్, జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్ రెడ్డిలు డబ్బులు డిమాండ్ చేశారు. తప్పని స్థితిలో కొంత డబ్బును ముట్టజెప్పిన రాము పని త్వరగా పూర్తి చేయాలని కోరాడు. సదరు ఉద్యోగులు పని పూర్తి చేయకుండానే మరికొంత డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో విషయాన్ని ఎవరికి చెప్పుకోవాలో తెలియక మునిసిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. దీనిపై మరుసటి రోజు విచారణ జరుపుతామని హామీ ఇచ్చిన కమిషనర్ వారిపై చర్యలు తీసుకోక పోవడంతో తన బాధను ఉటంకిస్తూ కలెక్టర్ పేరిట వాట్సాప్‌లో మెసేజ్ పంపించాడు. దీంతో స్పందించిన కలెక్టర్ శ్వేతామహంతి సదరు ఉద్యోగులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సంబంధిత మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సదరు ఉద్యోగులు ఇరువురు ఇళ్ల అనుమతి, నల్లా కనెక్షన్, వారసత్వ ఇళ్లమార్పిడి తదితర పనులకు ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెతున్నాయి. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పాశ్చాత్య హోరులో మన సంస్కృతిని పరిరక్షించుకోవాలి

● సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత దీపికారెడ్డి



మన తెలంగాణ / న్యూఢిల్లీ, హైదరాబాద్ : ప్రస్తుతం దేశమంతా వీస్తున్న పాశ్చాత్య సంస్కృతి హోరులో మన సంప్రదాయ సంస్కృతి గురించి దశదిశలా చాటి చెప్పాల్సిన అవసరం ఉందని ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి దీపికారెడ్డి అన్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా 2017 సంవత్సరానికి సంగీత నాటక అకాడమీ అవార్డును బుధవారం ఢిల్లీలో అందుకున్న తర్వాత ఆమె మీడియాతో మాట్లాడుతూ, ఇప్పటికి 47 సంవత్సరాలుగా దేశ విదేశాల్లో కూచిపూడి నృత్య ప్రదర్శనలను ఇస్తున్నానని, తనకు తల్లి నుంచి వారసత్వంగా వచ్చిన ఈ నాట్యాన్ని భావి తరాలకు అందించాల్సిన గురుతరమైన బాధ్యత ఈ అవార్డుతో తనపైన పడిందన్నారు. ఎంతో మంది సుప్రసిద్ధ కళాకారుల సమక్షంలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోసం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ గుర్తింపుతో తనపై బాధ్యత మరింత పెరిగిందని, కూచిపూడి నాట్యాన్ని భావి తరాలకు అందించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. తప్పకుండా తన వంతుగా ఆ కృషి చేస్తానని ఈ సందర్భంగా మాట ఇస్తున్నానని నొక్కిచెప్పారు. తనకు కూచిపూడి నాట్యం నేర్పిన ఎంతో మంది గురువులు ఉన్నప్పటికీ ప్రధాన గురువైన వెంపటి చినసత్యం పెట్టిన భిక్షేనని అన్నారు. సంగీతం, నాట్యం, జానపదం, సంప్రదాయం, రంగస్థలం తదితర వివిధ ప్రక్రియల్లో మొత్తం 39 మందికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సంగీత నాటక అకాడమీ అవార్డులను (2017 సంవత్సరానికి) బుధవారం ఢిల్లీలో అందజేశారు. ఇందులో తొమ్మిది మందికి రంగస్థలంలో, పది మందికి సంప్రదాయ/జానపద రంగాల్లో, తొమ్మిది మందికి నృత్య రంగంలో, పదకొండు మందికి సంగీత రంగంలో అవార్డులు ప్రదానం చేశారు.

జీవన ప్రమాణాలు పెరిగినప్పుడే అభివృద్ధి

● రాష్ట్ర వ్యాప్తంగా సమీకృత మార్కెట్ల ఏర్పాటుకు సిఎం కెసిఆర్ కృషి ● పరిశుభ్రతను పాటించినప్పుడే రోగాల నివారణ సాధ్యం : హరీశ్‌రావు





మన తెలంగాణ / సిద్దిపేట ప్రతినిధి : ప్రజల జీవన ప్రమాణాలు పెరిగినప్పుడే అసలైన అభివృద్ధి అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో రూ.20 కోట్లతో నిర్మించిన సమీకృత మార్కెట్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మట్లాడారు. రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో సమీకృత మార్కెట్లు ఏర్పాటు చేసేందుకు సిఎం కెసిఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని మొండా మార్కెట్‌ను సందర్శించాలని అన్ని జిల్లాల కలెకర్లకు సిఎం కెసిఆర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. సమీకృత మార్కెట్ల ఏర్పాటుతో కూరగాయాలు, మాంసంతో పాటు ప్రతి వస్తువు ఒకేచోట లభిస్తుందన్నారు. ప్లాస్టిక్ వాడకంతో క్యాన్సర్ లాంటి అనేక వ్యాధులు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్లాస్టిక్‌ను నివారించి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు ముందకు సాగలన్నారు. సిద్దిపేట పట్టణంలో ఆరు ఎకరాల విస్తీర్ణంలో ఈ సమీకృత మార్కెట్‌ను సకల హంగులతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్నింటి కంటే ప్రజల ఆరోగ్యమే ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రతి ఒక్కరు ఇంటిని ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటారో అదే తరహాలో గ్రామాలు, పట్టణాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. పరిశుభ్రత పాటించనప్పుడే రోగాలను సైతం నివారించవచ్చని అన్నారు. త్వరలోనే సిద్దిపేటలో కబేలాను నిర్మించి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ మడుపు భూంరెడ్డి, జిల్లా కలెక్టర్ దేవరకొండ కృష్ణభాస్కర్, జాయింట్ కలెక్టర్ పద్మాకర్, మున్సిపల్ ఛైర్మన్ కడవేర్గు రాజనర్సు, సుడా ఛైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ వేముల వెంకట్‌రెడ్డి, వైస్ ఛైర్మన్లు నందిని శ్రీనివాస్, అత్తర్ పటేల్, మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, రవికుమార్, ఎస్ఈ ఉమామహేశ్వర్, సెక్రటరీ లోకిని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పేదల విద్యపై చిన్నచూపు

సంపాదకీయం

బాధ్యతాయుతులైన నిపుణ పౌరులను తయారు చేసి ఆధునిక భారతాన్ని త్వరితంగా నిర్మించడానికి దోహదపడే ప్రధానాంశం శాస్త్రీయ విద్య. ఈ రంగంలో విశేష ఫలితాలు సాధించుకోగలిగే దేశమే ప్రగతి పథంలో పరుగులు తీయగలుగుతుంది. సామాజికాది రుగ్మతల నుంచి బయటపడి ముందుకు దూసుకు వెళ్లగలుగుతుంది. దురదృష్టవశాత్తు మన దేశంలో విద్యారంగం, ముఖ్యంగా పేదలకు అందుబాటులో ఉండే ప్రభుత్వ విద్య అత్యంత నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురి అవుతున్నది. గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఐదో తరగతి విద్యార్థుల్లో దాదాపు సగం మందికి రెండో తరగతి వాచకం చదవడం చేతకాదని, 70 శాతం మంది లెక్కల్లో కనీస తెలివి తేటలు సైతం లోపించినవారని 2018 సంవత్సరపు వార్షిక విద్యా స్థితి నివేదిక వెల్లడించింది. ఇటువంటి దుస్థితిలోని విద్యకు కేంద్రం 2019– 20 తాత్కాలిక బడ్జెట్‌లోనూ అరకొరగానే నిధులు విదిలించింది. బడ్జెట్‌లో మొత్తం విద్యా రంగానికి కేటాయించింది రూ. 93,847 కోట్లు మాత్రమేనని, ఇందులో సమగ్ర శిక్షా అభియాన్ కింద సార్వత్రిక ప్రాథమిక విద్య లక్ష్య సాధనకు ఇచ్చింది రూ. 38,572 కోట్లని, అవసరంతో పోల్చుకుంటే ఇది ఏ మూలకూ చాలదని నిపుణులు పెదవి విరుస్తున్నారు.


2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో పాఠశాల మొగమెరుగని పిల్లలు 8 కోట్ల 40 లక్షల మంది ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 9 లక్షల 30 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దేశ వ్యాప్తంగా రెండు లక్షల ప్రభుత్వ పాఠశాలలు మూతబడ్డాయి. విద్యా హక్కు చట్టాన్ని తీసుకు వచ్చి ఎనిమిదేళ్లు గడిచిపోయాయి. కేవలం 12 శాతం పాఠశాలలే ఆ చట్టం ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయంటే మన విద్యా రంగ ప్రగతి ఎంతగా కుంటుపడి ఉన్నదో స్పష్టపడుతున్నది. ముందు ప్రాథమిక స్థాయి వరకు అటు పిమ్మట 10వ తరగతి దాకా దేశంలోని పిల్లలందరూ చదువుకునేలా చేసే లక్ష్యాన్ని 2030 నాటికి సాధించాలని చెప్పుకున్న సంకల్పం నెరవేరే అవకాశాలు అల్ప కేటాయింపులతో బొత్తిగా ఉండబోవని చెప్పక తప్పదు. పేద పిల్లలకు, ముఖ్యంగా దారిద్ర్య కుటుంబాలలోని ఆడపిల్లలకు చదువు నేర్పి వికాసవంతులను చేయడమనేది ఎన్నడూ తీరని కలగా, ఎండమావిగా మిగిలిపోనున్నట్టు రూఢి అవుతున్నది.

కింది మధ్య తరగతి కుటుంబాలలోని 15 ఏళ్ల వయసుగల ప్రతి ఒక్క బాలిక లేదా బాలుడు ప్రాథమిక విద్యా స్థాయి పాఠ్య పుస్తకం చదవ గలిగి, ప్రారంభ గణిత జ్ఞానం కలిగి ఉంటే స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) 80 ఏళ్లలో 28 శాతం పెరుగుతుందని 2015 నాటి ఆర్థిక సహకారం, అభివృద్ధి నివేదిక అంచనా వేసింది. ఇప్పుడు దేశంలో పేద పిల్లల్లో పేరుకు పోయిన నిరక్షరాస్యతను బట్టి చూసుకుంటే ఇది ఎంతమాత్రం సాధ్యంకాని లక్ష్యమని బోధపడుతుంది. దేశమంతటా ప్రాథమిక, సెకండరీ స్థాయిల్లోని 92,275 ప్రభుత్వ పాఠశాలలు ఒకే ఒక్క టీచర్‌తో నడుస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ప్రతి నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లో ఒకదానికి విద్యుత్ సదుపాయం లేదు. పేద జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో నాసిరకం విద్యా ప్రమాణాలున్నాయి. ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని అత్యధిక జిల్లాల్లో ఈ పరిస్థితి నెలకొని ఉన్నది. ప్రభుత్వ పాఠశాలల అధ్యాపకుల తీరు పేద పిల్లల విద్యను బలిగొంటున్న మరో అవలక్షణం.

విద్యా రంగానికి జిడిపిలో 6 శాతాన్ని కేటాయించాలని కొఠారీ కమిషన్ 1966లో చేసిన సిఫారసు ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం 4 శాతం కంటే తక్కువే కేటాయిస్తున్నారు. విద్యకు కేటాయింపుల్లో 2016లో మనకంటే ఒకింత తక్కువ స్థాయిలోనున్న చైనా, రష్యా, అఫ్ఘానిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో చదువుల ప్రమాణాలు మనతో పోల్చుకుంటే మెరుగ్గా ఉన్నట్టు ఒక అధ్యయనం స్పష్టం చేసింది. సరైన కేటాయింపులు చేయడం ఒక ఎత్తయితే ఆ సొమ్ముతో నాణ్యమైన చదువులు లభించేలా చూడడానికి బహుముఖ వ్యూహ రచన చేసి పకడ్బందీగా అమలు పరచడం మరొక ఎత్తు. దేశంలోని ప్రభుత్వ పాఠశాలలకు సరైన భవనాలు, ఫర్నీచర్, మరుగుదొడ్లు ముఖ్యంగా బాలికలకు ప్రత్యేక సదుపాయాలు లేకపోవడమనేది ఇప్పటికీ స్పష్టంగా కొట్టవచ్చినట్టు కనిపిస్తున్న లోపం. ప్రభుత్వ రంగంలో విద్య ఇలా కునికి, కుంగి, కునారిల్లుతుంటే ప్రైవేట్‌లో ఇది కేవలం లాభార్జన దృష్టితో కూడిన వ్యాపార స్థాయికి చేరుకొని చాలీచాలని ఆదాయ వనరులుండే మధ్య తరగతి తల్లిదండ్రులను దారుణంగా దోచుకుంటున్నది. మన సాంకేతిక విద్యా కళాశాలల నుంచి పట్టభద్రులై వచ్చే యువత ఉద్యోగాలు దొరకక వీధులు ఏలుతున్నారు. నేర్చుకుంటున్న విద్యకు సమాజ అవసరాలకు పొంతనలేని పరిస్థితి నిరుద్యోగాన్ని ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీగా మారింది. ఈ పరిస్థితిలో తక్షణ తరణోపాయాలను కనుగొని యుద్ధ ప్రాతిపదికన అమల్లోకి తేవడం పాలకుల గురుతర బాధ్యత.

మోడీ ప్రతిష్ఠను పెంచే 'మాల్యా రాక'

త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగబోతున్నాయి. 87 కోట్ల 50 లక్షల మంది భారతీయులు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునే అతిపెద్ద ఎన్నికల పండగ. ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి ఎన్నికవ్వడానికి కావలసిన ఏర్పాట్లు చురుగ్గా చేసుకుంటున్నట్లు కనబడుతోంది. బ్యాంకులను ముంచేసి పారిపోయిన పెద్దలను వెనక్కి తీసుకొచ్చే కార్యక్రమంలో బిజీగా ఉన్నారు. ఒక లిక్కర్ టైకూన్, మరో ఆయుధ వ్యాపారి, మరో వజ్రాల వ్యాపారి, ఇంకో లాబీయిస్టు ఇలా పారిపోయిన వారి జాబితా పెద్దదే ఉంది. అందులో కొందరి ఘర్ వాపసీకి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ ఘరానా మోసగాళ్ళను కోర్టులో ప్రవేశపెట్టడం ద్వారా తమ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు చెప్పకోవాలనుకుంటున్నారు.



విజయ్ మాల్యా బ్రిటన్‌లో ఉన్నాడు. ఆయన్ను వెనక్కు తీసుకువచ్చే ప్రయత్నాలు చివరకు ఫలించినట్లే కనబడుతోంది. ఆయన



కింగ్ ఫిషర్ ఎయిర్ లైన్స్ నడిపించాడు. దాని కోసం అప్పులు చేశాడు. దాదాపు 9300 కోట్ల రూపాయల స్కామిది. ఆయన్ను ఇండియాకు అప్పగించే విషయమై ఉత్తర్వులపై బ్రిటన్ హోం సెక్రటరీ సాజిద్ జావిద్ సంతకాలు చేశారు. విజయ్ మాల్యాను వెనక్కు తీసుకువచ్చే ఈ ప్రయత్నాల కన్నా ముందు, అగస్టా వెస్ట్ ల్యాండ్ కుంభకోణంలో నిందితుడు క్రిస్టియన్ మిషెల్‌ను ఇండియాకు తీసుకురాగలిగారు. ఈ ఆయుధ వ్యాపారి 5400 కోట్ల రూపాయల స్కాంలో నిందితుడు. ఆయనతో పాటు దీపక్ తల్వార్ అనే మరో నిందితుడిని దుబాయ్ నుంచి ఇండియాకు తీసుకురాగలిగారు.

వీళ్ళను ఇండియా తీసుకురావడం అనేది మోడీ ప్రభుత్వానికి చాలా అవసరం. అవినీతిని తొలగిస్తామని ఆయన వాగ్దానం చేశాడు. ఆ దిశగా తీసుకున్న ప్రయత్నాలేవీ ఇంత వరకు కనిపించడం లేదు. బ్యాంకులు ఘరానా మోసగాళ్ళ వల్ల దివాలా తీసే స్థితికి చేరుకున్నాయి. నల్లడబ్బు తిరిగి దేశానికి తీసుకువస్తామన్నారు. అది సాధ్యం కాలేదు. ఇచ్చిన హామీలేవి నిలబెట్టుకున్నది లేదు. రాష్ట్రాల ఎన్నికల్లో వరుస ఓటములు తప్పలేదు. ఈ నేపథ్యంలో ఘరానా మోసగాళ్ళను కొందరినైనా పట్టుకుని వెనక్కు తీసుకువచ్చి కోర్టులో నిలబడితే ప్రజల్లో విశ్వసనీయత పెరుగుతుంది. అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్న నాయకుడిగా మోడీ ప్రతిష్ఠ పెరుగుతుంది. వ్యవస్థను ప్రక్షాళన చేయడానికి ప్రయత్నిస్తున్న హీరోగా ఆయన కనిపిస్తారు. ఎన్నికల్లో ప్రజలు అప్పుడు కనిపించే దృశ్యాలనే ముఖ్యంగా గమనిస్తారు. పాత వ్యవహారాలు సాధారణంగా మరిచిపోతారు. కింగ్ ఫిషర్ మాల్యాను, వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీని వెనక్కు తీసుకువస్తే ప్రతిపక్షాల ఆరోపణలకు జవాబిచ్చినట్లవుతుంది. మోడీ సర్కారు బడా వ్యాపారులకు, బ్యాంకులను ముంచేవారికి కొమ్ము కాస్తుందన్న విమర్శ నుంచి బయటపడవచ్చు. ప్రతిపక్షాల వద్ద ప్రభుత్వాన్ని విమర్శించే అవకాశమే మిగలదు. ఇప్పటికే క్రిస్టియన్ మిషెల్ ను, దీపక్ తల్వార్ ను తీసుకురావడం అనేది మోడీ ప్రతిష్ఠను కొంతవరకు పెంచింది. అవినీతిని ఏమాత్రం సహించని నాయకుడిగా ఆయన గురించి ప్రచారం చేసే అవకాశం కల్పించింది. కాని మరోవైపు క్రిస్టియన్ మిషెల్, తల్వార్, మాల్యా, నీరవ్ అందరూ తమపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తున్నారు.

ఘరానా మోసగాళ్ళను, విలాసవంతమైన జీవితం గడుపుతూ మీడియాలో కనిపించే మాల్యా వంటి వారిని చట్టానికి అప్పగించడమన్నది ప్రజలపై చాలా ప్రభావం వేస్తుంది. తప్పు చేసినవాడు ఎంత పెద్దవాడయినా మోడీ వదిలిపెట్టడన్న అభిప్రాయం కలుగజేస్తుంది. నోట్లరద్దు, జిఎస్‌టి, నిరుద్యోగం, అధిక ధరలు వగైరా అనేక వైఫల్యాల గురించి ప్రజలు ఆలోచించకుండా ఈ ఎత్తుగడ పని చేస్తుందని చాలా మంది భావిస్తున్నారు.

అవినీతి వ్యతిరేక యుద్ధంలో ఇది గొప్ప విజయంగా బిజెపి నేతలు ప్రచారం చేస్తున్నారు. కాని ప్రజలు ఇప్పుడు విజయ్ మాల్యాకు పడే శిక్ష గురించి ఆలోచిస్తారా లేక ఉద్యోగాల్లేక, ఉపాధి లేక రోడ్డున పడిన తమ బతుకుల గురించి ఆలోచిస్తారా అన్నది ముఖ్యమైన ప్రశ్న. ఆసియా రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ కు చెందిన కేథరిన్ అడెనే ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేమి, వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగం వంటి సమస్యలే ప్రముఖంగా ఎన్నికల్లో ఉంటాయి. విజయ్ మాల్యాను తీసుకొచ్చినా, నీరవ్ మోడీని కోర్టులో నిలబెట్టినా సగటు పౌరుడికి దానివల్ల ఏమైనా ప్రయోజనం కలుగుతుందా లేదా అన్నది మాత్రమే చూస్తారు. అయితే ఇటీవల మధ్యంతర బడ్జెటులో దాదాపు యాభైవేల కోట్ల రూపాయల తాయిలాలు మోడీ పంచేశారు. రైతులకు ఆదాయ హామీ ఇచ్చారు. డైరెక్ట్ క్యాష్ ట్రాన్స్ ఫర్ ప్రకటించారు. పెన్షన్లు ఇచ్చారు. మధ్యతరగతికి పన్నుల్లో రాయితీ ఇచ్చారు. ఇవన్నీ ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం కలిగించే విషయాలు. కాబట్టి దీనివల్ల బిజెపికి కొంత ప్రయోజనం తప్పక లభిస్తుందని మరికొందరి అభిప్రాయం. మరోవైపు విజయ్ మాల్యా వంటి ఘరానా మోసగాడిని తీసుకురావడంతో అవినీతి వల్ల దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను బాగు చేస్తున్నామని ప్రచారం చేసుకుంటారు. విజయ్ మాల్యా విలాస పురుషుడిగా ప్రపంచమంతా తిరుగుతూ, విలాసవంతమైన జీవన విధానం గడుపుతున్న ఫోటోలు చాలా వచ్చాయి. అలాంటి వాడిని తీసుకొచ్చి తగిన బుద్ధి చెప్పిన నాయకుడు, పేదలకు అవసరమైన సహాయం అందించిన ప్రధానిగా మోడీ పట్ల ఆదరణ పెరగవచ్చు. విజయ్ మాల్యాను ఇండియా పంపించడం గురించి అక్కడి హోం సెక్రటరీ తీసుకున్న నిర్ణయం గురించిన వార్తను మమతా బెనర్జీ వార్త మీడియాలో మింగేసింది. విజయ్ మాల్యాను తీసుకువచ్చే విషయంలో చేస్తున్న ప్రయత్నాలకు సంబంధించి ఒక పెద్ద విజయం బిజెపికి లభించినప్పుడే మమతా బెనర్జీ వార్త మీడియాను ఆక్రమించుకుంది. పశ్చిమ బెంగాల్లో సిబిఐ తీసుకున్న చర్యల వెనుక కేంద్రప్రభుత్వ ప్రమేయం ఉందో లేదో తెలియదు కాని, ఈ చర్యల వల్ల మమతా బెనర్జీకి రాజకీయంగా మంచి అవకాశం దొరికింది. దేశ వ్యాప్తంగా ఇప్పుడు చర్చ మోడీ వర్సెస్ దీదీగా మారిపోయింది. తమకు సంబంధించిన సానుకూల వార్తల ప్రచారం విషయంలో బిజెపి పొరబాటు చేస్తుందా? ఇలాంటి సందర్భాల్లోనే వివాదాస్పద వార్తలు వచ్చే చర్యలు తీసుకోవడం ఏం సూచిస్తోంది? బిజెపి ప్రచార వ్యూహంలో తడబడుతుందా? అనే ప్రశ్నలు పుడుతున్నాయి. మరోవైపు రాహుల్ గాంధీ నెమ్మదిగా మీడియాలో తన ఉనికిని విస్తరిస్తున్నారు. ఈ వార్తలు వస్తున్నప్పుడే ఆయన ఇంటర్వ్యూ కూడా హిందూస్తాన్ టైమ్స్ వంటి పత్రిక ప్రచురించింది. మీడియాలో ఎవరెంత స్థలం సంపాదిస్తారనేదే చివరకు ప్రజాభిప్రాయంపై ప్రభావం వేస్తుంది. విజయ్ మాల్యా, క్రిస్టియన్ మిషెల్‌లను తీసుకురావడం వల్ల ఎన్నికల్లో ఎంత ప్రయోజనం అనేది బిజెపి ఎంతగా ఈ వార్తలకు మీడియాలో అవకాశం సంపాదిస్తుందన్న విషయంపై ఆధారపడి ఉంది. ఇప్పుడున్న పరిస్థితి పరిశీలిస్తే బిజెపి వెనకబడినట్లే కనిపిస్తోంది.

* ఉమైర్

విచ్చలవిడి వీడియో క్రీడలు



బి.నర్సన్
9440128169

'యే పబ్‌జీవాలా హై క్యా?' ప్రధాని మోడీ నోటి నుండి ఆశ్చర్యం ప్రదర్శిస్తూ వచ్చిన ప్రశ్న ఇది. 'పబ్‌జి మొబైల్ గేమ్ ఇంకా ఉందా?' అని ఓ తల్లిని ఎదురు ప్రశ్నించిన సందర్భమిది. జనవరి 28న ప్రధాని పరీక్షా పే చర్చ రెండో విడత కార్యక్రమాన్ని విద్యార్థుల, ఉపాధ్యాయుల, తల్లి దండ్రుల సమక్షంలో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆ చర్చా కార్యక్రమంలో ఓ తల్లి తన కొడుకు 'వీడియో గేమ్స్‌కు అలవాటుపడి చదువును అశ్రద్ధ చేస్తున్నాడు. దానికి పరిష్కారం చూపండి' అని ప్రధానిని కోరింది. సమాధానంగా ఆయన పబ్‌జి క్రీడను ప్రస్తావిస్తూ ఇంటర్నెట్ వల్ల లాభాలున్నాయి, నష్టాలున్నాయి. పిల్లల కదలికలపై తల్లిదండ్రులు కన్నేసి ఉంచి వారిని సన్మార్గంలో నడపాలి అన్నారు.

ఇంటర్నెట్ ధరలు అందుబాటులోకి వచ్చి స్మార్ట్ ఫోన్లు పెరగడంతో పిల్లలు వీడియో గేమ్స్ వైపు ఆకర్షితులైనారు. మారాం చేయకుండా పెట్టింది తింటారనో, అల్లరి తగ్గిపోతుందనో తల్లిదండ్రులు సైతం చిన్నారుల చేతికి స్మార్ట్ ఫోన్ ఇస్తున్నారు. ఫోన్‌ను లాక్కుంటే వారు గగ్గోలు పెట్టి, అదుపు చేయలేని పరిస్థితి వచ్చేసింది.

వీడియో క్రీడల్లో క్యాండీక్రష్, టెంపుల్ రన్ స్థాయి మాములు కాలహరణ ఆటలు సరేసరి. అయితే ఇప్పుడు రణరంగ బీభత్సాన్ని చూపి ఎదురు సైన్యాన్ని అంతం చేసి గెలుపు సొంతం చేసుకోవాలనే ఉత్కంఠను రేపే యుద్ధ తంత్ర క్రీడలు మొబైల్ తెరపైకి వచ్చాయి. వీటిలో పబ్‌జి, ఫోర్ట్‌నైట్, ఫైర్‌ఫ్రీ ప్రధానమైనవి. ప్లేయర్ అన్‌నోన్ బ్యాటిల్ గ్రౌండ్‌కు పొట్టిపేరే పబ్‌జి.

పబ్‌జిని చైనాకు చెందిన టెన్‌సెంట్ హోల్డింగ్ లిమిటెడ్ అనే సంస్థ మార్చి 2018లో తెరపైకి తెచ్చింది. మొదలు కంప్యూటర్ తెరకే పరిమితమైన ఈ ఆట స్మార్ట్ ఫోన్‌లో సైతం రావడంతో బాలలు, విద్యార్థులు, యువత వెర్రిగా దీనివెంట పడుతున్నారు. వంద మంది సైన్యంతో, వివిధ రకాల ఆయుధ సామాగ్రితో ఆడే ఈ యుద్ధ క్రీడలో చివరికి మిగిలే వాడే విజేత. ఎదురైన వాన్ని చంపుతూ పోవడమే ఆటలోని అసలు అంశం. వేగం ఎదురొచ్చే ప్రత్యర్థిని తప్పించుకుంటూ మట్టుపెట్టే తీరులో ఆటగాడి ఆసక్తి బహురెట్లు పెరుగుతూ పోతుంది. ఆటను వదలలేని సంకట పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ఆన్‌లైన్ గేమ్ బారినపడి పిల్లలు ఎలాంటి అఘాయిత్యానికైనా సిద్ధపడుతున్నారు.

పబ్‌జి గేమ్ ఆడుతూ ఆడుతూ అలాంటి సాహసాలు చేయబోయి చైనాలో 13 ఏళ్ల బాలుడు గతేడాది ఆగస్టులో నాలుగంతస్థుల మేడ నుంచి దూకి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. తాజాగా ముంబైలో ఓ 18 ఏళ్ల అబ్బాయి పబ్‌జి గేమ్ ఆడేందుకు మొబైల్ ఫోన్ కొనియ్యమని తల్లిదండ్రులతో పోరుపెట్టుకున్నాడు. దాన్ని ఆడేందుకు రూ. 37 వేల ఖరీదు గల ఫోన్ కావాలని పట్టుపట్టాడు. అంతపెద్ద మొత్తం ఇచ్చేందుకు తల్లిదండ్రులు తిరస్కరించడంతో తాడుతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఈ సంఘటనల వల్ల పబ్‌జి లాంటి ఆన్‌లైన్ ఆటలు యువతను ఎలా పెడదారి పట్టిస్తున్నాయో గ్రహించవచ్చు. జాతీయ మానసిక ఆరోగ్య, చికిత్స సంస్థ దృష్టికి ఆటగాళ్ళ విచిత్ర, హింసాత్మక ప్రవర్తన గురించి కేసులు వస్తున్నాయి. పిల్లలు తమను తాము హింసించుకొని గాయాలు చేసుకుంటున్నారని వైద్యులు అంటున్నారు. విద్యార్థులు క్లాసులు ఎగ్గొట్టి పార్కుల్లో గంటల తరబడి ఈ ఆట ఆడుతున్నారు. క్లాసు రూముల్లో కూడా చాటుమాటుగా ఆడుతున్న సందర్భాలున్నాయి. ఆటలోని ఉత్కంఠ బారినపడి ఫోన్ కాల్స్ కూడా రిసీవ్ చేసుకోవడం లేదు. ఇంకా విచిత్రమేమిటంటే బెంగళూరు ఏర్ పోర్ట్‌లో ఒకాయన ఈ ఆటలో నిమగ్నమై తానెక్కవలసిన విమానాన్ని పట్టించుకోలేకపోయాడు. 2018 ఎండాకాలం సెలవుల్లో దేశంలోని యువత లక్షల సంఖ్యలో ఈ క్రీడతో కాలక్షేపం చేశారట. తెల్లవారి నాలుగు గంటల దాకా అదే ఆటలో కూరుకుపోయారని తల్లిదండ్రులు అంటున్నారు. నాలుగు నెలల్లో కోటి మంది ఈ ఆటను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు లెక్కలున్నాయి. ఆటకు బానిసలైన పిల్లలు చదువులో దెబ్బతినడంతో మానసిక సంతులనం కోల్పోతున్నారు. ఈ మాటను ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ధ్రువీకరించింది.

అయితే ప్రభుత్వం దీనిపై తీసుకుంటున్న చర్యలు మాత్రం ఏమీలేవని చెప్పవచ్చు. చట్టపరంగా ఈ క్రీడలను నిషేధించటానికి వీటిలో ఎలాంటి చట్ట వ్యతిరేక అంశాలు లేవు. తల్లిదండ్రులు, విద్యా సంస్థలు తగు జాగ్రత్తలు తీసుకోవడమే తక్షణ నివారణ మార్గం.

బెంగళూరులో కొన్ని పాఠశాలలు తమ విద్యార్థుల తల్లిదండ్రుల నుద్దేశించి కొన్ని సూచనలు చేశాయి. ఆన్‌లైన్ గేమ్స్‌కు దూరంగా ఉంచుతూ, పిల్లల మానసిక స్థితులను గమనించాలని కోరాయి.

ఈ మధ్య గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం పబ్‌జిని నిషేధిస్తూ దీనిపట్ల కఠినంగా వ్యవహరించాలని జిల్లా విద్యాధికారులను ఆదేశించింది. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంస్థ పబ్‌జిని నిషేధించాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. జనవరి 16న జమ్ము – కశ్మీర్ విద్యార్థుల సంఘం ఆ రాష్ట్ర గవర్నర్ సత్యపాల్ నాయక్‌ను ఈ విధ్వంస క్రీడను నిషేధించాలని కోరింది. దీని ప్రభావంతో విద్యార్థులు పది, ఇంటర్ పరీక్షల్లో విఫలమయ్యారని తమ వినతి పత్రంలో పేర్కొంది. ఈ క్రీడను సృష్టించిన సంస్థగల చైనా దేశమే గత డిసెంబర్ నుండి దీన్ని నిషేధించింది.



వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తమ కాలేజీ ఆవరణలో హాస్టళ్లలో ఈ క్రీడను నిషేధించి, ఖాళీ సమయం ఉన్న విద్యార్థులు ఖోఖో, కబడ్డీ లాంటి ఆటలు ఆడుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

ఫోర్ట్‌నైట్ అనే మరో ఆన్‌లైన్ గేమ్ దెబ్బకు లండన్‌లో ఈ మధ్య 200 సంసారాలు విడాకుల దాకా వెళ్లాయట.

తల్లిదండ్రులు, విద్యా సంస్థల జాగ్రత్తలకు తోడుగా జనవరి 25న అహద్‌నిజాం అనే ముంబై లోని ఆరవ తరగతి విద్యార్థి పబ్‌జి నిషేధాన్ని కోరుతూ బొంబాయి హైకోర్టులో పిల్ వేశాడు. తన తల్లి ద్వారా ఈ ప్రజాప్రయోజక వ్యాజ్యాన్ని కోర్టుకు అందించాడు. అంతటితో ఆగక మహారాష్ట్ర ముఖ్యమంత్రికి, హోం, విద్యామంత్రులకు, సిటీ పోలీసు కమిషనర్‌కు ఈ విషయంపై లేఖలు రాశాడు.

గత రెండు నెలల్లో ఈ క్రీడను తమ మొబైళ్లలోకి దింపుకున్న వాళ్లలో మన దేశపు పిల్లలే ఎక్కువ. వింతైన విషయమేమిటంటే 2018లో పబ్‌జిని ఉత్తమ క్రీడగా, అత్యంత పోటీగల, ప్రీతిపాత్రమైన క్రీడగా గుర్తిస్తూ మూడు బహుమతులను గూగుల్ ప్రకటించింది. ఈ విషయాన్ని పబ్‌జి మొబైల్ సంస్థ తమ ట్విట్టర్‌లో ఉంచింది.

ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్ ఉన్న, ప్రచారం ఉపయోగంలో ఉన్న ఇంటర్‌నెట్ క్రీడలను ఆపడం చట్టపరంగానో, ప్రభుత్వం ఆదేశాల ద్వారానో కట్టడి చేయడం సాధ్యపడదు. వాటి వల్ల కలిగే దుష్పరిణామాలను, మితిమీరి ఆడడంవల్ల వచ్చే మానసిక రుగ్మతలను అందరికీ తెలిసేలా చూడాలి. ప్రధానంగా విద్యా సంస్థలు తొలి అడుగు వేయాలి. తల్లిదండ్రులు తమ పిల్లల మొబైల్ ఫోన్ల వాడకంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వాలు కదిలేదాకా ఎదురు చూస్తే పరిణామాలు చేయి దాటవచ్చు.

ఈ పేజీకి రచనలు పంపవలసిన మెయిల్ :
editor@manatelangana.org

ప్రజాబంధు తెలంగాణ గాంధీ
భూపతి కృష్ణమూర్తి




మునుగోటి యాదయ్య గుప్త
9963099619

భారత జాతీయోద్యమంలో తెలంగాణ ప్రాంత నాయకులెందరో అగ్రశ్రేణిలో నిలిచి చరిత్రలో గణనీయమైన స్థానాన్ని సాధించారు. స్వాతంత్ర్య భారతదేశంలో పలువురు తెలంగాణ నాయకులు అత్యంత ప్రతిభావంతంగా పాల్గొన్నారు. వారు కాళోజీ నారాయణ రావు, ఎంఎస్. రాజలింగం, మధుసూదనా రావు, మొగలయ్య, బి.ఎన్. గుప్త మొదలగు కోవకు చెందిన వారిలో ఒకరు భూపతి కృష్ణమూర్తి.

కరీంనగర్ జిల్లా భీమదేవ్ పల్లి మండలం, ముల్కనూరు గ్రామంలో రాఘవులు – భ్రమరాంబ దంపతులకు 1926, ఫిబ్రవరి 21న వరంగల్ అమ్మమ్మ ఇంట్లో జన్మించారు. 3వ తరగతి వరకు ముల్కనూరులో, 4వ తరగతి నుండి 8వ తరగతి బోర్డు పరీక్ష వరకు హనుమకొండలో విద్యాభ్యాసం చేశారు. మేనమామ కుమార్తె కనకలక్ష్మి ని అర్ధాంగిగా స్వీకరించి వ్యాపారంలో క్రమక్రమంగా ప్రావీణ్యం సాధించారు. నాటి జాతీయ భావాలతో ప్రభావితుడై వ్యాపారం చేస్తూ నాయకుల సమావేశాలతో ప్రేరణ పొందారు. మిత్రులతో సమావేశమై 1943లో నేషనల్ క్లబ్‌ను స్థాపించి కార్యదర్శిగా ఉంటూ కబడ్డీ, బాల్ బాట్మింటన్, ఈత, వ్యాయామ పోటీలు నిర్వహించి యువతను ఉత్తేజపర్చేవారు. నాడు బహుళ వ్యాప్తి చెందిన ఆంధ్రమహాసభ కార్యక్రమాలతో సన్నిహితంగా ఉంటూ టి. హయగ్రీవాచారి అధ్యక్షునిగా ఉన్న వరంగల్ పట్టణ కాంగ్రెస్‌కు 1941 నుండి 1946 వరకు కోశాధికారిగా పని చేసి మన్నలు పొందారు.

1944 అక్టోబర్ 2 గాంధీజీ జన్మదినం సందర్భంగా జరిగిన సభకు వార్ధా వెళ్లి 12 రోజులు గాంధీతో గడిపారు. రోజు భజనలు చేస్తూ సత్యం, అహింస మీద ఉపన్యాసాలు విన్నారు. తప్పు చేస్తే సహించవద్దు, శాంతియుతంగా ఎదిరించాలి. ఎదిరించడం వీలుపడకపోతే ఖండించాలని మహాత్ముని ఉపన్యాసాలు విని గాంధీ శిష్యరికం సంపాదించాడు కృష్ణమూర్తి. దుకాణానికి వచ్చే ప్రజలను బ్రిటీష్ వారిపై తిరుగుబాటు చేయాలని ప్రేరేపించాడు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడుతున్న రోజులలో గాంధీతోపాటు ఎన్నో మార్లు జైలు శిక్షను అనుభవించారు. కొరడా దెబ్బలను సంతోషంగా స్వీకరించి స్వాతంత్ర్య ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు. రజాకార్ల దాడిలో దెబ్బలు తిన్నారు. 1947 – 48 హైదరాబాద్ విమోచన సమర సందర్భంగా ఆయన అజ్ఞాత జీవితం గడిపారు. అరెస్టుకు వారెంటు వెలువడింది.

అనేక కారణాల వల్ల ప్రవాస జీవితం గడుపుతూ కుటుంబంతో మచిలీపట్నం వెళ్లి కొంత కాలం తరువాత తిరిగి వచ్చారు. కృష్ణమూర్తికి ప్రియమైనది తెలంగాణ రాష్ట్ర వాంఛ. 1968లో తెలంగాణ ప్రజా సమితికి రూపకల్పన చేశారు. మాజీ మంత్రి టి.పురుషోత్తమరావుతో కలిసి వరంగల్‌లో 1971 వరకు తెలంగాణ ఉద్యమాన్ని నిర్విరామంగా కొనసాగించారు. ఈ సందర్భంగా పలుమార్లు జైలుకు వెళ్లారు. పోలీసుల లాఠీ దెబ్బలు తిన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి వైదొలగినా, తెలంగాణ ఉద్యమాన్ని వీడలేదు.



1972లో వరంగల్ శాసనసభకు కాంగ్రెస్ టికెట్ కేటాయించినా తెలంగాణ కోసం టికెట్ వదులుకున్నారు. 1983లో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎన్.టి. రామారావు స్వయంగా పార్టీ టికెట్ ఇవ్వడానికి ముందుకు వచ్చినప్పటికీ సున్నితంగా తిరస్కరించారు. 1990 ఫిబ్రవరి 17న తెలంగాణ ప్రజా సమితిని పునరుద్ధరించి రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. సహకార పద్ధతిలో ఆర్థిక పుష్టి కలుగుతుందని 1953లో ముల్కనూరులో కో ఆపరేటివ్ సొసైటీని స్థాపించి 1970 నుండి 1974 వరకు చైర్మన్‌గా ఉన్నారు. ఇది ఆసియా ఖండంలో ప్రసిద్ధిగాంచింది. వ్యాపారులకు వరంగల్ మార్కెట్ యార్డులో సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేశారు. విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. 1972, 1979 లలో ఆర్యవైశ్య సంఘం వరంగల్ పట్టణ అధ్యక్షునిగా, 1987లో జిల్లా సంఘ అధ్యక్షునిగా పని చేశారు. తెలంగాణ కోసం ఆయన చేసిన కృషికిగాను తెలంగాణ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 2009జనవరి 11వ తేదీన తెలంగాణ గాంధీ బిరుదును ప్రదానం చేసి సన్మానించారు. స్వాతంత్ర్య సమర కేసరి, ప్రజాబంధు కాళోజీ అవార్డులను ఆయన సాధించి ఆర్యవైశ్యులకు స్ఫూర్తినిచ్చారు. ప్రజా జీవితాన్ని మొత్తం అంకితం చేసిన మహనీయుడు భూపతి కృష్ణమూర్తి. 2014 ఫిబ్రవరి 15న గుండెపోటుతో మరణించాడు. పొగడ్తల కోరిక లేదు, ప్రతిఫల వాంఛలేదు. కనుకనే తెలంగాణ ఉద్యమ చరిత్రలో భూపతిని సువర్ణాక్షరాలతో వ్రాయబడుతుంది. అటువంటి తెలంగాణ గాంధీకి చేతులెత్తి నమస్కరిస్తూ జ్ఞాపకం చేస్తూ ప్రగాఢ సానుభూతి తెలుపుతూ నివాళులు అర్పించాలి.

సకుటుంబం



పెళ్లిళ్ల సీజన్ మొదలైంది. కళ్యాణమండపాలు కళకళలాడుతూంటాయి. బ్యూటీషియన్లకు, ఈవెంట్ మేనేజర్లకు బోలెడంత పని, డిమాండ్ కూడా. పెళ్లికూతురు తన డైటీషియన్ సలహాతో అందమైన ఆకారానికి అనేక పాట్లు పడుతూంటుంది. పెళ్లి ఘడియ రానే వస్తుంది..అందరికంటే అందంగా ఉండాల్సిన పెళ్లికూతురు డ్రెస్ జ్యాయలరీపై ఎక్కువ శ్రద్ధ తీసుకోవాల్సిందే అలాంటి అపురూపమైన కలెక్షన్‌ను ఎంపిక చేసుకోవడం ఎలాగో చూద్దాం....

అదిరేటి లుక్..

పెళ్లికూతురు వెడ్డింగ్ డ్రెస్‌తో పాటు సరైన జ్యాయలరీని మ్యాచ్ చేయడం కొన్నిసార్లు ఇబ్బందిగా అనిపిస్తుంది. అరుదైన నగిషీలు, అద్దాల్లా మెరిసే జాతి రాళ్లు అలంకరణలో భాగం కావాలి. వెడ్డింగ్ జ్యాయలరీని ఎంపిక చేయడం అంత సులభం కాదు. ముఖ్యమైన ఈ సందర్భంలో ప్రతి రోజూలాగా కేవలం ఇయర్‌రింగ్ లేదా నెక్‌పీస్ వేసుకుంటే సరిపోదు. పెళ్లికూతురుగా తయారయ్యే సమయంలో ముక్కుపోగు దగ్గరి నుంచి పాపిట బిళ్ల వరకు, సంది కడియం దగ్గరి నుంచి జూకాల వరకు, గాజులతో పాటు చేతి వేలి ఉంగరం వరకు ప్రతిదాన్ని సరైన ఎంపిక చేసుకోవాలి.



పోల్కీ జ్యాయలరీ: పోల్కీ జ్యాయలరీ పెళ్లి కూతురు ఎక్కువగా ఇష్టపడే జ్యాయలరీ. అన్‌కట్ డైమండ్‌తో తయారైన ఈ జ్యాయలరీ బ్రైడల్ వేర్ లేదా లెహంగా చోళీ, చీరపై కూడా చాలా అందంగా కనిపిస్తుంది. పోల్కీ జ్యాయలరీతో రూపొందిన చోకర్ చాలా ఆకర్షణీయమైన లుక్ ఇస్తుంది.



డైమండ్ జ్యాయలరీ: అందరిలో గొప్పగా కనిపించాలంటే పెళ్లికూతురు డైమండ్ జ్యాయలరీ కూడా వేసుకోవచ్చు. అసలైన డైమండ్‌లను మాత్రమే ధరించాలన్న అవసరం లేదు. మార్కెట్‌లో అసలు డైమండ్‌లాగా కనిపించే డైమండ్ జ్యాయలరీ అందుబాటులో ఉంటుంది. కావాలనుకుంటే వీటిని కూడా ధరించవచ్చు.





టెంపుల్ జ్యాయలరీ: ప్రస్తుతం బ్రైడల్ ట్యాంపల్ జ్యాయలరీకి కూడా డిమాండ్ ఉంది. ఎక్కువశాతం ఇండియన్ వెడ్డింగ్ జ్యాయలరీపైనే బాగుంటుంది. కానీ ట్యాంపల్ జ్యాయలరీ ఎలాంటి జ్యాయలరీ అంటే లెహంగా చోళీ, చీరే కాకుండా, ఇండో-వెస్ట్రర్న్ వేర్‌పై కూడా చాలా బాగా సూట్ అవుతుంది. ఒకసారి వాటిని కొనుగోలు చేసి చాలాసార్లు వేసుకోవచ్చు.



కుందన్ జ్యాయలరీ: కుందన్ జ్యాయలరీది కూడా ఒక విభిన్నమైన గుర్తింపు కలిగిఉంది. పోల్కీ జ్యాయలరీ తర్వాత ఇండియన్ వెడ్డింగ్ వేర్‌తో పాటు ఎక్కువగా పెళ్లికూతుళ్లు కుందన్ జ్యాయలరీ వేసుకోవడాన్ని ఇష్టపడతారు. కుందన్ జ్యాయలరీ ప్రతి ట్రెడిషనల్ వేర్‌పై నప్పతుంది. ప్రస్తుతం కుందన్ క్లచ్, మోజఢీని కూడా చాలా ఇష్టపడుతున్నారు.



గోల్డ్ జ్యాయలరీ: పెళ్లి కోసం సేవింగ్ చేయాలంటే గోల్డ్ జ్యాయలరీ కొనుగోలు చేసి డబ్బులను ఇన్వెస్ట్ చేయవచ్చు. గోల్డ్ జ్యాయలరీ విషయమే ప్రధానంగా మారినా అసలైన బంగారంతో తయారైన బ్రైడల్ జ్యాయలరీ ప్రతి ఒక్కరికీ సాధ్యం కాకపోవచ్చు. మీరు కావాలనుకుంటే మార్కెట్లో లభించే గోల్డ్ ప్లేటెడ్ వెడ్డింగ్ జ్యాయలరీ కూడా వేసుకోవచ్చు.



స్టోన్ జ్యాయలరీ: ఇది చవకే అయినా మంచిది. ఒకసారి చూడగానే మనసు లాగేసే స్టోన్ వెడ్డింగ్ జ్యాయలరీ కూడా చాలా ఆకర్షణీయమైన లుక్ ఇస్తుంది. కానీ స్టోన్ జ్యాయలరీ చాలాకాలం వరకు మన్నదు. ఎండ వేడిమి, నీళ్లు లాంటివి తగిలితే స్టోన్స్ ఊడిపోతాయి.



పర్ల్ జ్యాయలరీ: స్టోన్స్, కుందన్స్ ఇష్టపడనివారికి లైట్ లేదా పెస్టల్ షేడ్ వెడ్డింగ్ వేర్ ధరించాలనుకుంటే, పర్ల్ జ్యాయలరీ మొదటి ఇష్టంగా మారుతుంది. లైట్ వెయిట్ పర్ల్ జ్యాయలరీ ఒక కొత్తదనాన్ని తీసుకువస్తుంది. వైట్, ఎల్లోతోపాటు కలర్‌ఫుల్ పర్ల్‌ను కూడా ఎంపిక చేసుకోవచ్చు.



మొలకల సలాడ్

కావలిసిన వస్తువులు : నల్ల శనగలు, బొబ్బర్లు, మొలకెత్తిన పెసలు— 1 కప్పు,
* కీరా ముక్కలు — 1/2 కప్పు, ఖర్జూర ముక్కలు — అరకప్పు,
* వేయించిన ఖర్బూజా గింజలు,
* వేయించిన పల్లీలు —1 పెద్ద చెమ్చా,
* నల్ల ఉప్పు — చిటికెడు,
* వేయించిన జీలకర్ర పొడర్ — చిన్న చెమ్చా, నిమ్మరసం — తగినంత.

తయారుచేసే పద్ధతి : పెసలు,శనగలు, బొబ్బర్లను ఉడికించాలి. ఇప్పుడు అందులో అన్ని పదార్ధాలు బాగా కలపాలి. చల్లారాక సర్వ్ చేయాలి.



పీరియడ్స్ టైంలో జాగ్రత్తలు

పీరియడ్స్ సమయంలో శరీరంలో ఏదో ఒక చోట నొప్పి రావడం సాధారణ విషయం. ఇలా నొప్పి రావడానికి కారణం శరీరంలో కాల్షియం, లోపం ఉండటమే. ఒకవేళ మీకు కూడా నొప్పిసమస్య ఉంటే డాక్టర్ సలహాతో కాల్షియం, విటమిన్ బి సప్లిమెంట్లు తీసుకోండి.
* రోజూ వ్యాయామం చేయడం వల్ల కూడా ఈ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.
* పీరియడ్స్ టైంలో లైట్‌గానే భోజనం చేయండి. ఎక్కువ ఆహారం తీసుకుంటే శరీరానికి ఇబ్బందిగా ఉంటుంది. పీరియడ్స్ సమయంలో శరీరానికి విశ్రాంతి అవసరం.



జిమ్‌కి వెళ్తున్నారా?

* ఒకవేళ మీరు జిమ్‌కు వెళ్తుంటే, జిమ్‌కు వెళ్లడానికి 15– 20 నిమిషాల ముందు పళ్లు తినండి. దీంతో శరీరంలో శక్తి ఉంటుంది. డీహైడ్రేషన్ సమస్య ఉండదు.
* జిమ్ నుంచి వచ్చాక బనానా షేక్ తాగండి. దీంతో శక్తి నిలిచి ఉంటుంది.
* జిమ్ చేసిన గంట తర్వాత సంపూర్ణంగా భోజనం చేయండి. అందులో పప్పు, చపాతీ, కూరలు చేర్చుకోండి.

ముఖంపై మచ్చలు పోవాలంటే..!



అందానికి చర్మకాంతి తోడైతే... ఆ అందం నలుగురిలో ప్రత్యేకంగా నిలుస్తుంది. ముఖం మీద మచ్చలు, మొటిమలు లేకపోయినా కొందరి చర్మం రఫ్‌గా, కాంతిహీనంగా కనిపిస్తుంది. ఎన్ని క్రీములు వాడినా ఆ మెరుపు తాత్కాలికంగా నిలుస్తుంది. అలాంటి వారు ఈ చిట్కాని పాటిస్తే కాంతివంతమైన చర్మం మీ సొంతమవుతుంది. మరింకెందుకు ఆలస్యం ఇలా ప్రయత్నించండి.

కావలిసినవి: శనగపిండి – రెండు టీ స్పూన్లు, గంధపుపొడి –1టీస్పూన్, పసుపు – అరటీస్పూన్, కర్పూరం – చిటికెడు, పాలు/ రోజ్‌వాటర్ – కొద్దిగా.

తయారీ : ముందుగా ఒక గిన్నె తీసుకుని అందులో శనగపిండి, గంధపుపొడి, పసుపు, కర్పూరం వేసుకోవాలి. ఇప్పుడు మిశ్రమంలో పాలు లేదా రోజ్‌వాటర్ బాగా కలుపుకోవాలి. చల్లని నీటితో ముఖం శుభ్రం చేసుకుని, ఆవిరి పట్టించుకోవాలి. తరువాత ఆ మిశ్రమాన్ని ముఖానికి పూతలా వేసుకుని 20నిమిషాల పాటు బాగా ఆరనివ్వాలి. ఇప్పుడు గోరువెచ్చని నీటితో ముఖం శుభ్రం చేసుకుంటే సరిపోతుంది. ఇదే విధంగా వారానికి రెండు మూడు సార్లు అప్లై చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

పచ్చగా.. పరిశుభ్రంగా

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధిపై ప్రభుత్వ విధానాన్ని, సర్పంచ్‌లు, కార్యదర్శుల పనితీరు గురించి కూలంకషంగా వివరించారు. గ్రామ పాలన పటిష్టతకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, ఉదారంగా నిధులను మంజూరు చేస్తుందని, పారదర్శకంగా పాలన సాగించేందుకు అన్ని అధికారాలనూ ఇస్తుందని స్పష్టం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా, నిధులను దుర్వినియోగం చేసినా, అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. ప్రతీ పంచాయతీలో ఒక మొక్కల నర్సరీ విధిగా ఉండాల్సిందేనని, ప్రతీ ఇంటికి ఆరు చొప్పున మొక్కలు నాటే ప్రణాళిక అమలు కావాలని కెసిఆర్ స్పష్టం చేశారు. ప్రతీ ఇంటి నుంచి వ్యర్థాలను సేకరించడానికి ట్రైసైకిళ్ళను వినియోగించాలన్నారు. ఇకపైన జనన, మరణ, వివాహ రిజిస్ట్రేషన్లు పంచాయతీల్లోనే జరగాలన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులను ఇస్తుందని, దీనికి తోడు ఎంఎల్‌సి, ఎంఎల్‌ఏలు కూడా వారి 'అభివృద్ధి నిధుల' నుంచి సమకూరుస్తారని తెలిపారు. పంచాయతీల్లో పనితీరును ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రత్యేకంగా 25 తనిఖీ బృందాలను ఏర్పాటు చేస్తున్నామని, ఒక బృందం లో తాను కూడా ఉంటానని, దూర ప్రాంతాలు పర్యటించడానికి హెలికాప్టర్‌లను కూడా సమకూరుస్తామని తెలిపారు. నిరంతరం తనిఖీలు జరుగుతూనే ఉంటాయని, ఎవరు ఎప్పుడు ఎక్కడికి పోతున్నారో తెలియకుండా ఆకస్మిక తనిఖీలుంటాయని, ప్రతీ రోజు ఏదో ఓ చోట తనిఖీ జరుగుతూనే ఉంటుందని తెలిపారు. నిధులు ఎక్కడ ఎలా ఖర్చు చేస్తున్నదీ ఆరా తీయడంతో పాటు ఇంటెలిజెన్స్ ద్వారా కూడా సమాచారం తెప్పించుకుంటామన్నారు. పచ్చదనం పెంచడానికి, పరిశుభ్రత కాపాడడానికి తీసుకుంటున్న చర్యలను పరిశీలిస్తామని, ఎక్కడ తేడా వచ్చినా సర్పంచ్, గ్రామ కార్యదర్శులను సస్పెండ్ చేస్తామని, పంచాయతీ రాజ్ చట్టంలోనే ఇందుకు నిబంధనలను కూడా పొందుపరిచామని సిఎం వివరించారు.

ఆరు నెలల్లో అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలు

సొంత స్థలం లేనివారు కుటుంబ సభ్యులు చనిపోతే ఎక్కడ అంత్యక్రియలు చేయాలో తెలియదని, ఆ బాధ వర్ణణాతీతమని, కాబట్టి ప్రతీ గ్రామంలో ఖచ్చితంగా వైకుంఠధామాన్ని నిర్మించాలని కెసిఆర్ పేర్కొన్నారు. ఇందుకోసం గ్రామ పంచాయతీ తగిన స్థలాన్ని ఇవ్వాలని, ఒకవేళ అలాంటి స్థలం లేకుంటే ప్రభుత్వ భూమిని వాడుకోవాలని, ఈ రెండూ లేకుంటే గ్రామ పంచాయతీ నిధులతో సమకూర్చుకోవాలని స్పష్టం చేశారు. దాతలెవరైనా ముందుకొస్తే వారి భూమిని తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోనే వైకుంఠధామాన్ని నిర్మించాలని, అన్ని గ్రామాల్లో ఆరు నెలల్లో వైకుంఠ ధామాల నిర్మాణం జరగాలని సిఎం ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు తాము ప్రజా సేవకులమనే విషయాన్ని మరవద్దని, ప్రజా ప్రతినిధులు తాము ప్రజా సేవకులమే తప్ప, అధికారం చెలాయించే వాళ్లం కాదు అనే భావనతో ఉండాలన్నారు. చట్టసభల్లో 'అధికార పార్టీ', 'ప్రతిపక్ష పార్టీ' అనే పదాలు పోవాలని, గ్రామాల్లో కూడా అధికారం అనే మాట రావద్దని స్పష్టం చేశారు. సర్పంచ్ గా ఎన్నిక కాగానే కొందరి వేషభాషల్లో మార్పు వస్తుందని, దాన్ని ప్రజలు స్వీకరించరని, సహజత్వాన్ని కోల్పోవద్దని సూచించారు.

రోడ్డుపై చెత్త వేస్తే ఫైన్ వేయండి

గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ కట్టుదిట్టంగా జరగాలని వివరించిన కెసిఆర్ ఎప్పుడూ వీధులు అద్దంలా మెరవాలని, ఎట్టి పరిస్థితుల్లో చెత్తాచెదారం రోడ్లపై కనిపించకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ప్రజలు తమ ఇండ్లను ఎలా శుభ్రంగా ఉంచుకుంటారో ఊరిని కూడా



అలాగే ఉంచుకోవాలని, రోడ్డుపై చెత్తవేసే వారికి రూ. 500 చొప్పున జరిమానా విధించాలన్నారు. గ్రామంలో ప్రతీ ఇంటి నుంచి చెత్తను సేకరించడానికి ట్రైసైకిళ్లను ఏర్పాటు చేయాలన్నారు. డంపింగ్ యార్డును ఏర్పాటు చేసుకోవడంతో పాటు పాడుపడిన, నిరుపయోగంగా ఉన్న బావులను, బోర్లను వెంటనే పూడ్చివేయాలని సూచించారు. మురికికాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ నీరు నిల్వ ఉండకుండా గుంతలను కూడా పూడ్చాలన్నారు. పిచ్చిచెట్లను తొలగించాలని పేర్కొన్నారు. ఖచ్చితంగా వందకు వంద శాతం పన్నులను వసూలు చేయాలని, పన్నులు వసూలు చేయని పంచాయతీ కార్యదర్శిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. సర్పంచులు నెలకోసారి విధిగా గ్రామ పంచాయతీ సమావేశం నిర్వహిస్తూ, రెండు నెలలకోసారి గ్రామ సభను నిర్వహించాలని నొక్కిచెప్పారు. వంగిన కరెంటు స్తంభాలను సరిచేయడానికి, కిందికి జారిన వైర్లను సరిచేయడానికి మరమ్మతుల నిమిత్తం 'పవర్ డే'ను నిర్వహించాలని సూచించారు. ప్రతీ గ్రామంలో దోబీ ఘాట్లు ఉండాలన్నారు.

ఐదేళ్ళలో గ్రామాలకు రూ. 40 వేల కోట్ల నిధులు

రాష్ట్రంలోని మొత్తం జనాభాలో గ్రామాల్లోనే 2.02 కోట్ల జనాభా ఉందని, 14వ ఆర్థిక సంఘం ద్వారా గ్రామాల అభివృద్ధికి మన రాష్ట్రానికి ఏడాదికి రూ. 1,628 కోట్ల రూపాయలు కేంద్రం నుంచి వస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం దానికి మరో రూ.1,628 కోట్లు జోడిస్తుందని, ఆ విధంగా ప్రతీ ఏటా రూ. 3,256 కోట్లు గ్రామాలకు సమకూరుతాయని ముఖ్యమంత్రి నిధుల వివరాలను రిసోర్సు పర్సన్లకు అర్థం చేయించారు. ఈ లెక్క ప్రకారం ఒక్కో వ్యక్తికి రూ. 1,611 చొప్పున 500 జనాభా కలిగిన గ్రామానికి కూడా ఏటా రూ. 8 లక్షలు వస్తున్నాయని తెలిపారు. జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలకు ఇంకా ఎక్కువగానే నిధులు వస్తాయని, ఇవి కాకుండా 'నరేగా' నిధులు కూడా పెద్ద మొత్తంలోనే సమకూరుతాయన్నారు. ప్రతీ ఏటా రూ. 3,500 కోట్ల 'నరేగా' నిధులు రాష్ట్రానికి వస్తాయని, వీటిని సమర్థవంతంగా వాడుకోవాలన్నారు. సుమారు రూ.480 కోట్ల మేర గ్రామాలకు సమకూరుతాయన్నారు. ఇలా మూడు మార్గాల ద్వారా గ్రామాల అభివృద్ధికి ఏడాదికి రూ. 7,236 కోట్లు సమకూరుతాయని, ఈ నిధులే కాకుండా రాష్ట్ర బడ్జెట్‌లోనూ నిధులు కేటాయిస్తామని తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా, దాతల విరాళాల ద్వారా కూడా పంచాయతీలు నిధులు సమకూర్చుకోవాలన్నారు. మొత్తంగా ఐదేళ్లలో సుమారు రూ. 40 వేల కోట్లు గ్రామాలకు సమకూరుతాయని, ఈ నిధులతో గ్రామాలాభివృద్ధికి ఎన్నో అద్భుతాలు చేయవచ్చని సిఎం వివరించారు.

కరెంటు బిల్లు బకాయి పెడితే సస్పెండే

వీధి దీపాలు, ఇతర అవసరాల కోసం పంచాయతీలు వాడే విద్యుత్‌కు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదని గుర్తుచేసిన కెసిఆర్ ఇకపైన ఆ పాత విధానానికి స్వస్తి పలకాలని సూచించారు. గ్రామ పంచాయతీలు విద్యుత్ సంస్థలకు రూ.2,570 కోట్ల మేర బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించేలా దృష్టి పెట్టాలన్నారు. మున్సిపాలిటీల నుంచి కూడా విద్యుత్ సంస్థలకు రూ. 455 కోట్ల మేర బకాయిలు ఉన్నాయని, అన్నీ కలిపి మొత్తం రూ.3,025 కోట్ల బకాయిలున్నాయన్నారు. ఈ తీరులో విద్యుత్ సంస్థలు ఎలా నడుస్తాయని ప్రశ్నించిన కెసిఆర్ నిరంతరాయంగా గ్రామాలకు, పట్టణాలకు కరెంటు ఎలా సరఫరా చేస్తాయని ప్రశ్నించారు.

పలుమార్లు పద్యాలు చదివిన కెసిఆర్

ముఖ్యమంత్రి కెసిఆర్ సమావేశంలో పలుమార్లు సందర్భోచితంగా పద్యాలు చదివి, వాటి అర్థాన్ని విడమరిచి చెప్పారు. 'అనగననగ రాగ మతిశయిల్లుచునుండు' అంటూ వేమన పద్యం పాడి, గ్రామాల్లో సంస్కరణల అమలు నిరంతర ప్రక్రియగా సాగాలని, కొంత కాలానికి అది ప్రజలకు, ప్రతినిధులకు అలవాటుగా మారుతుందని వివరించారు. 'నయమున బ్రాలున్ ద్రావరు, భయమునను విషమ్మునైనా భక్షింతురుగా' అనే సుమతీ శతకంలోని పద్యాన్ని పాడి, గ్రామ పంచాయతీలు విధి నిర్వహణలో అవినీతికి, నిర్లక్ష్యానికి పాల్పడితే కఠినంగా శిక్షించాలని చెప్పారు. భయముంటేనే బాగా పనిచేస్తారని, పాలన పారదర్శకంగా ఉంటుందని వివరించారు. 'జాతస్యహి మరణం ధృవం' అనే భగవద్గీత శ్లోకం చదివి పుట్టినవారు గిట్టక మానరు, కాబట్టి చనిపోయిన తర్వాత కూడా మర్యాదగా, గౌరవంగా అంత్యక్రియలు నిర్వహించడానికి స్మశానవాటికలు నిర్మించాల్సిన అవసరాన్ని చెప్పా రు. ''బతికినంత కాలం కులం పేరిట, మతం పేరిట కొట్టుకు చచ్చినం. చనిపోయిన తర్వాతనైనా ఒకే దగ్గర అంత్యక్రియలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలి'' అన్నారు. 'ఆరంభింపరు నీచ మానవులు విఘ్నాయాస సంత్రుస్తులై' అనే ఏనుగు లక్ష్మణకవి సుభాషితం చదివి, గ్రామాల వికాసానికి మంచి సంకల్పంతో నడుం బిగించి, తెలంగాణ ఉద్యమాన్ని విజయ తీరాలకు చేర్చిన స్ఫూర్తితో పనిచేయాలని అర్థం చేయించారు.

స్ఫూర్తి ప్రధాతల గాధలను వివరించిన ముఖ్యమంత్రి

గ్రామాల అభివృద్ధిలో ఎంతో కృషి చేసిన వ్యక్తులను, సంస్థలను, గ్రామాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రజ ల భాగస్వామ్యంతో వారు సాధించిన విజయాలను, అవి దేశానికి ఉపయోగపడిన విధానాన్ని విడమరిచి చెప్పారు. భారతదేశ మొదటి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ మంత్రి ఎస్‌కె డే దేశంలో పంచాయతీ రాజ్ ఉద్యమానికి పురుడు పోసిన విధానాన్ని, ఆయన సలహాలు, సూచనల మేరకే మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నీటి పారుదల నిర్మాణానికి, వ్యవసాయ రంగాభివృద్ధికి చర్యలు తీసుకున్న వైనాన్ని కెసిఆర్ వివరించారు. గ్రామాల వికాసం కోసం నాడు ఎస్‌కె డే హైదరాబాద్‌లో నెలకొల్పిన జాతీయ పంచాయతీరాజ్ అభివృద్ధి ఇన్‌స్టిట్యూట్ గురించి గుర్తుచేశారు. ఆయన చొరవతోనే షాద్‌నగర్, పటాన్‌చెరు బ్లాకులు ఏర్పడిన విషయాన్ని చెప్పారు. కొంకణ్ ప్రాంతంలో ప్రజలను చైతన్యపరిచి, ఎత్తు పల్లాలుండే భూభాగంలో వ్యవసాయం ఎలా చేయాలో చేసి చూపించిన బండార్కర్ గురించి ప్రస్తావించారు. మహారాష్ట్రలోని వన్రాయ్ సొసైటీ స్వచ్ఛందంగా గ్రామాల్లో వైకుంఠ ధామాలు నిర్మించి, చేసిన సేవను వివరించారు. కూసం రాజమౌళి అనే ఒక వ్యక్తి చేసిన కృషి కారణంగా వరంగల్ జిల్లా గంగదేవిపల్లి ప్రపంచానికే ఓ ఆదర్శ గ్రామంగా ఎలా తయారైందో వివరించారు. గ్రామస్తులు, ముఖ్యంగా మహిళల సాధికారితకు నిజామాబాద్ జిల్లా అంకాపూర్ గ్రామం ఓ ఉదాహరణగా చెప్పారు. ఒక్క దోమ కూడా లేకుండా పరిసరాలను ఎలా కాపాడుకోవచ్చో హైదరాబాద్ నగర శివారు ప్రగతి రిసార్ట్స్ చేసి చూపించందని చెప్పారు. రిసోర్స్ పర్సన్లంతా తమ శిక్షణా కాలంలో గంగదేవిపల్లి, అంకాపూర్, ప్రగతి రిసార్ట్స్ సందర్శించాలని కోరారు.

పెదిరిపాడు సంఘటనపై సిఎం ఖండన

మహబూబ్ నగర్ జిల్లా మద్దూరు మండలం పెదిరిపాడు గ్రామంలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్ బాలప్పను నేలపై కూర్చోబెట్టిన సంఘటనను సిఎం తీవ్రంగా ఖండించారు. భవిష్యత్తులో ఎక్కడ ఇలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకు ముందు రిసోర్సు పర్సన్లనుద్దేశించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి ప్రారంభోపన్యాసం చేశారు. మొక్కై వంగనిది మానై వంగునా అనే సామెత చెప్పి, కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కొత్తగా నియామకమయ్యే గ్రామ కార్యదర్శులకు సరైన అవగాహన కల్పించి, గ్రామ వికాసానికి వారిని చేంజ్ ఏజెంట్లుగా మార్చాలని చెప్పారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను పటిష్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. స్థానిక సంస్థల ప్రతినిధులకు తగిన శిక్షణ ఇవ్వడం, ఎప్పటికప్పుడు వారి పనితీరును మదింపు చేయడం కోసం నిష్ణాతులైన రిసోర్సు పర్సన్లను ప్రభుత్వం ఎంపిక చేసిందని సిఎస్ వెల్లడించారు. పంచాయతీ రాజ్ సంస్థల్లో పనిచేసిన అనుభవం కలిగిన 320 మందితో రాష్ట్ర స్థాయి బృందాన్ని తయారు చేసిందని వెల్లడించారు. రిసోర్స్ పర్సన్లే జిల్లాల వారీగా సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణా తరగతులు ప్రతీ ఆరు నెలలకోసారి నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మతో పాటు శాసనసభ్యులు రెడ్యానాయక్, వేముల ప్రశాంత్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, ఎండిసి చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్, కార్యదర్శులు 'మార్పు' ఏజెంట్లు

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్టంపై సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్న రిసోర్సు పర్సన్లతో ప్రగతి భవన్‌లో బుధవారం సమావేశమైన కెసిఆర్ వారిని ఉద్దేశించి ప్రసంగిస్తూ, గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు, గ్రామ కార్యదర్శులే 'ఛేంజ్ ఎజెంట్లు'గా ఉంటారన్నారు. గ్రామల వేదికగానే ఏడాది ప్రణాళికకు బదులుగా ఐదేళ్ళ ప్రగతి ప్రణాళికలను రూపొందించాలన్నారు కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులను, గ్రామ ప్రజలను కలుపుకుని సమిష్టిగా గ్రామ వికాసానికి పాటు పడాలని పిలుపునిచ్చారు. పంచాయతీల్లో మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరా, రహదారుల నిర్మాణం లాంటి ముఖ్యమైన పనులన్నీ ప్రభుత్వమే నేరుగా చేస్తోందని, గ్రామాల్లో పచ్చదనం పెంచడం, పరిశుభ్రత పాటించడం, వైకుంఠధామాల (స్మశాన వాటికలు) నిర్మాణంపై పంచాయతీలు ఎక్కువ దృష్టి పెట్టాలని నొక్కిచెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఆదాయ, వనరులను బేరీజు వేసుకుంటూ ఐదేళ్ల గ్రామ ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. దానికి అనుగుణంగా పనులను చేపట్టాలన్నారు. గ్రామం ప్రస్తుతం ఏ స్థాయిలో ఉంది, ఐదేళ్ల తర్వాత ఎలాంటి మార్పులు జరగాలి, ఐదేళ్ల కాలంలో ఎన్ని నిధులు వస్తాయి, వాటితో ఎలాంటి పనులు చేయాలి తదితర విషయాలను ముందుగానే నిర్ధారించుకుని కార్యరంగంలోకి దిగాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతీ ఆరు నెలలకోసారి రిసోర్స్ పర్సన్లతో తానే సమావేశం అవుతానన్నారు.

టీచర్ లాగా పాఠాలు బోధించిన సిఎం

రిసోర్సు పర్సన్లకు శిక్షణ ఇచ్చే సందర్భంగా ముఖ్యమంత్రి కెసిఆర్ టీచర్ పాత్ర పోషించారు. ప్రతీ విషయంపై పూర్తి స్థాయి అవగాహన కల్పించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయిన సమావేశంలో మధ్యాహ్నం రెండు గంటల వరకూ నిలబడే పాఠాలు చెప్పారు. భోజన విరామం తర్వాత మళ్ళీ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు నిలబడే మాట్లాడారు. మధ్యలో చాలాసార్లు హాస్యం, ఛలోక్తులు విసరడంతో సమావేశంలో నవ్వులు విరబూశాయి. చాలా ఓపిగ్గా వారివారి ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు.

గంగదేవిపల్లి మాజీ సర్పంచ్‌కు అరుదైన గౌరవం

ముఖ్యమంత్రి గంగదేవిపల్లి గ్రామం గురించి వివరించారు. ఈ సందర్భంగానే గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన మాజీ సర్పంచ్ కూసం రాజమౌళి గురించి మాట్లాడారు. అయితే ఆశ్చర్యకరంగా పంచాయతీరాజ్ శాఖ ఎంపిక చేసిన రిసోర్సు పర్సన్లలో రాజమౌళి కూడా ఉన్నారు. దీంతో ముఖ్యమంత్రి రాజమౌళిని సభకు పరిచయం చేశారు. ఆయన ఆదర్శ నాయకుడని కొనియాడారు. వేదిక మీదకి పిలిపించి ఎమ్మెల్యేల సరసన కూర్చోబెట్టారు. గంగదేవిపల్లిలో గ్రామజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించానని సిఎం గుర్తు చేసుకున్నారు.

హైదరాబాద్‌కు బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

పోలీసులను ఆశ్రయించి కేసు విచారణ చేపట్టాల్సిందిగా కోరారు. జయరాం భార్య విజ్ఞప్తి, న్యాయ నిపుణుల సలహా అనంతరం బుధవారం కేసు విచారణను తెలంగాణకు బదిలీ చేశామని ఎపి డిజిపి ఠాకూర్ పేర్కొన్నారు. ఎన్నారై జయరాం హత్య హైదరాబాద్‌లోనే జరిగిందని, అయితే ఎపి పోలీసులు దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేయడం జరిగిందని ఎపి పోలీసులు తెలిపారు. కేసు బదిలీ విషయంలో న్యాయ సలహా తీసుకున్న ఎపి పోలీసులు నే రం జరిగిన ప్రాంతానికే కేసు బదిలీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. జయరాం కేసులో నిందితుల నుంచి ఇంకా అనేక విషయాలు రాబట్టాల్సి ఉందని, నిందితులను పోలీస్ కస్టడీకి కోరుతూ పిటిషన్ వేయనున్నట్లు నగర పోలీసు ఉన్నతాధికారులు వివరిస్తున్నారు. జయరాంను శిఖారెడ్డి, ఆమె తల్లి చంపించారని మృతుడు జయరాం భార్య పద్మశ్రీ ఫిర్యాదుపై ప్రత్యేక నిఘా సారించనున్నారు. జయరాం మృతి చెందిన సమాచారం తెలుసుకున్న శిఖా పోలీసులకు ఫిర్యాదు చేయకుండా జయరాం ఫ్లాట్‌లో జగిత్యాలలోని 10 ఎకరాలకు సంబంధించిన డాక్యూమెంట్లు దొంగిలించిందనని చేసిన ఫిర్యాదుపై నగర పోలీసులు స్పందించారు. భర్త జయరాంను హత్య జరిగిన తరువాత తొలుత సమాచారం అందుకున్న వారిని నగర పోలీసులు ప్రశ్నించనున్నట్లు సమాచారం. జయరాం కేసులో నిందితుడు రాకేష్ రెడ్డికి సహరించిన ఎసిపి మల్లారెడ్డి, సిఐ శ్రీనివాసులు, శిఖాచౌదరి, శ్రీకాంత్ తదితరులపై చర్యలు తీసుకోవాలన్న పద్మశ్రీ తన ఫిర్యాదులో పేర్కొనడంతో ఆ దిశగా దర్యాప్తు అధికారులు అడుగులు వేస్తున్నారు. జరిగిన నేరాన్ని దాయడం కూడా నేరమే అన్నకోణంలో దర్యాప్తు సాగనుంది. రాకేష్‌రెడ్డికి సహకరించిన ఎఎస్‌పి మల్లారెడ్డి, సిఐ శ్రీనివాసులకు బదిలీ చేయడం, ఆపై నోటీసులివ్వడంతో పోలీసు శాఖ సరిపెట్టిందన్న ఆరోపణలపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో జయరాం హత్య కేసులో అన్నికోణాల్లో దర్యాప్తు చేపడుతున్నట్లు నగర సిపి అంజనీకుమార్ తెలిపారు.

టివి నటి ఝాన్సీ ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

ఆత్మహత్యకు ప్రేమవ్యవహారమే కారణమన్న కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మా టివిలో ప్రసారమయ్యే పవిత్రబంధం అనే సీరియల్‌తో పాటు మరో రెండు సినిమాలలో ఝాన్సీ నటించినట్లు ఆమె కుటింబీకులు తెలిపారు. ఇదిలావుండగా గత 6 నెలల కాలంగా సూర్యా అనేయువకునితో ఝాన్సి ప్రేమాయణం సాగిస్తున్నట్లు పోలీసులు వివరిస్తున్నారు. ఝాన్సీ స్వస్థలం కృష్ణాజిల్లా మద్దెనపల్లి మండలం వాడాలి గ్రామానికి చెందిన ఝాన్సి ప్రేమ వ్యవహారంపై బంధువులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఆమె ప్రేమ విషయం తెలియదని కొందరు పేర్కొంటుండగా మరికొందరు మాత్రం ఆమె సూర్య(నాని) అనే యువకుడిని ప్రేమించినట్లు వివరిస్తున్నారు. ఝాన్సీ ఈ విషయమై తరచూ గొడవలు జరిగేవని, దీంతో ఝాన్సీ కలత చెంది ఆత్మహత్యకు పాల్పడివుండవచ్చని భావిస్తున్నారు. సూర్య అనే యువకుడితో సహజీవనం కూడా చేసినట్లు తెలుస్తోంది. వీరిద్దరి మధ్య ఏర్పడిన విభేదాల వల్లే ఝాన్సి జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నారు. కాగా ఝాన్సీ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకునే ముందు సెల్ ఫోన్‌లో వీడియో తీసుకున్నట్లు సమాచారం. ఝాన్సీ బలన్మరణంలో వీడియో సెల్ఫీ కీలకంగా మారింది. అందులో ఉన్న విషయాలను బయటకు చెప్పకుండా పోలీసులు గోప్యత పాటిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్న పోలీసులు ఝాన్సితో ప్రేయాయణం నడిపిన సూర్యా వివరాలు సేకరిస్తున్నారు.

గిరిజన వర్శిటీ

(మొదటిపేజీ తరువాయి)

విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడంపై కేంద్ర మంత్రితో చర్చించామని, కొత్తగా జిల్లా కేంద్రం కానున్న ములుగులో ఇందుకు అవసరమైన భూమిని కూడా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన విషయాన్ని కేంద్ర మంత్రికి వివరించినట్లు తెలిపారు. ములుగు జిల్లా కేంద్రంలో యూత్ సర్వీసెస్‌కు సంబంధించిన మౌలిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నందున రానున్న విద్యా సంవత్సరం నుంచే గిరిజన విశ్వవిద్యాలయం పనిచేయడం ప్రారంభించేలా చొరవ తీసుకోవాల్సిందిగా కోరగా కేంద్ర మంత్రి చాలా సానుకూలంగా స్పందించారని, తప్పకుండా కొన్ని కోర్సులను ప్రారంభించే విధంగా నోటిఫికేషన్ జారీ చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం జబల్‌పూర్‌లో ఇందిరాగాంధీ గిరిజన విశ్వవిద్యాలయం ఉన్నప్పటికీ స్థానిక గిరిజనులకు కేవలం ఏడు శాతం మాత్రమే రిజర్వేషన్ లభిస్తోందని, ఇప్పుడు ములుగు విశ్వవిద్యాలయానికి కూడా ఇదే విధానం కొనసాగినట్లయితే పెద్దగా ప్రయోజనం ఉండదు కాబట్టి చట్ట సవరణ చేయాల్సిందిగా కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు కడియం శ్రీహరి తెలిపారు. అవసరమైతే సూపర్ న్యూమరీ ప్రాతిపదికన సీట్ల సంఖ్యను పెంచి వీలైనంత ఎక్కువ సంఖ్యలో స్థానిక గిరిజన విద్యార్థులకు లబ్ధి చేకూరేలా చట్టంలోని నిబంధనలను మార్చాల్సిందిగా సూచించామని తెలిపారు. చట్ట సవరణకు కూడా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కొత్త జిల్లాల్లో నవోదయ విద్యాలయాలు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు పది జిల్లాల ప్రాతిపదికన మాత్రమే జవహర్ నవోదయ విద్యాలయాలు ఉన్న విషయాన్ని కేంద్ర మంత్రి కి గుర్తు చేసి ఇప్పుడు పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 21 జిల్లాలను ఏర్పాటు చేసినందున వీటిల్లో కూడా కొత్తగా 21 విద్యాలయాలు రావాల్సిన అవసరం ఉందని వివరించి ఆ మేరకు విధాన నిర్ణయం తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేసినట్లు కడియం శ్రీహరి తెలిపారు. రానున్న విద్యా సంవత్సరం నుంచే ఇది సాకారమయ్యేలా చొరవ తీసుకోవాలని కోరగా కనీసం సగం విద్యాలయాలను మంజూరు చేయనున్నట్లు హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి వచ్చే మంత్రివర్గ సమావేశంలోనే ఈ అంశంపై చర్చించి ఆమోదం తెలుపుతామని స్పష్టం చేశారని శ్రీహరి పేర్కొన్నారు. పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం తెలంగాణ మంజూరు చేయాల్సిన విద్యా సంస్థలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, తద్వారా అన్యాయ ం జరుగుతోందని, ఇదే విషయాన్ని కేంద్ర మంత్రికి వివరించామని, పొరుగు రాష్ట్రానికి విద్యా సంస్థలను మంజూరు చేయడంలో చూపిన శ్రద్ధ తెలంగాణపై లేదన్న అంశాన్ని అర్థం చేయించామని తెలిపారు.

వినూత్న ఆవిష్కరణలకు కేంద్రం గుర్తింపు

మన తెలంగాణ/హైదరాబాద్: సూర్యుని నుంచి వెలువడే సౌరగాలులు, కాస్మిక్ కిరణాలతో విద్యుత్ ఉత్పత్తి చేసే, గాలిలో సరఫరా చేసే వినూత్న ఆవిష్కరణలకు కేంద్ర ప్రభుత్వ గుర్తింపు లభించింది. శాస్త్ర సాంకేతిక శాఖ జాతీయ స్థాయిలో ఢిల్లీలో నిర్వహించే ప్రదర్శనలో 'అయాన్ ప్రపల్షన్ ఇంజన్ అండ్ అట్మాస్ఫరిక్ అయాన్ హార్వెస్టింగ్' అనే ప్రాజెక్టు పరికరాన్ని రావుస్ టెక్నో స్కూల్ విద్యార్థిని గిడ్ల రజని ప్రదర్శించనున్నారు. జాతీయ స్థాయి 'ఇన్‌స్పైర్ మనక్' అవార్డును ఈ పరికరం దక్కించుకోవడం విశేషం. ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు ఢిల్లీలోని ఐఐటి ఆవరణలో జరిగే ప్రదర్శనలో తెలంగాణ చిన్నారి రజని ఆవిష్కరణ ప్రదర్శించనున్న సందర్భంగా హైదరాబాద్‌లో రావుస్ టెక్నో స్కూల్ బృందం మీడియాతో మాట్లాడారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను, శాస్త్ర సాంకేతిక జ్ఞానాన్ని వెలికితీస్తే భవిష్యత్తులో శాస్త్రవేత్తలు అవుతారని పాఠశాల ఎండి ప్రభాకరరావు అన్నారు. 'అయాన్ ప్రపల్షన్ ఇంజన్ అండ్ అట్మాస్ఫరిక్ అయాన్ హార్వెస్టింగ్' పరికరం ద్వారా భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్‌తో సంబంధం లేకుండా మోటారు ఇంజన్లు నడిచేలా చేసే అవకాశం ఉందని ఫిజిక్స్ ఉపాధ్యాయులు యజ్ఞ సాయిచరణ్ తెలిపారు. ఐనోస్పియర్‌ను ఆధారంగా చేసుకొని, ఇండక్షన్, వైర్‌లెస్ ట్రాన్స్‌మిషన్ ద్వారా విద్యుత్ తయారీకి పరికరం ఉపయోగపడుతుందన్నారు. ఇదేవిధంగా సూర్యుని నుంచి వెలువడే సౌరగాలులు, కాస్మిక్ కిరణాల ఆధారంగా ఈ పరికరం నడుస్తుందని, భవిష్యత్తులో బ్యాటరీలు అవసరం లేకుండా దేన్నైనా నడిచేలా చేసే అవకాశం ఉంటుందని వివరించారు. మీడియా సమావేశంలో పాఠశాల ఎండి ప్రభాకరరావు, ప్రిన్సిపాల్ శశికల, విద్యార్థిని రజని, ఫిజిక్స్ ఉపాధ్యాయులు యజ్ఞసాయి చరణ్ పాల్గొన్నారు.

ప్రేమించలేదని 15 కత్తిపోట్లు

(మొదటిపేజీ తరువాయి)

15 మార్లు కత్తితో దాడి చేశాడు. దాడిలో మధులిక చేతి చిటికెన వేలు అక్కడే ఊడిపడింది. దీంతో దాడికి తాళలేక మధులిక అక్కడికక్కడే కుప్పకూలి పోయింది. చుట్టుపక్కల వారు కేకలు వేయడంతో భరత్ అక్కడి నుంచి పారిపోయాడు. మధులికపై దాడి చేసిన కత్తిని ఇంట్లో దాచి సమీపంలోని మూసీనదిలో దాక్కున్నాడు. మధులిక ఘటన సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. దాడికి పాల్పడిన భరత్‌ను అదుపులోకి తీసుకునే ందుకు నాలుగు బృందాలను రంగంలోకి దింపారు. భరత్ సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు ఉన్మాదిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం బా ధితురాలు మలక్‌పేట్ యశోద హాస్పిటల్‌లో చికిత్స పొ ందుతూ ప్రాణాపాయ స్థితిలో ఉంది. మధులిక ఆరోగ్య పరిస్థితిపై యశోద హాస్పిటల్ డాక్టర్ కిషన్‌రావు మీడియాకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నారు.

నిరంతరం వైద్యం అందిస్తూనే ఉన్నాం: యశోద ఆసుపత్రి వర్గాలు

ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన మధులికను బుధవారం ఉదయం 10 గంటలకు ఆసుపత్రికి తీసుకొచ్చినప్పుడు బిపి డౌన్ అయ్యిందని, తల, భుజం, చేతులపై తీవ్రగాయాలయ్యాయని యశోద ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కిషన్‌రావు తెలిపారు. ఆసుపత్రికి వచ్చిన వెంటనే ముందుగా ఆమెకు రక్తం ఎక్కించామన్నారు. అనంతరం సిటీ స్కాన్ చేయించామని, తలవెనుక భాగంగా పెద్ద గాయం అయ్యిందని, పుర్రె ఎముక విరిగి బ్రెయిన్‌లో కొంత భాగం ఛిద్రమైందన్నారు. బ్రెయిన్‌లోకి గాలి చొరబడటంతో ఆమె కోమాలోకి వెళ్లిందన్నారు. వెంటిలేటర్ ఉంచి చికిత్స అందిస్తున్నామని. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలిపారు. తీవ్ర రక్తస్రావంతో రక్తపోటు నమోదు కావడంలేదు. శ్వాస తీసుకోలేని స్థితిలో ఉన్న మధులికకు కృత్రిమ శ్వాస అందిస్తున్నారు. సుమారు 48 నుంచి 72 గంటలు గడిస్తే కానీ ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి చెప్పలేమని ఆమెకు వైద్యం అందిస్తున్న వైద్య వర్గాలు పేర్కొంటున్నారు. తల, మెడపై తీవ్రగాలయ్యాయి. ఆమె శరీరంలో 15 నుంచి 15 కత్తి గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉండటం వల్ల ఎలాంటి శస్త్రచికిత్సలు అందించలేకపోతున్నామని వారు పేర్కొంటున్నారు. ఎప్పటికప్పుడు న్యూరో, ఆర్థో, జనరల్, ప్లాస్టిక్ సర్జన్ల వైద్యుల బృందం ఆ యువతిని పర్యవేక్షిస్తోందని డాక్టర్ కిషన్‌రావు తెలిపారు.

నిందితున్ని అరెస్ట్ చేశాం : డిసిపి రమేష్

మధులికపై దాడి చేసిన నిందితుడు భరత్‌ను పోలీసులు అరెస్టు చేశామని, అతని ఇంట్లో దాచిత కత్తిని స్వాధీనం చేసుకున్నామని డిసిసి రమేష్ తెలిపారు. ఘటన జరిగిన వెంటనే నాలుగు బృందాలతో తనిఖీలు నిర్వహించి జాగృతి కాలేజీలో డిగ్రి చదువుతున్న భరత్‌ను అదుపులోకి తీసుకున్నామని ప్రేమను అంగీకరించలేదని మధులికపై భరత్ దాడి చేశాడని వివరించారు. మధులిక ఇంటకి సమీపంలోనే భరత్ ఇల్లు ఉందని, వీరిమధ్య చిన్నప్పటి నుంచి భరత్, మధులికల మధ్య స్నేహం ఉందని డిసిపి



తెలిపారు. మధులిక తల్లి ఉదయ, తండ్రి రాములు, భరత్ తల్లి కళ్యాణి,వేణుగోపాల్‌లది ఒకే సామాజిక వర్గమని డిసిపి తెలిపారు. గతంలో వీరి కుటుంబాలు ఒకే కాంపౌండ్‌లో ఉండేవారు. అప్పటి నుంచి వీరి కుంటుంబాల మధ్య సంబంధాలున్నాయి. కాల క్రమంలో భరత్ ప్రేమ పేరుతో మధులికను వేధించాడు. విషయం తెలిసిన మధులిక కుటింబీకులు భరత్‌ను పలుమార్లు మందలించారని తెలిపారు. అయినప్పటికీ భరత్‌లో మార్పు రాకపోవడంతో గత నెల 7న షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేశారని, భరోసా కేంద్రంలో భరత్‌కు కౌన్సెలింగ్ సైతం ఇచ్చారని తెలిపారు. దీంతో కోపం పెంచుకున్న భరత్ పథకం ప్రకారం మధులికపై కొబ్బరి బోండాలు నరికే కత్తితో దాడి చేశాడని తెలిపారు. భరత్ నుంచి కత్తి స్వాధీనం చేసుకున్నామన్నారు. గాయాలపాలైన మధులిక స్పృహలోకి రాగానే ఆమె స్టేట్ మెంట్ రికార్డ్ చేస్తామని డిసిపి వివరించారు. అయితే దాడికి పాల్పడిన భరత్‌కు గతంలో ఏలాంటి నేరచరిత్ర లేదని తమ దర్యాప్తులో తేలిందన్నారు. నిందితుడు భరత్‌పై ఫోక్సోచట్టంతో పాటు మరిన్ని కేసులు నమోదు చేసి రిమాండ్ తరలించనున్నట్లు డిసిపి రమేష్ తెలిపారు.

చంపుతానని ముందే హెచ్చరికలు : ఇంటర్ విద్యార్థిని మధులికను చంపేస్తానని ఉన్మాది భరత్ ముందే హెచ్చరికలు చేశాడు. ఈ నేపథ్యంలో తనను ప్రేమంచకపోతే చంపడం ఖాయమని ఫోన్లోను పలుమార్లు మధులికను హెచ్చరించాడు. అయితే ఈ విషయాన్ని మధులిక తన కుటుంబ సభ్యులకు చెప్పలేదు. భరత్ హెచ్చరికలను ఖాతరు చేయని మధులికపై మరింత కోపం పెంచుకున్న భరత్ ఎలాగైన మధులికను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలో కొబ్బరి బోండాలు నరికే కత్తిని వారం క్రితమే కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం కాలేజీకి వెళ్తున్న మధులికను తన ఇంటి సమీపంలో అడ్డగించాడు. తనను ప్రేమించాలని ఆగ్రహం వ్యక్తం చేశాడు. మధులిక తనకు ఇష్టంలేదని తేల్చిచెప్పి తన దారిన తాను వెళుతుండగా మళ్లీ అడ్డగించాడు. ప్రేమించకపోతే ఇక్కడే చంపేస్తానని ఊగిపోయాడు. భరత్ మాటలు పట్టించుకోకుండా కాలేజీకి వెళ్తున్న మధులికను వెనుక నుంచి విచక్షణా రహితంగా దాడి చేశాడు. భుజం భాగంలో 8 పోట్లు, చేతులపై 4 పోట్లు, తలపై 2 సార్లు బలంగా కత్తితో దాడి చేశాడు. విషయం గ్రహించిన చుట్టపక్కల వారు మధులికను చికిత్స నిమిత్తం సత్యానగర్ సమీపంలోని సాయికృష్ణా న్యూరో ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వెంటనే యశోధ ఆసుపత్రికి తరలించాలని సాయికృష్ణా న్యూరో వైద్యులు సూచించడంతో వెంటనే యశోద ఆసుపత్రికి తరలించారు.

దేశానికే మోడల్‌గా వరంగల్ ఎఫ్ఎస్‌టిపి

● పరిశీలన కోసం వచ్చిన జాతీయ మీడియా సంస్థలు ● దేశ వ్యాప్తంగా అమలుకై ప్రభుత్వాల ప్రయత్నాలు

మన తెలంగాణ/వరంగల్ టౌన్ : వరంగల్ నగరం ఖాజిపేట మండలం అమ్మవారిపేటలో నెలకొల్పిన ఎఫ్ఎస్‌టిపి కేంద్రం దేశానికే రోల్ మోడల్ గా నిలిచింది. దీనిని ఆదర్శంగా తీసుకుని దేశంలోని 10 రాష్ట్రాలు దీనిని వచ్చే 5 నెలల కాలంలో నిర్మాణాలు పూర్తి చేసి ఏర్పాటు చేసుకోబోతున్నారని ఆయా ప్రభుత్వాలు ఇటీవలనే తమ ఆదేశాలు జారీ చేశాయి. మన రాష్ట్రంలో సైతం మిగిలిన 71 నగర పాలక సంస్థలలో, మున్సిపాలిటిలలో, నగర పంచాయితీలలో దీనిని ఏర్పాటు చేయబోతున్నారు. పారిశుధ్యం లో మనం సాధించిన ప్రగతిని ఇతర ప్రాంతాలు సైతం ఆచరణలో పెడతామని పలు ప్రాంతాలు ముందుకు వస్తుండటం గమనార్హం. మనం నిర్మించిన 'షీ' టాయిలెట్ల ను ఆధర్శంగా మిగతా 74 పట్టణాలలో ఒక్కో చోట 10 చొప్పున నిర్మించబోతున్నారు. మన పబ్లిక్, కమ్యూనిటీ టాయిలెట్లు దేశంలోనే మంచి నాణ్యతా ప్రమాణాలున్నవిగా గుర్తింపు పొందాయి. మన వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ ని ఆదర్శంగా తీసుకుని హైదరాబాద్ నగరంలోని 109 ప్రాంతాలలో అమలు చేయనున్నారు. దీనిని మనం దేశంలోనే అందరి కంటే ముందుగా పైలెట్ ప్రాజెక్ట్ గా ప్రారంభించడమే గాకుండా విజయవంతంగా నిర్వహిస్తున్నాము. ఇప్పుడు దీనిని పరిశీలించేందుకు, ప్రచారం చేసేందుకు జాతీయ మీడియా బృందం సైతం బుదవారం మన వరంగల్ నగరంలో వాలిపోయి దీని తీరు తెన్నులు పరిశీలించి, అబ్బుర పడ్డారు. ఇదంతా మన నగరంలో అస్కీ సంస్థ సహకారంతో మనం ఏర్పాటు చేసుకున్న ఎఫ్ఎస్‌టిపి కేంద్రం వల్లనే వివరాలలోకి వెళ్తే.... కాజిపేట మండలం అమ్మవారిపేటలో గత 2017 నవంబర్ 18న రూ.1.20కోట్లతో మానవ వ్యర్థాల శుద్దీకరణ కేంద్రం (ఎఫ్ఎస్‌టీపీ) కేంద్రాన్ని ప్రారంభించాము. దీనిలో నగరంలోని నివాస గృహాల నుంచి సేకరించిన మల,మూత్రాలను ట్యాంకర్ల ద్వారా సేకరించి, తీసుకొచ్చి ఇక్కడి కేంద్రానికి తీసుకొస్తారు. ఇక్కడి మిషన్‌లలో ఈ మల, మూత్రాలను పోసి వివిధ విభాగాల ప్రక్రియలు, రసాయనక ప్రక్రియలు పూర్తిచేసి ద్రవ, ఘన పదార్థాలుగా వేరు,వేరు చేస్తారు. మలాన్ని సేంద్రీయ ఎరువుగా తయారు చేస్తున్నారు. దీనిని వివిధ కంపెనీల పరిశోదన శాలలకు పరీక్షల నిమిత్తం పంపిస్తున్నారు. తొందర్లోనే ఆయా కంపెనీల సహకారంతో ఇక్కడ తయారైన మానవ సేంద్రీయ ఎరువులను దేశవ్యాప్తంగా మార్కెటింగ్ చేయబోతున్నారు. దీనికి అంకురార్పణగా ఈ కంపెనీ పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే ఉన్న గ్రీనరీకి ఈ ఎరువును వాడుతున్నారు. అవి ఆ మొక్కలు ఏపుగా పెరిగి మంచి ఫలితాలను ఇస్తున్నాయి. ఈ ప్రక్రియలో కంపెనీలో మల, మూత్రం లో అంతర్భాంగా ఉండే నీటిని ప్లాంట్‌ల ద్వారా శుద్ధిచేసి ఇక్కడి మొక్కలకు వాడుతున్నారు. ఈ ప్రక్రియ ను చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నది.



అస్కీ, జాతీయ మీడియా సంస్థల ప్రతినిధులు కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం.



మలం ఎరువుగా తయారైన దృశ్యం

ఆచరణలో ప్రజలు భాగస్వామ్యంకై ప్రయత్నాలు

ఇప్పుడు నగరం లో వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న అన్ని వర్గాల ప్రజలు వంద శాతం సంపూర్ణ పారిశుధ్యం పాటించేటట్లు పూర్తి ప్రయత్నాలను అస్కీ సంస్థతో కలిసి చేయనున్నారు. నగరంలోని 183 ప్రాంతాల్లోని మురికివాడల నివాసాలలో సైతం దీనిని ఇంప్లిమెంటేషన్ చేసేలా చర్యలు తీసుకోబోతున్నారు. ఇన్ సానిటేషన్ వ్యవస్థను పూర్తిగా లేకుండా కంకణం కట్టుకుంటున్నారు. పారిశుద్యంపై వివిధ సమూహాలలో, పబ్లిక్ ప్రదేశాలలో, విద్యా సంస్థలలో దీనిపై అవగాహన, చైతన్యం, ఆచరణ ను తీసుకొచ్చేందుకు ముమ్మర ప్రయత్నాలు చేయబోతున్నారు. సినిమా హాళ్లు, పంక్షన్ హాళ్లు తదితర జన సమ్మర్ధ ప్రాంతాలలో ఎవరికి వారు వ్యక్తి గతంగా ఇలాంటి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసుకుని పారిశుధ్య వ్యవస్థను నెలకొల్పెలా సంసిద్ధం చేయబోతున్నారు.

ప్లాంట్ పని తీరుపై అబ్బుర పడిన జాతీయ మీడియా ప్రతినిధులు

ఈ ప్లాంట్ పనితీరు పరిశీలించేందుకు డిల్లీ, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి జాతీయ స్థాయి మీడియా ప్రతినిధుల బృందం ప్లాంట్ ప్రదేశానికి బుదవారం వచ్చారు. కంపెనీలో ప్రవేశించినది మొదలు బయటకు వచ్చేంత వరకు ఆసక్తిగా ప్రతిదీ పరిశీలించారు. పరిశీలనలో కంపెనీలోని మిషన్‌ల పని విధానం. మల, మూత్రాల వివిధ దశలలో ఘన,ద్రవ పదార్థాలుగా విడిపోయే దశలను, చివరికి అది ఎరువుగా మారే తీరుతెన్నులను జాగ్రత్తగా చూశారు. ఇక్కడి గార్డెనింగ్‌లో ఈ ఎరువును వేసి మొక్కలను పెంచే విధానానికి ముగ్దులయ్యారు. అనంతరం ఇక్కడి సెమినార్ సెంటర్‌లో వచ్చిన ప్రతినిధులకు హైదరాబాద్ నుంచి వచ్చిన అస్కీ ప్రతినిధులు కంపెనీ,మిషన్‌ల పనితీరు, దీనికి సామాజిక బాద్యత తదితర అంశాలపై ప్రత్యేకంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అస్కీ డెరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాసచారి, మాలవిక లు చేయాల్సిన పనులు వివరించారు. ఈ కార్యక్రమంలో అతిధులుగా వచ్చిన మీడియా ప్రతినిధులు కృష్ణ, పద్మ, డిల్లీ నుంచి స్వరూప, పిటిఐ సంస్థ నుంచి విక్రం, న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నుంచి కళానిధీ, హాన్స్ ఇండియా నుంచి అస్కి జాఫర్, అస్కీ సంస్థ నుంచి స్థానిక టీం లీడర్ రాజమోహన్‌రెడ్డి, అవినాష్, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

● రూ.28 లక్షల విలువ చేసే చోరీ సొత్తు స్వాధీనం

మన తెలంగాణ/ఖమ్మం : అంతర్ రాష్ట్ర దొంగల ముఠా ఇటీవల కాలంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని అనేక ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతూ తప్పించుకుని తిరుగుతున్న ముగ్గురు నిందితులను సత్తుపల్లి పోలీసులు అరెస్టు చేసి వార వద్ద ఉన్న రూ.28 లక్షల విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారని ఖమ్మం పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని సీపీ క్యాంపు కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి ఏసీపీ అంజనేయులు పర్యవేక్షణలో సత్తుపల్లి టౌన్ సీఐ సురేష్ ఆధ్వర్యంలో ఉదయం 7 గంటల సమయంలో సత్తుపల్లి పట్టణంలోని ప్రధాన రహదారి విరాట్‌నగర్ సమీపంలో వాహనాలను తనిఖీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ద్విచక్ర వాహనాలపై వస్తూ అనుమానస్పదంగా కన్పించిన ముగ్గురు వ్యక్తులను ఆదుపులోకి తీసుకుని విచారించగా పలు నేరాల్లో నిందితులుగా గుర్తించి వివరాలు సేకరించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణాజిల్లా చాట్రాయి మండలం చింతపూడి గ్రామానికి చెందిన వ్యక్తులుగా గుర్తించారన్నారు. సుమారు 43 చోరీ కేసుల్లో వీరికి ప్రమేయం ఉందని గుర్తించి పలు కేసుల్లో శిక్ష అనుభవించినట్లు విచారణలో వెల్లడైందన్నారు. 2014 సంవత్సరం నుంచి నేర చరిత్ర కలిగి ఉన్న తిరువీధుల సురేంద్ర అలియాస్ సూర్య (30) వృత్తి ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ 43 కేసుల్లో నిందితునిగా గుర్తించబడ్డాడని, నూజివీడు, విసన్నపేట, చింతపూడి మండలాల్లో పగటి పూట చోరీల్లో తొమ్మిది చోట్ల, రాత్రిపూట చోరీల్లో ఐదు చోట్ల దొంగతనాలకు పాల్పడిన కేసుల్లో శిక్ష అనుభవించినట్లు విచారణలో తేటతెల్లమైందన్నారు. పమార్తి సురేష్ (23) సుతారీ పని చేస్తూ జీవనం సాగిస్తూ సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో 2017లో నూజీవీడు టౌన్‌లో మూడు చోరీ కేసులు, పలు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడని ప్రస్తుతం ఆయా కేసులో



కోర్టులో విచారణ కొనసాగుతుందన్నారు. పబ్బు నరేంద్ర గౌడ్ (23) ఇతను నిరుద్యోగి సురేష్ యొక్క బాల్య స్నేహితుడు ఇతనికి 43 చోరీ కేసులలో ప్రమేయం ఉన్నట్లు విచారణలో వెల్లడించారు. అరెస్టు చేసిన నిందితులను పోలీసులను రిమాండ్‌కు తరలించారని తెలిపారు. నిందితుల నుంచి 21 కేసుల్లో రూ.28,17,200 విలువ చేసే 751 గ్రాముల బంగారు ఆభరణాలు, 1194 గ్రాముల వెండి ఆభరణాలు, రెండు ఆటోలు, మూడు ద్విచక్ర వాహనాలు, చోరీ సొత్తు స్వాధీన పరుచుకున్నామన్నారు. తొమ్మిది కేసుల్లో చోరీ చేసిన బంగారు, వెండి ఆభరణాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చింతలపూడిలోని ముత్తూట్ ఫైనాన్స్, విసన్నపేటలోని ముత్తూట్ స్కార్లో తాకట్టు పెట్టారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ డాక్టర్ వినీత్, ఖమ్మం అడిషనల్ డీసీపీ మురళీధర్, సత్తుపల్లి ఏసీపీ ఆంజనేయులు, సత్తుపల్లి టౌన్ సీఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రిలో భారీగా గంజాయి పట్టివేత

6 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం, విలువ రూ. 63 లక్షలు



మన తెలంగాణ / భద్రాచలం : భారీ మొత్తంలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని భద్రాచలం చెక్‌పోస్ట్ వద్ద పట్టుకున్నట్లు, ఓఎస్‌డి ఉదయ భాస్కరరెడ్డి, ఏఎస్‌పి సంగ్రామ్‌సింగ్, ఎఫ్‌డిఓ బాబులు విలేకరుల సమావేశంలో తెలిపారు. సోమవారం భద్రాచలం చెక్‌పోస్ట్ వద్ద ఫారెస్ట్, పోలీస్, సీఆర్‌పిఎఫ్ 141 బెటాలియన్ సమన్వయంగా తనిఖీలు నిర్వహిస్తుండగా, బొలేరో వాహనం నెం ఒడి 30 ఎ 9600లో ఒరిస్సా రాష్ట్రం మల్కాన్‌గిరి నుండి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 526 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని, డ్రైవర్‌ను అరెస్ట్ చేసినట్లు వారు తెలిపారు.

వీటి విలువ రూ. 63, 16,800 ఉంటుందని తెలిపారు. స్మగ్లర్లు 131 ప్యాకెట్ల గంజాయిని బొలేరో వాహనంలో అమర్చి, అనుమానం కలుగకుండా పైన టార్పల్ కప్పి వెళుతుండగా, డ్రైవ ర్ మహానంద్‌సిల్‌ను సిబ్బంది పట్టుకొని పై అధికారులకు తెలియజేసారు. అయితే తనిఖీ నిర్వహిస్తున్నప్పుడు బొలేరో వాహనాన్ని డ్రైవర్ ఆపకుండా పరారవడంతో ఫారెస్ట్ సిబ్బంది కేవల్‌రావ్, సమ్మయ్య, పోలీస్ సిబ్బంది విజయ్, చందు, చారి రవి, ఎక్సైజ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లులు వెంటపడి సారపాకలో పట్టుకున్నట్లు తెలిసింది. డ్రైవర్‌ను వివరాలు అడిగిన పోలీసులకు గంజాయిని తరలిస్తున్న స్మగ్లర్ ఎ1 పేరు రాజ్‌రాయ్, బొలేరో యజమాని ఎ2 మహిర్ మండల్‌గా తెలిసింది. అయితే డ్రైవర్ అరెస్ట్ కాగా సూత్రదారులు మాత్రం తప్పించుకున్నారు. నిందితులు ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వారని, ఆచూకి కోసం గాలిస్తున్నామని వీరి పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఒఎస్‌డి,ఎఎస్‌పిలుం తెలిపారు. ఈ సమావేశంలో సిఆర్‌పిఎఫ్ 141 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ కిరణ్‌కుమార్, డిప్యూటీ కమాండెంట్ సుఖేందుదత్తా, భద్రాచలం సిఐ పి సత్యనారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

స్పీకర్ మాతృమూర్తి అంత్యక్రియలు





మన తెలంగాణ/బాన్సువాడ : రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి మాతృమూర్తి పరిగె పాపవ్వ (107) మంగళవారం అర్ధరాత్రి కామారెడ్డి జిల్లా బాన్సువాడలో కన్నుమూశారు. రెండు రోజుల క్రితం పాపవ్వ తీవ్ర అస్వస్థతకు గురికాగా చికిత్సకోసం బాన్సువాడ ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. మాతృమూర్తి పార్థివ దేహం వద్ద పోచారం శ్రీనివాస్‌రెడ్డి కన్నీరు మున్నీరుగా రోదించడం అందరినీ కంట తడి పెట్టించింది. ఏ మంచి కార్యం తలపెట్టినా ముందుగా తల్లి ఆశీర్వాదం తీసుకోవడం పోచారం శ్రీనివాస్ రెడ్డికి అలవాటు. పాపవ్వ మృతితో పోచారంతోపాటు ఆయన సోదరుడు శంభురెడ్డి, కుమారుడు పోచారం భాస్కర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి శోకసంద్రంలో మునిగిపోయారు. శ్రీనివాస్ రెడ్డి స్వగ్రామం పోచారంలో బుధవారం మధ్యాహ్నం పాపవ్వ అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో రాజకీయ ప్రముఖులు, టిఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్పీకర్‌కు ప్రముఖుల పరామర్శ..

పోచారం మాతృమూర్తి మృతిపట్ల సిఎం కెసిఆర్, కెటిఆర్, ఎంపి కల్వకుంట్ల కవిత, పలువురు శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, రాజకీయ ప్రముఖులు ప్రగాడ సంతాపం వ్యక్తం చేశారు. ఎంపి బిబి పాటిల్, ఎమ్మెల్సీ విజి గౌడ్, ఎమ్మెల్యేలు హన్మంత్ షిండే, షకీల్, జీవన్ రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల కలెక్టర్లు సత్యనారాయణ, రామ్మోహన్ రావు, ఆర్డీవో రాజేశ్వర్ తదితరులు పాపవ్వ పార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘటించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురి మృతి

మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారు
సంతాపం తెలిపిన మాజీ మంత్రి, ఎంపి, ఎంఎల్‌ఏ

మన తెలంగాణ/నేలకొండపల్లి : శుభకార్యానికి వెళ్ళి వస్తుండగా రాకాసి రహదారి వారి పాలిట శాపంగా మారి మింగేసిన సంఘటన ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం నేలకొండపల్లి గ్రామంకు చెందిన పాలపాటి వెంకటేశ్వర్లు (40), పాలపాటి పిచ్చమ్మ (70), పాలపాటి కోదండరాం (10), పాలపాటి ప్రణయ్ (6) నేలకొండపల్లిలో నివాసం ఉంటున్నారు. ఈ నలుగురు శుభకార్యం నిమిత్తం ముదిగొండ మండలానికి వెళ్ళి బుధవారం తెల్లవారుజామున ద్వి చక్రవాహనంపై తిరిగి వస్తుండగా నేలకొండపల్లి చెరువు కట్ట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఆ నలుగురు అక్కడికక్కడే మృతి చెందారని పోలీసులు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఖమ్మం ఏసిపి వెంక్రటరావు, కూసుమంచి సిఐ మురళి, ఎస్ఐ గౌతమ్ పోస్టుమార్ట నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నారు.





నాయకుల ప్రగాఢ సంతాపం..

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఎల్ఏ కందాల ఉపేందర్ రెడ్డి ఒక ప్రకటనలో ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడు పాలపాటి వెంకటేశ్వర్లు అదుకుంటామని తెలిపారు.





పది నెలల తర్వాత..

మృతదేహానికి పోస్టుమార్టం

మన తెలంగాణ/తిరుమలగిరి (సాగర్) : సుమారు పది నెలల క్రితం చనిపోయిన వ్యక్తి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన సంఘటన బుధవారం నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని రాజవరం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే...రాజవరం గ్రామానికి చెందిన దూపాటి దామోదర్‌రావు కుమారుడు భగవాన్‌రాజు(30) గత ఏడాది ఏప్రిల్ 24న రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం సాయిబ్‌నగర్ గ్రామం సామనగర్ కాలనీలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లుగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ సమయంలో పోలీసులు భగవాన్ రాజు మృతదేహానికి ఎలాంటి పోస్టుమార్టం నిర్వహించకుండానే తిరుమలగిరి మండలంలోని తన స్వగ్రామమైన రాజవరం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అదే సమయంలో మృతుని తండ్రి అనారోగ్య సమస్య కారణంతో తన కుమారుడి పోస్టుమార్టం పంచనామా విషయాన్ని పట్టించుకోలేదు. ఆ తర్వాత 20 రోజులకు దామోదర్‌రావు తన కుమారుడు మృతి పట్ల తనకు అనుమానం ఉందని, తన కుమారుడిది రోడ్డు ప్రమాదం కాదని, తన స్నేహితులే హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారని, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాలని వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వారి అనుమానాలను నివృత్తి చేసేందుకు గాను హైదరాబాద్ పోలీసు ఉన్నతాధికారులు భగవాన్‌రాజు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాలని వనస్థలిపురం పోలీసులను ఆదేశించారు. దీంతో తిరుమలగిరి మండల తహసీల్దార్ వజ్రాల జయశ్రీ, సాగర్ కమలానెహ్రూ ఆసుపత్రి వైద్యులు చక్రవర్తి, శ్రీనివాస్, వనస్థలిపురం ఎస్ఐ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ మాధవీలత, వీఆర్వో రమేష్‌ల ఆధ్వర్యంలో రాజవరం గ్రామంలో పూడ్చిన శవాన్ని బయటకు తీసి పంచనామా చేశారు. పంచనామాలో భాగంగా వెలికితీసిన భగవాన్‌రాజు మృతదేహంలోని తల, ఎముకలను, మట్టిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించి వచ్చిన నివేదిక ప్రకారం వ్యవహరిస్తామని తహసీల్దార్ జయశ్రీ పేర్కొన్నారు.

గుట్కా అక్రమ రవాణా ముఠా అరెస్టు



మనతెలంగాణ/చింతల్ : నిషేధిత గుట్కా అక్రమ రవాణా జరుగుతున్నతన్న ఖచ్చితమైన సమాచారం మేరకు ముఠాను బాలానగర్ ఎస్ఓటీ పోలీసుల బృందం వలపన్ని ముఠా సభ్యులను పట్టుకున్నారు. రూ.24లక్షల విలువ చేసే గుట్కా సంచులను స్వాధీనం చేసుకున్నారు. 10మంది నిందితులతో పాటు అక్రమ రవాణాకు ఉపయోగించిన 5 వాహనాలు, 11 సెల్ ఫోన్లు, రూ.56,750 నగదు స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ పివి.పద్మజ తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటక రాష్ట్రం బీదర్ కేంద్రం నుంచి నగరానికి అక్రమంగా గుట్కాను సరఫరా చేస్తున్న ఓ ముఠాను దుండిగల్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు దగ్గర్లోని దుండిగల్ తాండా వద్ద బాలానగర్ ఎస్ఓటీ బృందం, దుండిగల్ పోలీసుల సంయుక్త దాడుల్లో గుట్కా నిందితులను పట్టుకోవడం జరిగిందని తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన ఇక్రమొద్దీన్(45), మన్నె పాండు(33), సబావత్ సూర్యం(28), ఎన్. జితేంద్ర(26), బండప్ప (24), కాంబ్లీ కందేరామ్ (50), మహ్మద్‌షఫీ(21), మహ్మద్ అజీం(29), షేక్‌ముస్తఫా(34), షేక్ సమీర్(22)లు కలిసి క్వాలీస్, ఫోర్డ్,తూఫాన్, ఆటో(5వాహనాల్లో) రూ.24 లక్షలు విలువ చేసే గుట్కా సంచులను తరలిస్తుండగా పట్టుకుని 10 మంది నిందితులను అరెస్టు చేసి వాహనాలను సీజ్ చేశామని డీసీపీ తెలిపారు. వారి వద్ద నుంచి 11 సెల్‌ఫోన్లు, రూ.56, 750 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

నాకు పిల్లలంటే చాలా ఇష్టం. ఆ ఇష్టంతోనే నేను 8 మంది పిల్లలను రాబోయే రెండు సంవత్సరాల్లో దత్తత తీసుకోవాలని కోరుకుంటున్నాను. కుదిరితే ఇంకా ఎక్కువ మంది పిల్లలను దత్తత తీసుకుంటా.

– బాలీవుడ్ హీరోయిన్ అదితి రావు హైదరీ

సినిమా

రెండవ పార్టు విడుదలకు సన్నాహాలు

నందమూరి తారక రామారావు బయోపిక్ మొదటి పార్టు 'ఎన్టీఆర్ః కథానాయకుడు' సంక్రాంతి పండుగ కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ బయోపిక్ రెండవ పార్టు 'ఎన్టీఆర్ః మహానాయకుడు' విడుదలకు సన్నాహాలు ప్రారంభమవుతున్నాయి. అన్నీ అనుకున్నట్టు జరిగి... ఫస్ట్ కాపీ సిద్ధమైతే ఈ చిత్రం ఈనెల 22న విడుదలయ్యే అవకాశం ఉందని తెలిసింది. ఈ సమయంలో విడుదల కాకపోతే సమ్మర్‌లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తుందని సమాచారం. అయితే సినిమా రెడీ అయి ఈ నెలలోనే విడుదల ఉంటే అంతకు ముందే ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను నిర్వహిస్తారు. ఈ ఫంక్షన్‌ను విశాఖలో నిర్వహిస్తారని తెలిసింది. ఈ బయోపిక్ తొలి పార్టు ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను ఆంధ్రప్రదేశ్‌లో చేయాలనుకున్నారు కానీ చివరి నిమిషంలో హైదరాబాద్‌లోనే నిర్వహించారు. ఈసారి మాత్రం విశాఖలో చేయాలని ప్లాన్ చేస్తున్నారు. బాలయ్య సన్నిహితుడు, నిర్మాతల్లో ఒకరైన సాయి కొర్రపాటి ఈ సినిమాను విశాఖ ఏరియాకు పంపిణీ చేస్తున్నారు. ఆయనే ఈసారి ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను విశాఖలో చేద్దామని ప్రతిపాదన చేసినట్లు తెలిసింది. అయితే ఈ ఫంక్షన్ ఎప్పుడు అన్నది ఇంకా నిర్ణయించలేదు.



నాలుగవ సినిమాకు స్క్రిప్ట్ ఓకే

అక్కినేని అఖిల్ మూడవ చిత్రం 'మిస్టర్ మజ్ను' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి పర్వాలేదనిపించింది. అయితే 'హలో' చిత్రం తర్వాత చాలా గ్యాప్ తీసుకొని అఖిల్ ఈ సినిమా చేశారు. ఇక ముందు నుండి అనుకుంటున్నట్లుగానే ఈ యంగ్ హీరో తన నాలుగవ సినిమాను సత్య పినిశెట్టి దర్శకత్వంలో చేస్తారని తెలిసింది. క్రిష్ దర్శకత్వంలో అఖిల్ నాలుగవ సినిమా అంటూ ప్రచారం జరిగినప్పటికీ అవి కేవలం పుకార్లే అని తేలిపోయింది. తాజా సమాచారం ప్రకారం నాగార్జున కూడా సత్య స్క్రిప్ట్‌కు ఓకే చెప్పారని తెలిసింది. 'మలుపు' చిత్రంతో ఇప్పటికే తెలుగు ప్రేక్షకులను మెప్పించిన ఈ యువ దర్శకుడు అఖిల్‌తో సినిమా చేసేందుకు చాలా రోజులుగా ఎదురు చూస్తున్నారు. ఇక సత్య దర్శకత్వంలో వెంటనే సినిమాను మొదలుపెట్టి ఇదే ఏడాది ఆ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని అఖిల్ భావిస్తున్నారు. అతి త్వరలోనే అఖిల్ నాలుగవ సినిమాపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.



చరణ్‌తో ఫైట్స్... తారక్‌కు రెస్ట్

ఇప్పుడు ఇండియాలో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్టులలో అన్నింటికంటే ఎక్కువగా ప్రేక్షకుల చూపు రాజమౌళి రూపొందిస్తున్న 'ఆర్ఆర్ఆర్'పై ఉందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. 'బాహుబలి' తర్వాత ఆ రికార్డులను తలదన్నేలా దర్శకుడు రాజమౌళి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తారని అందరూ భావిస్తున్నారు. స్టార్ హీరోలు ఎన్టీఆర్, రామ్‌చరణ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోంది ఈ భారీ మల్టీస్టారర్. అయితే సినిమా ప్రారంభం అయినప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపుగా చరణ్, తారక్ ఇద్దరూ కలిసే షూటింగ్‌లో పాల్గొంటూ వచ్చారట. కానీ మొదటి సారి రాజమౌళి తారక్‌కు బ్రేకిచ్చి చరణ్‌తో భారీ ఫైట్స్ చేయిస్తున్నారట. ఈ సీన్‌లో పదుల సంఖ్యలో ఫైటర్లు పాల్గొంటున్నారట. ఈ యాక్షన్ సీక్వెన్స్ కోసం రామోజీ ఫిలింసిటీలో ప్రత్యేకంగా ఒక పోలీస్ చెక్ పోస్ట్ సెట్ వేశారని తెలిసింది. ఆ స్పెషల్ సెట్‌లోనే ఈ ఫైట్ చిత్రీకరణ జరుగుతోందని సమాచారం. అయితే ఈ సినిమాలో హీరోయిన్లు ఎవరు, ఇతర నటీనటులు ఎవరు అనే విషయాలను చెప్పకుండా గోప్యంగా ఉంచుతున్నారు. ఆ హీరోయిన్‌ను పరిశీలిస్తున్నారని, ఈ హీరోయిన్‌ను తీసుకున్నారని జోరుగా రూమర్లు ప్రచారంలో ఉన్నాయి కానీ రాజమౌళి స్వయంగా వెల్లడించేవరకు సస్పెన్స్ తప్పదు.





క్రేజీ బ్యూటీ సెండడి

'బాహుబలి' చిత్రంలో 'మనోహరి...'గీతంలో హాట్‌బ్యూటీ నోరా ఫతేహి నృత్యాలను అభిమానులు అంత తేలికగా మర్చిపోలేరు. ఈ గీతంలో ముగ్గురు భామలు నటించినా అందరి కళ్లు నోరాపై మాత్రమే నిలిచాయంటే అర్థం చేసుకోవాలి. ఇక వెస్టర్న్ డ్యాన్స్, సల్సా, పోల్ డ్యాన్సులతో నోరా అభిమానులను అలరిస్తోంది. అందుకే ఈ బ్యూటీకి ప్రపంచవ్యాప్తంగా అధిక సంఖ్యలో ఫాలోవర్స్ ఉన్నారు. ఈ బ్యూటీ నిరంతరం తన డ్యాన్సింగ్ వీడియోలు, హాట్ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ అభిమానులను మురిపిస్తోంది. కెనడియన్ మూలాలు ఉన్న ఈ మొరాకో బ్యూటీకి ఇప్పుడు బాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉంది. 2014లో 'రోర్ః టైగర్స్ ఆఫ్ ది సుందర్బన్స్' అనే చిత్రంతో ఆమె బాలీవుడ్‌కు పరిచయమైంది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయినా ఏకంగా ఎనిమిది సినిమాలకు సంతకం చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. 2015లో ప్రకాష్ ఝా దర్శకత్వం వహించిన 'క్రేజీ కుక్కడ్ ఫ్యామిలీ' అనే చిత్రంలో నటించింది. ఇమ్రాన్ హష్మి 'మిస్టర్ ఎక్స్' చిత్రంలో అదిరిపోయే ఐటమ్ నెంబర్‌తో యూత్‌ను ఉర్రూతలూగించింది. ఆతర్వాత టాలీవుడ్‌లోకి 'బాహుబలి' చిత్రంతో అడుగుపెట్టింది. ఇక నోరా ప్రస్తుతం బాలీవుడ్‌తో పాటు సౌత్‌లోనూ అవకాశాలను అందుకుంటోంది.




'చందమామే...' రేపు రాబోతోంది

నందమూరి కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటిస్తున్న స్టైలిష్ యాక్షన్ సస్పెన్స్ థ్రిల్లర్ '118'. నివేదా థామస్, షాలిని పాండే హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం ద్వారా ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.వి.గుహన్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈస్ట్‌కోస్ట్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై మహేశ్ కోనేరు నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 1న విడుదల కానుంది. అయితే ఈ చిత్రంలోని మొదటి పాట 'చందమామే...' శుక్రవారం సాయంత్రం 5.40 గంటలకు విడుదల కానుందని ఫిల్మ్‌మేకర్స్ ప్రకటించారు. ఇక కల్యాణ్‌రామ్ ఇప్పటివరకు చేయనటువంటి జోనర్ మూవీ ఇది. వెంకట్, అన్బరివు, రియల్ సతీష్‌ల అద్భుతమైన యాక్షన్ పార్ట్ సినిమాలో చాలా కీలకంగా ఉంటుంది. ఈ చిత్రానికి సంగీతంః శేఖర్ చంద్ర, మాటలుః మిర్చి కిరణ్, ఆర్ట్ః కిరణ్ కుమార్, ఎడిటర్ః తమ్మిరాజు.




యాక్షన్ డ్రామా

శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న 'తిప్పరా మీసం' సినిమా ఫస్ట్‌లుక్ విడుదలైంది. ఈ హీరో లుక్ చాలా కొత్తగా ఉంది. 'అసుర' సినిమాతో విమర్శకుల ప్రశంసలను అందుకున్న దర్శకుడు కృష్ణ విజయ్.ఎల్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. నిక్కి తంబోలి, రోహిణి ఇందులో హీరోయిన్లుగా నటిస్తున్నారు. అచ్యుత్ రామారావు, బెనర్జీ, రవిప్రకాష్, రవివర్మ, నవీన్ నేని, ప్రవీణ్, నేహా దేశ్‌పాండే తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. సురేష్ బొబ్బిలి ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తుండగా... సిధ్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ వర్క్‌లో బిజీగా ఉంది. రిజ్వాన్ ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీ ఓం సినిమా బ్యానర్స్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. వేసవిలో ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



రష్మికకు బంపర్ ఆఫర్

దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ సినిమాకు ఓకే చెప్పిన స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ ఈ చిత్రం షూటింగ్ ఎప్పటి నుంచి మొదలుపెడతారో ఇంకా క్లారిటీ ఇవ్వడం లేదు. ఈనెల 14 నుంచి షూటింగ్ అన్నారు కానీ ఇంకా ఆ విషయాన్ని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. అయితే ఈ సినిమాలో బన్నీకి జోడీగా హీరోయిన్‌ను ఎంపిక చేసినట్టు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు ఇందులో క్రేజీ బ్యూటీ రష్మిక మందన్నను హీరోయిన్‌గా తీసుకున్నారట. ఇది కనుక నిజమైతే ఆమెకు బంపర్ ఆఫర్ తగిలినట్టే. మెగా కాంపౌండ్‌లోకి ఒక్కసారి అడుగు పెడితే ఆ హీరోల నుంచి మెల్లిగా మరిన్ని అవకాశాలు వస్తాయి. ప్రస్తుతం విజయ్ దేవరకొండతో కలిసి 'డియర్ కామ్రేడ్' చిత్రంలో నటిస్తోంది రష్మిక. దీంతో పాటు నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంలో హీరోయిన్‌గా చేస్తోంది ఈ బ్యూటీ.



పాన్ ఇండియా నటీనటులతో 'కెజిఎఫ్ 2'



బ్లాక్‌బస్టర్ మూవీ 'కెజిఎఫ్'కు సీక్వెల్‌ను తెరకెక్కించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా నటీనటులను తీసుకొని ఈ చిత్రం రెండో భాగాన్ని రూపొందించే పనిలో ఉంది సినిమా యూనిట్. ఇక సినిమా తొలి భాగానికి విపరీతమైన స్పందన వచ్చింది. కన్నడ హీరో యష్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం తెలుగులో 15 కోట్ల వరకు వసూలు చేసింది. అదేవిధంగా బాలీవుడ్‌లో కూడా భారీ కలెక్షన్లను సాధించింది. అయితే ఈసారి 'కెజిఎఫ్ 2'లో విలన్‌గా బాలీవుడ్ స్టార్ సంజయ్‌దత్‌ను తీసుకుంటున్నట్టు తెలిసింది. సంజయ్‌ను తీసుకుంటే బాలీవుడ్‌లో ఈ సినిమాకు మంచి క్రేజ్ వస్తుంది. అలాగే ఒకరిద్దరు తెలుగు నటులను కూడా ఈ సినిమాలో తీసుకుంటారట. ప్రధాన తారాగణంతో 'కెజిఎఫ్ 2'ను తెరకెక్కించాలని ఫిల్మ్‌మేకర్స్ ప్లాన్ చేశారు.

మాట మార్చేసింది

కొంతకాలం క్రితం తమిళ నటుడు జైతో ప్రేమలో ఉన్నట్టు హీరోయిన్ అంజలి స్వయంగా ప్రకటించింది. వీళ్లిద్దరూ అప్పట్లో గాఢమైన ప్రేమలో మునిగితేలారు. కలిసి ఫొటోలు దిగి హడావుడి చేశారు. అయితే ఇప్పుడు అంజలి పూర్తిగా మాట మార్చేసింది. అంతేకాదు తన గురించి రూమర్లను ప్రచారం చేశారని... అలాంటివి తనవరకూ వచ్చినప్పుడు చాలా బాధేసేదని ఈ భామ చెప్పింది. వాటిని విని ఏడ్చేదాన్ని అని అంజలి పేర్కొంది. జైతో ప్రేమాయణం అంటూ తనపై వచ్చినవి కూడా ఆ తరహా రూమర్లే అని... వాటిని విని చాలా బాధపడినట్టుగా ఈ భామ చెప్పడం గమనార్హం. అప్పట్లో జైతో గాఢమైన ప్రేమలో ఉన్నట్లు స్వయంగా చెప్పిన అంజలి ఇప్పుడు అవన్నీ రూమర్లు అని అంటోంది.





మహి వి.రాఘవ్, దిల్‌రాజు, విజయ్ చిల్లా

'యాత్ర' పొలిటికల్ మూవీ కాదు

డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి చేసిన పాదయాత్రలోని ముఖ్య ఘట్టాలతో తెరకెక్కిన చిత్రం 'యాత్ర'. వైఎస్ఆర్ పాత్రలో మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి నటించిన ఈ చిత్రాన్ని మహి వి.రాఘవ్ దర్శకత్వంలో విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డిలు నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో దిల్‌రాజు మాట్లాడుతూ ''వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర ఎంత సంచలనం సృష్టించిందో అందరికీ తెలుసు. ఆ పాదయాత్రలోని సంఘటనలు, భావోద్వేగాలను ఆధారంగా చేసుకొని దర్శకుడు మహి అద్భుతంగా కథ రాశారు. వైఎస్ఆర్ పాత్రలో మమ్ముట్టిలాంటి లెజెండరీ యాక్టర్ నటించడం చాలా ఆనందంగా ఉంది. టీజర్ విడుదలైనప్పుడు, పాటలు విడుదలైనప్పుడు ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా అనే ఆసక్తి కలిగింది. ఏపి, తెలంగాణ రాష్ట్రాల్లో, ఓవర్సీస్‌లో ఆన్‌లైన్ బుకింగ్స్ బావున్నాయి. భారీ ఓపెనింగ్స్‌తో రాబోతోంది ఈ చిత్రం. 'యాత్ర' పెద్ద హిట్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను''అని అన్నారు. నిర్మాత విజయ్ చిల్లా మాట్లాడుతూ ''ఏడాదిన్నర కాలంగా ఈ సినిమా మీద పనిచేస్తున్నాం. శుక్రవారం సినిమా విడుదల కానుంది. 'యాత్ర' పొలిటికల్ మూవీ కాదు. ఇందులో వివాదాలు లేవు. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి వ్యక్తిత్వానికి సంబంధించిన సినిమా ఇది''అని తెలిపారు. దర్శకుడు మహి వి.రాఘవ్ మాట్లాడుతూ ''మనకు అభిప్రాయ బేధాలు ఉండవచ్చు. ఎవరి ఆలోచనలు వారికి ఉంటాయి. అంతమాత్రాన ఎవరినీ అగౌరవపరచకూడదు. మేము వైఎస్ఆర్ సినిమా చేశాం. సినిమా బాగా వచ్చింది''అని పేర్కొన్నారు.

హైదరాబాద్ జోన్
నెక్, చికెన్ ధరలు రూపాయల్లో

టోకు గుడ్లు	రూ. 402
రిటైల్ గుడ్లు	రూ. 4.60
ఫారమ్ కోడి	రూ. 79
డ్రెస్డ్ స్కిన్ చికెన్	రూ. 146
స్కిన్‌లెస్	రూ. 167

ఎస్‌హెచ్‌జి హాస్పిటాలిటీ గ్రూప్ కార్యాలయం ప్రారంభం



మన తెలంగాణ/హైదరాబాద్ : ఎస్‌హెచ్‌జి స్విస్ హాస్పిటాలిటీ గ్రూప్ ఆధ్వర్యంలో ఫ్రాన్స్, ఇటలీ, స్విడ్జర్లాండ్‌లో హాస్పిటాలిటీలో ఎంబిఎ, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు అందిస్తున్నామని అలియెన్స్ ఫ్రాన్సెయిస్ డైరెక్టర్ ఆడె ఎమిలీ లోరియట్ నుర్బియటో తెలిపారు. ప్రపంచ దేశాల నుంచి తమ విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడలో ఎస్‌హెచ్‌జి స్విస్ హాస్పిటాలిటీ గ్రూప్ కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆడె ఎమిలీ లోరియట్ నుర్బియటోతోపాటు హైదరాబాద్ క్యాంపస్ మేనేజర్ వసుధ మురళీకృష్ణ, సిఇఒ హెరిక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆడె ఎమిలీ లోరియట్ నుర్బియటో మాట్లాడుతూ, తమ గ్రూప్ ఆధ్వర్యంలో భారతదేశంలో విద్యార్థుల సౌకర్యార్థం హైదరాబాద్‌లో కార్యాలయంలో ప్రారంభించినట్లు తెలిపారు. ఎస్‌హెచ్‌జి స్విస్ హాస్పిటాలిటీ గ్రూప్‌లో హాస్పిటాలిటీ కోర్సులు చేసిన విద్యార్థులకు ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.

క్రిప్టో సిఇఒ మృతితో ఆందోళనలో ఖాతాదారులు



ముంబై : డిజిటల్ ఎస్సెట్ ఎక్స్ఛేంజ్ క్వాడ్రిగా సిఎక్స్ అనే కెనడా క్రిప్టో కరెన్సీ కంపెనీ అధ్యక్షుడు జెరాల్ కాటెన్ మరణించడం ఖాతాదారులను ఆందోళనలో నెట్టివేసింది. లావాదేవీలకు సంబంధించిన పాస్‌వర్డ్ ఎవరికీ తెలియకపోవడమే వారి ఆందోళనకు ప్రధానం కారణం, ఆయన మృతితో దాదాపు 137 మిలియన్ డాలర్ల క్రిప్టోకరెన్సీకి (సుమారు రూ.1000 కోట్లు) చెందిన ఖాతాల పరిస్థితి అయోమయంగా మారింది. కాటెన్ తరఫున ఖాతాలను నిర్వహించడానికి అతని భార్య జెన్నిఫర్ రాబర్ట్‌సన్ పెట్టుకున్న అభ్యర్థనను నోవా స్కోటియా హైకోర్టు అంగీకరించింది. కాటెన్ వినియోగించిన కంప్యూటర్ పాస్‌వర్డ్ తెలియకపోవడంతో దాన్ని ఎవరూ వాడలేకపోతున్నామని, దాదాపు లక్షకు పైగా ఖాతాల వివరాలు దానిలో ఉన్నట్లు రాబర్ట్‌సన్ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఎంత వెతికినా ఇంట్లో పాస్‌వర్డ్‌కు చెందిన వివరాలు కూడా దొరకడం లేదని ఆమె తెలిపారు.

స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	36,975.23	358.42	0.98%
నిఫ్టీ	11,062.45	128.10	1.17%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	71.57
యూరో	81.59
బ్రిటిష్ పౌండ్	92.68
ఆస్ట్రేలియన్ డాలర్	51.26
కెనెడియన్ డాలర్	54.65
సింగపూర్ డాలర్	53.01
స్విస్ ఫ్రాంక్	71.82
చైనీస్ యువాన్	10.63
మలేషియన్ రింగిట్	17.54
న్యూజిలాండ్ డాలర్	49.39
హాంకాంగ్ డాలర్	9.14
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	236.44
సౌతాఫ్రికన్ రాండ్	5.34

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	31760	33967.91	0.35%
ముంబై	32620	34887.70	0.4%
ఢిల్లీ	32450	34705.88	0.31%
కోల్‌కతా	32790	35069.52	0.33%
కేరళ	31100	33262.03	0%
బెంగళూరు	31350	33529.41	0.32%
హైదరాబాద్	31760	33967.91	0.35%
గల్ఫ్	139.78	149.50	0.17%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 43600.00
ముంబై	₹ 43600.00
ఢిల్లీ	₹ 43600.00
కోల్‌కతా	₹ 43600.00
హైదరాబాద్	₹ 43600.00



నిఫ్టీ @ 11,000



దేశీయ, అంతర్జాతీయ సానుకూల సంకేతాలు

358 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్

ఐదో రోజూ లాభాల ముగింపు

ముంబై : వరుసగా ఐదో రోజు స్టాక్‌మార్కెట్లు లాభాలతో దూసుకెళ్లాయి. మొత్తానికి 2019 సంవత్సరంలో తొలిసారిగా నిఫ్టీ కీలక 11 వేల మార్క్‌ను దాటింది. ఇక సెన్సెక్స్ 358 పాయింట్ల లాభంతో 36,975 పాయింట్లకు చేరుకుంది. ప్రధానంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసిఐసిఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, టిసిఎస్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభపడటంతో సూచీలు కూడా చురుగ్గా కదిలాయి. లోహరంగ, ఐటీ సూచీలు మంచి లాభాలను చూడగా, అడాగ్ షేర్లు కుప్పకూలాయి. ఒక్క రిలయన్స్ ఇన్ఫ్రానే 27 శాతం నష్టపోయింది. ఎస్‌ఆర్‌ఎఫ్ షేర్లు భారీగా 10 శాతం లాభపడ్డాయి. మార్కెట్ ముగిసే సమయానికి నిఫ్టీ 128 పాయింట్లు లాభపడి 11,067 వద్ద ముగిశాయి. అయితే కొత్త సంవత్సరంలో తొలిసారి సెన్సెక్స్ 11వేల మార్కును దాటింది. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలతో పాటు ఆర్‌బిఐ వడ్డీ రేట్లను తగ్గించవచ్చనే అంచనాలు ఇన్వెస్టర్లకు ఉత్సాహానిచ్చాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచే ప్రధాన రంగాలకు చెందిన షేర్లలో కొనుగోళ్లు జోరుగా సాగడంతో సూచీలు 4నెలల గరిష్ట స్థాయి వద్ద ముగిశాయి. బ్యాంక్ నిఫ్టీ 130 పాయింట్లు లాభపడి 27,402 వద్ద ముగిసింది. ముఖ్యంగా మిడ్‌సెషన్ అనంతరం మెటల్, ఐటి, ఫార్మా, ప్రభుత్వరంగ బ్యాంకింగ్, ఎఫ్ఎంసిజి షేర్లలో కొనుగోళ్లతో సూచీలు పరుగులు పెట్టాయి.

మరింత పెరిగిన వొడాఫోన్ ఐడియా నష్టం



టెలికామ్ దిగ్గజం వొడాఫోన్ ఇండియా క్యూ3లో రూ.5004 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. నెట్‌వర్క్ విస్తరణ, వ్యయాలు వెరసి మూడో త్రైమాసిక ఫలితాలపై ప్రభావం చూపాయి. ఇంకా ఈ మూడు నెలల కాలంలో సంస్థ 35 మిలియన్ల కస్టమర్లను కోల్పోయింది. వొడాఫోన్, ఐడియా సెల్యులార్ విలీనం తర్వాత రెవెన్యూ రూ.11,764 కోట్లు నమోదు చేయగా, ఇంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే 2.2 శాతం క్షీణించింది.

జెఎస్‌డబ్ల్యు లాభం 7 శాతం డౌన్

డిసెంబర్ 31 ముగింపు నాటి క్యూ3 జఎస్‌డబ్ల్యు స్టీల్ ఫలితాల్లో నికర లాభం 7 శాతం తగ్గి రూ.1,603 కోట్లుగా నమోదైంది. రెవిన్యూ మాత్రం 11 శాతం పెరిగి



రూ. 20,318 కోట్లకు చేరింది. మార్జిన్లు 21.1 శాతం నుండి 22.1శాతం పెరిగాయి. ఎబిటా 17 శాతం పెరిగి రూ.4,501 కోట్లు నమోదైంది. జెఎస్‌డబ్ల్యు స్టీల్ ఫలితాల వెల్లడి తరువాత అత్యధికంగా 2.18 శాతం పెరిగి రూ.280 వద్ద స్థిరపడింది.

లుపిన్ నష్టం రూ.152 కోట్లు

ఔషధ రంగ సంస్థ లుపిన్ క్యూ3 ఫలితాల్లో తీవ్ర నిరాశపర్చింది. డిసెంబర్ 31 ముగింపు నాటి క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో సంస్థ రూ.152 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే సమయంలో సంస్థ లాభం రూ.222 కోట్లుగా ఉంది. విశ్లేషకులు కంపెనీ రూ.289 కోట్ల లాభాలను నమోదు చేస్తుందని అంచనా వేశారు. కానీ ఏమాత్రం అంచనాలను అందుకోలేదు. వన్ టైమ్ చార్జ్ వల్ల ఈ త్రైమాసికంలో సంస్థ లాభాలను పడిపోయాయని లుపిన్ పేర్కొంది.



కాగ్నిజెంట్ సిఇఒగా బ్రియాన్



బెంగళూరు: అమెరికాకు చెందిన ఐటి సేవల దిగ్గజం కాగ్నిజెంట్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సీనియర్ మేనేజ్‌మెంట్‌లో కీలక మార్పులు చేస్తున్నట్టు ప్రకటించింది. కంపెనీ సహ వ్యవస్థాపకుడు, ప్రస్తుత సిఇఒ ఫ్రాన్సిస్కో డిసౌజా స్థానంలో కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సిఇఒ)గా బ్రియాన్ హంఫ్రీస్‌ను నియమించారు. బ్రియాన్ ప్రస్తుతం వొడాఫోన్ బిజినెస్ సిఇఒగా పనిచేస్తున్నారు. కాగ్నిజెంట్ కొత్త బాధ్యతలను ఆయన 2019 ఏప్రిల్ 1 నుంచి చేపట్టనున్నారు. ఈ క్యాలెండర్ ఇయర్‌కు గాను సంస్థ రెవెన్యూ అంచనా అంతంత మాత్రంగానే ఉంది.

ఆర్‌బిఐ బోర్డు సమావేశం వాయిదా

న్యూఢిల్లీ: ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) సెంట్రల్ బోర్డు సమావేశాన్ని వాయిదా వేసుకుంది. తాత్కాలిక డివిడెండ్‌పై నిర్ణయం తీసుకునేందుకు గాను సమావేశం కావాల్సి ఉండగా, ఈ భేటీని ఫిబ్రవరి 18కి వాయిదా వేసుకున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. బడ్జెట్ 2019 ప్రవేశపెట్టిన అనంతరం తొలిసారిగా బోర్డు సమావేశమవుతోంది. ఈ భేటీకీ ఆర్థిక మంత్రి కూడా హాజరవనున్నారు. ఫిబ్రవరి 9న ఆర్‌బిఐ బోర్డు సమావేశం కావాల్సి ఉంది.

ఆర్‌బిఐ రెపో రేటులో కోత!



న్యూఢిల్లీ : ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) నేడు వడ్డీ రేట్లపై కీలక ప్రకటన చేయనుంది. 2019లో నిర్వహించే తొలి ద్వైమాసిక ద్రవ్యవిధాన సమీక్షలో వడ్డీ రేట్లలో కోత విధించవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2018 డిసెంబర్‌లో ఉర్జిత్ పటేల్ రాజీనామా చేసిన తర్వాత ఆర్‌బిఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన శక్తికాంత దాస్‌కు ఇది తొలి సమావేశం. ద్రవ్యోల్బణం దిగిరావడం, ఇతర అంశాల దృష్ట్యా వడ్డీ రేట్లలో పావు శాతం కోత విధించే అవకాశముందని కోటక్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ సీనియర్ ఆర్థికవేత్త సువోదీప్ రక్షిత్ అన్నారు. కాగా ఆర్‌బిఐ ద్రవ్యవిధాన కమిటీ(ఎంపిసి) మూడు రోజుల సమావేశం మంగళవారం ప్రారంభమైంది. మరోవైపు ద్రవ్యోల్బణం దిగివచ్చినప్పటికీ ఆర్థిక సవాళ్లు, క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగిన కారణంగా ఈవారంలో ఆర్‌బిఐ వడ్డీ రేట్లను యథాతథంగానే కొనసాగించవచ్చని మరికొందరు నిపుణులు భావిస్తున్నారు. అయితే ఆర్‌బిఐ మాత్రం వడ్డీ రేటులో 25 బేసిస్ పాయింట్ల మేర కోత విధించే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం, ఇతర అంశాలు సానుకూలంగా ఉండడం వల్ల రేటులో కోత ఉండవచ్చని చెప్పింది. శక్తికాంతదాస్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యులు ద్రవ్య విధాన కమిటీ (ఎంపిసి) ముంబైలో ఫిబ్రవరి 7న సమీక్ష వివరాలను ప్రకటించనుంది. గత సమీక్షలో రిజర్వు బ్యాంక్ రేట్లను యథాతథంగానే కొనసాగించింది. దీంతో ప్రస్తుతం రెపో 6.25 శాతంగా అమలవుతోంది. రివర్స్ రెపో 6.25 శాతం వద్ద కొనసాగుతోంది. ఎంఎస్‌ఎఫ్, బ్యాంక్ రేటు 6.75 శాతంగా ఉంది. కాగా గురువారం ఉదయం 11.45 గంటలకు ఆర్‌బిఐ నిర్ణయాలను ప్రకటిస్తుందని రిజర్వు బ్యాంక్ వెబ్‌సైట్‌లో పేర్కొంది.

ఆధార్‌తో పాన్ లింక్ తప్పనిసరి

సుప్రీం కోర్టు



ముంబై : ఆదాయం పన్ను రిటర్న్‌లకు ఆధార్‌తో పాన్(శాశ్వత ఖాతా సంఖ్య) అనుసంధానం తప్పనిసరిగా చేసుకోవాల్సిందేనని సుప్రీం కోర్టు పేర్కొంది. కోర్టు ఇంతకుముందు ఈ అంశపై నిర్ణయం చెప్పిందని, ఆదాయం పన్ను చట్టం సెక్షన్139ఎఎను సమర్థిస్తున్నామని న్యాయమూర్తులు ఎ.కె.సిక్రి, ఎస్.అబ్దుల్ నజీర్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఆధార్–పాన్ అనుసంధానం చేయకుండా 2018–19 సంవత్సరానికి ఆదాయం పన్ను రిటర్న్‌లను దాఖలు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ శ్రేయ సేన్, జైశ్రీ సత్పుటె అనే ఇద్దరు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్‌కు ఢిల్లీ హైకోర్టు ఓకే చెప్పింది. దీంతో ఢిల్లీ కోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ కేంద్రం అప్పీలు చేయగా, తాజాగా సుప్రీం కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఆదాయం పన్ను రిటర్న్‌ల కోసం ఆధాతో పాన్ అనుసంధానం తప్పనిసరిగా చేసుకోవాల్సిందేనని సుప్రీం తీర్పునిచ్చింది. ఆధార్ అనుసంధానంపై గతేడాది సెప్టెంబరులో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెల్లడించిన విషయం తెలిసిందే. ఆధార్ రాజ్యంగబద్ధమైనదేనని, అయితే అన్ని సేవలకు దాన్ని అనుసంధానం చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. మొబైల్ ఫోన్లు, బ్యాంకు ఖాతాలు, స్కూల్ అడ్మిషన్లు, టెలికాం కంపెనీలు తదితర వాటికి ఆధార్ తప్పనిసరి కాదని తెలిపింది. అయితే ఐటీ రిటర్నులు, పాన్ కార్డులకు మాత్రం ఆధార్ నంబరును అనుసంధానం చేయాల్సిందేనని కోర్టు తీర్పునిచ్చింది.

ఎయిర్‌టెల్‌కు ట్రాయ్ షోకాజ్ నోటీస్

న్యూఢిల్లీ: టెలికామ్ రెగ్యులేటరీ సంస్థ ట్రాయ్ ఎయిర్‌టెల్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కొత్త టారిఫ్‌లకు మారుతున్న సమయంలో కొందరు డిటిహెచ్ కస్టమర్లు సమస్యలు ఎదుర్కొంటుండడంపై ఎయిర్‌టెల్ సమాధానమివ్వాలని ట్రాయ్ ఆదేశించింది. దీనికి గాను ట్రాయ్ మూడు రోజుల సమయం ఇచ్చింది. ఈ మూడు రోజుల్లో ఎయిర్‌టెల్ సమాదానమివ్వాలని స్పష్టం చేసింది. మీడియా ఎయిర్‌టెల్‌ను ప్రశ్నించగా సంస్థ ప్రతినిధి స్పందిస్తూ.. కొందరు కస్టమర్లు చానెల్స్ కేటాయింపుల్లో ఆలస్యం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను పరిష్కరించాల్సి ఉందని పేర్కొన్నారు. ఇటీవల ట్రాయ్ కొత్త టారిఫ్ విధానాన్ని ప్రారంభించింది.



టాటా ట్రస్ట్‌కు పన్ను మినహాయింపు రద్దు

న్యూఢిల్లీ: కొన్ని షరతులను ఉల్లంఘించినట్టు గుర్తించడంతో టాటా గ్రూప్‌నకు చెందిన సర్ దోరాబ్జి టాటా ట్రస్ట్‌కు ఆదాయం పన్ను శాఖ మినహాయింపును రద్దు చేసింది. డిసెంబర్ 31న తీసుకొన్న నిర్ణయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ట్రస్ట్‌లోని ట్రస్టీ సభ్యుడు ఆర్. వెంకటరమణన్‌కు పరిహారం చెల్లింపు విషయంలో ఉల్లఘనలు చోటు చేసుకున్నట్టు అధికారులు గుర్తించారు. ఐటి చట్టంలో పేర్కొన్న మొత్తాన్ని మించి పరిహారం ఇచ్చినట్లు తెలిసింది. టాటాలకు ఉన్న ట్రస్టుల్లో సర్ దోరబ్‌జీ టాటా ట్రస్ట్, రతన్‌టాటా ట్రస్ట్ అత్యంత పెద్ద సంస్థలు.. వీటి మొత్తం టాటా సన్స్‌లో 66 శాతం వాటా కలిగి ఉన్నాయి. మినహాయింపులు పొందేందుకు పాటించాల్సిన నిబంధనలను ఉల్లంఘించినందునే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఐటి అధికారులు తెలిపారు. అయితే ఐటి శాఖ ఆదేశాలను టాటాలు సవాలు చేసినట్లు సమాచారం.



టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం%
టెక్ మహీంద్ర	814.50	774.00	811.35	751.00	60.35	8.04
జీ ఎంటర్‌టైన్	398.00	367.00	388.00	365.35	22.65	6.20
సిప్లా	546.70	504.10	534.95	508.00	26.95	5.31
టాటాస్టీల్	486.70	463.80	485.10	464.70	20.40	4.39
గ్రాసిం	739.85	705.05	733.50	703.95	29.55	4.20
బజాజ్ ఫైనాన్స్	2,720.00	2,612.10	2,711.25	2,603.60	107.65	4.13
హెచ్‌పిసిఎల్	234.90	226.50	233.90	225.15	8.75	3.89
హిందాల్కో	212.10	202.50	211.40	204.75	6.65	3.25
బజాజ్ ఫిన్సర్వ్	6,231.00	6,048.80	6,208.65	6,017.10	191.55	3.18
ఐఒసి	138.25	133.50	137.85	133.75	4.10	3.07

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం%
అదానీ పోర్ట్స్	341.80	318.85	330.35	339.80	9.45	2.78
డా.రెడ్డీస్ ల్యాబ్స్	2,816.00	2,761.00	2,789.70	2,821.45	31.75	1.13
ఇండస్‌ఇండ్ బ్యాంకు	1,543.75	1,507.00	1,526.05	1,541.75	15.70	1.02
టైటాన్ కంపెనీ	1,072.00	1,050.50	1,059.05	1,066.70	7.65	0.72
ఎన్‌టిపిసి	137.75	135.00	137.10	138.05	0.95	0.69
యాక్సిస్ బ్యాంకు	734.50	715.60	725.75	729.50	3.75	0.51
రిలయన్స్ ఇన్‌ఫ్రా	229.00	141.75	154.00	227.20	73.20	32.22
టాటా కెమికల్స్	632.75	587.40	594.45	646.95	52.50	8.12
రెల్ కేపిటల్	156.30	135.95	143.75	152.15	8.40	5.52
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకు	42.60	40.25	41.65	42.80	1.15	2.69

రాజీవ్‌కుమార్ విచారణకు సిబిఐ ముహూర్తం



కోల్‌కతా: సుప్రీంకోర్టు ఆదేశం ప్రకారం కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్‌ను షిల్లాంగ్‌లో ప్రశ్నించేందుకు సిబిఐ తేదీల్ని ఖరారు చేస్తోంది. 'తేదీలు ఖరారైన తర్వాత రాజీవ్‌కుమార్‌ను ప్రశ్నిస్తాం. బహుశ ఈ వారాంతంలో అది జరగవచ్చు' అని దర్యాప్తు ఏజెన్సీలోని ఒక సీనియర్ అధికారి బుధవారం చెప్పారు. షిల్లాంగ్‌లోని సిబిఐ కార్యాలయంలో దర్యాప్తునకు ఈ వారాంతంలో తను అందుబాటులో ఉంటానని కుమార్, కేంద్ర దర్యాప్తు సంస్థకు లిఖితపూర్వకంగా తెలిపినట్టు తెలిసింది. శారతా చిట్‌ఫండ్ కుంభకోణం కేసుకు సంబంధించి కుమార్ ధిక్కారానికి పాల్పడ్డారని సిబిఐ సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసింది. దానిపై స్పందించిన కోర్టు కుమార్‌కు నోటీస్ జారీ చేసింది. తమ బృందాన్ని రాజీవ్‌కుమార్ నివాసంలోకి వెళ్లనీకుండా అడ్డుకున్న తర్వాత సిబిఐ పిటిషన్ ఫైల్ చేసింది. కోట్లాది రూపాయల కుంభకోణంపై పోలీస్ ఉన్నతాధికారిని విచారించేందుకు ఈ వారం ప్రారంభంలో సిబిఐ రాజీవ్‌కుమార్ నివాసానికి వెళ్లింది. సిబిఐ ప్రశ్నించేందుకు వీలుగా ఆ ఏజెన్సీ షిల్లాంగ్ కార్యాలయానికి హాజరుకావాలని కుమార్‌ను కోర్టు ఆదేశించింది. అయితే ఆయనను అరెస్ట్ చేయకూడదని స్పష్టం చేసింది.

ఫాకల్టీ రిజర్వేషన్‌పై సుప్రీంలో రివ్యూపిటీషన్



న్యూఢిల్లీ: విశ్వవిద్యాలయాల్లో ఫాకల్టీ రిజర్వేషన్ విధానంపై దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను (ఎస్‌ఎల్‌పి) అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించడంతో ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేస్తుందని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ చెప్పారు. ఇంతకు ముందున్న ఫాకల్టీ రిజర్వేషన్ విధానాన్నే పునరుద్ధరించాలని కోరుతూ దాఖలు చేసిన ఎస్‌ఎల్‌పిపై ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాల నుంచి నిరసలు వ్యక్తమైన నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. ఇంతకు ముందున్న విధానంలో డిపార్ట్‌మెంట్‌ల వారీ గా కాకుండా, ఇన్‌స్టిట్యూషన్‌ల ప్రకారం మొత్తం పోస్టులను అంచనా వేసే విధానాన్ని సుప్రీంకోర్టు గత నెలలో రద్దు చేసింది. 'మేము త్వరలోనే రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేస్తాం. మా ఆలోచనను బలంగా చెబుతాం. న్యాయం జరుగుతుందన్న నమ్మకం మాకుంది. ఇదివరకటి విధానం ప్రకారమే రిజర్వేషన్ కొనసాగుతుంది. ఎస్, ఎస్‌టి, ఓబిసిల రిజర్వేషన్లకు భంగం కలగకుండా ప్రభుత్వం చూస్తుంది' అని జవదేకర్ చెప్పారు.

అత్యంత వృద్ధ ఏనుగు దాక్షాయణి మృతి

తిరువనంతపురం: ఆసియాలోనే అత్యంత ఎక్కువ వయసున్న వృద్ధ ఏనుగు దాక్షాయణి పప్పనంకోడ్ సమీపంలో ఉన్న కేర్‌సెంటర్‌లో మరణించింది. వృద్ధాప్యం వల్ల కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఈ ఏనుగు అదివరకు గిన్నెస్ రికార్డును కూడా సాధించింది. దాక్షాయణి మంగళవారం మరణించిందని ఆ ఏనుగు యాజమాన్యం ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు (టిడిబి) తెలిపింది. 2016లో ఈ ఏనుగుకు గజముతస్సి అవార్డు లభించింది. పోస్టల్ శాఖ కూడా ఈ ఏనుగుపై తపాలా బిళ్లను విడుదల చేసింది. ఆలయ ఉత్సవాల్లో దాక్షాయణిని ఎక్కువగా వినియోగించేవారు. మూడేళ్ల కిందటి వరకూ ఇక్కడి పద్మనాభ స్వామి ఆలయంలో జరిగే అరట్టు ఉత్సవంలో దాక్షాయణి తప్పనిసరిగా పాల్గొనేది.

త్వరలో అటవీ బీట్ గార్డుల నియామకం?


మరో వారంలో నోటిఫికేషన్?

మన తెలంగాణ / హైదరాబాద్ : అడవుల పరిరక్షణపై సీరియస్ దృష్టి సారించిన ప్రభుత్వం ఆ శాఖను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసే దిశగా కార్యాచరణ ప్రారంభించింది. కీలకమైన బాధ్యతల్లో చిత్తశుద్ధితో, నిజాయితీతో, అంకితభావంతో పనిచేసే అధికారులను నియమించిన రాష్ట్ర ప్రభుత్వం త్వరలో వివిధ అటవీ బ్లాకుల్లో 1800 బీట్ గార్డులను నియమించాలని భావిస్తోంది. అడవుల నుంచి కలప స్మగ్లింగ్‌కు గురైనట్లయితే ఆ ప్రాంత ఫారెస్టు ఆఫీసర్‌తో పాటు బీట్ ఆఫీసర్‌ను కూడా బాధ్యులను చేస్తామని స్పష్టం చేసిన ప్రభుత్వం ఇప్పుడు అటవీ సంపదను కాపాడడం కోసం పటిష్టమైన యంత్రాంగాన్ని నెలకొల్పుతోంది. ఇందులో భాగంగానే అటవీ బీట్ గార్డులను నియమించాలనుకుంటోంది. అన్ని జిల్లాల్లోని అటవీ పరిస్థితులను అధ్యయనం చేసిన తర్వాత సుమారు 1800 మంది బీట్ గార్డులను ఆయా జిల్లాల్లోని అటవీ బ్లాకుల్లో నియమించడం ద్వారా నిరంతర నిఘా ఉంచవచ్చని భావించింది. ఆ మేరకు త్వరలో నోటిఫికేషన్ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. వారం రోజుల్లోనే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని అటవీ శాఖ అధికారుల సమాచారం.

చిరుత సంచారంతో భయాందోళనలో తండా వాసులు


మన తెలంగాణ/ఎల్లారెడ్డి రూరల్ : ఎల్లారెడ్డి మండలంలోని బాలాజీనగర్ తాండా పరిసర ప్రాంతాల్లోని పంట పొలం వద్ద కట్టేసి ఉన్న కుక్కను చిరుతపులి దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది. బుధవారం ఉదయం తాండా వాసి తన పొలం వద్ద కాపలాగా కట్టేసిన కుక్క కనబడకపోగా చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతుకగా కుక్క మృతి చెంది ఉందని అదే ప్రాంతంలో చిరుత అడుగులు కూడా ఉన్నాయని తాండా వాసులు తెలిపారు. గత నెల మండలంలోని హాజీపూర్ పంచాయతీ పరిధిలోని కట్ట కింది తాండాకు చెందిన మాలోత్ కంల్యాకు చెందిన ఆవును కూడా ఇలాగే మందలో నుండి ఈడ్చుకెల్లగా అటవీ పరిసర ప్రాంతంలో ఆవు మృతదేహం లభ్యమైంది. దీంతో చుట్టుపక్కల ఉన్న అటవీ ప్రాంతం నుండి చిరుత జనావాసాల్లోకి వచ్చి మూగజీవాలను బలిగొంటుందని అటవీశాఖ అధికారులు స్పందించి చిరుత జాడను కనిపెట్టాలని తాండా వాసులు అధికారులను కోరుతున్నారు. చిరుత సంచారంతో తాండావాసులు భయందోళకు గురవుతున్నారు.

లోకాయుక్తపై రెండు వారాల్లో చెప్పండి



మన తెలంగాణ/ హైదరాబాద్ : లోకాయుక్త, ఉప లోకాయుక్తల నియామకాలు చేయాలనే వ్యాజ్యంపై రెండు వారాల్లోగా ప్రభుత్వ వైఖరిని తెలియజేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. లోకాయుక్త, ఉప లోకాయుక్తలను నియమించేలా ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని కోరుతూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ సెక్రటరీ ఎం.పద్మనాభరెడ్డి దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని బుధవారం హైకోర్టు విచారించింది. ప్రభుత్వం రెండు వారాల్లోగా తన నిర్ణయాన్ని తెలియజేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. లోకాయుక్తలో అయిదు వేల పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, అవినీతి అధికారులు, ప్రజాప్రతినిధులపై కేసుల విచారణకు వాటిని వెంటనే వాటిని నియమించాలని పిటిషనర్ లాయర్ రచనారెడ్డి తమ వాదనల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ వైఖరిని తెలియజేసేందుకు సమయం కావాలని అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ కోరారు. దాంతో కేసు విచారణ రెండు వారాలకు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

మోడీకి, మిగతావారికి మధ్యే పోటీ: అమిత్ షా



అలీగఢ్: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి, మిగిలిన వారికి మధ్యనే పోటీ ఉంటుందని భారతీయ జనతాపార్టీ అధ్యక్షుడు అమిత్ షా బుధవారం తెలిపారు. ఇక్కడి బూత్ స్థాయి బిజెపి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ...ఉత్తరప్రదేశ్‌లో బిజెపి గూండాల బెడద లేకుండా చేసిందని, ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ రాష్ట్రంలో లాండ్ మాఫియా సమస్యను సమర్థవంతంగా పరిష్కరించారని చెప్పారు. 'ఎన్నికల తర్వా ఊపర్ మోడీ, నీచే యోగి (మోడీ ప్రధానమంత్రి, యోగి ముఖ్యమంత్రి) ఉంటారు. ఉత్తరప్రదేశ్‌లో ఇప్పుడు గూండాలు పోలీసుల్ని చూసి భయపడుతున్నారు. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నేరాలు అదుపులోకి వచ్చాయి' అని బిజెపి అధ్యక్షుడు అన్నారు. సమాజ్‌వాది, బహుజన్ సమాజ్ పార్టీ కూటమిని ఎద్దేవా చేస్తూ అమిత్ షా...'వాళ్ల దుకాణానికి అలీగఢ్ తాళాలు వేస్తాం' అన్నారు. అలీగఢ్ తాళాలకు ప్రసిద్ధిచెందింది

మహిళల ప్రవేశానికి వ్యతిరేకం కాదు

న్యాయస్థానం తీర్పును గౌరవిస్తున్నాం ● శబరిమల కేసులో ట్రావెన్కూర్ బోర్డు యు టర్న్
రివ్యూ అక్కరలేదన్న కేరళ ప్రభుత్వం ● తీర్పు వాయిదా వేసిన సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ: కేరళలోని పవిత్ర శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశంపై ఆలయ పాలనా వ్యవహారాలు చూసే ట్రావెన్కూర్ దేవస్వం బోర్డు తన వైఖరిని మార్చుకుంది. అన్ని వయసుల మహిళలను అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును తాము గౌరవిస్తామని తీర్పుపై దాఖలయిన రివ్యూ పిటిషన్లపై విచారణ సందర్భంగా తెలియజేసింది. శబరిమల ఆలయంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేరళ ప్రభుత్వం, ట్రావెన్కూర్ బోర్డు, నాయర్ సర్వీస్ సొసైటీ సహా పలు సంస్థలు పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిలో కొన్ని రివ్యూ పిటిషన్లు కూడా ఉన్నాయి. వీటిపై ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ నేతృత్వంలోని అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. సమయాభావం దృష్ట్యా పిటిషన్లందరి వాదనలను తాము వినలేమని తొమ్మిది, పది మంది పిటిషనర్ల వాదనలు విన్న తర్వాత తీర్పు వెలువరిస్తామని విచారణ ప్రారంభంలోనే ధర్మాసనం స్పష్ట చేసింది. ట్రావెన్కూర్ బోర్డు తరపున సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది వాదనలు వినిపించారు.'మతాచారాలు అందరికీ సమానంగా ఉంటాయని రాజ్యాంగంలోని ఆర్టికల్ 25(1)చెబుతోంది. జీవ సంబంధిత లక్షణాల కారణంగా మహిళలపై వివక్ష చూపించడం సరికాదు. శబరిమల అంశంలో న్యాయస్థానం అభిప్రాయాన్ని మేము అంగీకరిస్తున్నాం' అని ద్వివేది చెప్పారు. అయితే రుతుక్రమ వయసు మహిళలను శబరిమల ఆలయంలోకి అనుమతించబోమని బోర్డు గతంలో అనేక సందర్భాల్లో చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు బోర్డు తన వైఖరిని మార్చుకోవడం గమనార్హం. అంతకు ముందు నాయర్ సొసైటీ, కేరళ ప్రభుత్వం కూడా తమ విదనలను వినిపించాయి. అన్ని పక్షాల వాదనలు విన్న ధర్మాసనం తన తీర్పును వాయిదా వేసింది.



తీర్పుపై రివ్యూ అవసరం లేదు

శబరిమల ఆలయంలోకి అన్ని వయసుల మహిళలను అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై పునస్సమీక్ష జరపాల్సిన అవసరం లేదని కేరళ రాష్ట్రప్రభుత్వం న్యాయస్థానానికి తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు వినిపించారు.' హిందూ సంప్రదాయం ప్రకారం మహిళలు ఆలయంలోకి ప్రవేశించకుండా ఆంక్షలు విధించాల్సిన అవసరం లేదు. దీన్ని న్యాయస్థానం గుర్తించింది. ఓ ఆలయ సంప్రదాయాన్ని మొత్తం మతాచారంగా చెబితే చట్టప్రకారం చెల్లదు. దీన్ని ఆధారంగా చేసుకునే తీర్పును సమీక్షించమని కోరడం సరికాదు. శబరిమల తీర్పుపై సమీక్ష అక్కరలేదు' అని గుప్తా ధర్మాసనానికి తెలిపారు. కాగా నాయర్ సర్వీస్ సొసైటీ తరఫున మాజీ అటార్నీ జనరల్ కె. పరాశరన్ తన వాదనను వినిపిస్తూ సుప్రీంకోర్టు తీర్పును తప్పుబట్టారు. సమాజంలోని అంటరానితనానికి సంబంధించిన రాజ్యాంగంలోని అధికరణాన్ని సుప్రీంకోర్టు శబరిమల కేసు విషయంలో ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు తప్పుగా ఉపయోగించుకుందని ఆయన అన్నారు. అన్ని పక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును వాయిదా వేసింది. ధర్మాసనంలో గొగోయ్‌తో పాటుగా ఆర్‌ఎఫ్ నారిమన్, ఎఎం ఖన్విల్కర్, డివై చంద్రచూడ్, ఇందు మల్హోత్రా ఉన్నారు.

కుటుంబానికి అండగా ఉంటా: ప్రియాంక





న్యూఢిల్లీ: అక్రమ నగదు చలామణి కేసుకు సంబంధించి ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రాను బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ప్రశ్నించింది. ప్రియాంకను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకున్న కొన్ని రోజుల్లోనే ఇడి ఈ చర్య తీసుకుంది. ఇంక కొద్ది రోజుల్లో లోక్‌సభ ఎన్నికలు జరగబోయే తరుణంలో ఇడి తీసుకున్న ఈ చర్య ఒక రాజకీయ సంకేతంగా భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సోదరి ప్రియాంక గాంధీ తెల్లటి టొయోటా ల్యాండ్‌క్రూయిసర్‌లో ఎస్‌పిజి సిబ్బంది వెంటరాగా, తన భర్తతో పాటు సెంట్రల్ ఢిల్లీ జామ్‌నగర్‌లో ఉన్న ఇడి కార్యాలయానికి వచ్చారు. ఎఐసిసి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రియాంక గాంధీ మాట్లాడుతూ...'నా కుటుంబానికి అండగా ఉంటాను' అని తెలిపారు. ఆమె

రాబర్ట్ వాద్రాను ప్రశ్నించిన ఇడి

భర్త వాద్రాను ఇడి ప్రశ్నించడంపై మీడియా అడిగినప్పుడు ఆమె ఈవిధదంగా స్పందించారు. అక్రమ ఆస్తుల వ్యవహారానికి సంబంధించి నేరారోపణలు ఎదుర్కొంటున్న సోనియాగాంధీ అల్లుడు వాద్రా ఒక దర్యాప్తు సంస్థ ఎదుట హాజరు కావడం ఇదే మొదటిసారి. ఎందరో మీడియా వ్యక్తులు చూస్తుండగా బుధవారం మధ్యాహ్నం 3.47కు వాద్రా ఇడి కార్యాలయంలోకి వచ్చా రు. అంతకు కొద్ది నిముషాల ముందు లాయర్ల బృందం అక్కడికి చేరుకుంది. ఏజెన్సీ కార్యాలయంలోకి వచ్చిన వాద్రా ఇడి తనను ప్రశ్నించేందుకు ముందు అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేశారు.అక్రమంగా విదేశీ ఆస్తులు కలిగి ఉన్నాననడం అబద్ధమని, తనకు వ్యతిరేకంగా రాజకీయంగా తనపై జరుగుతున్న వేట అని వాద్రా అన్నారు.

లోక్‌పాల్‌పై ముందడుగు

చైర్మన్, సభ్యుల నియామకానికి నోటిఫికేషన్
నేటి నుంచి దరఖాస్తు ప్రక్రియ

న్యూఢిల్లీ : లోక్‌పాల్ నియామకంపై ఎన్నికల ఏడాదిలో కేంద్రంలో కదలిక వచ్చింది. గురువారం నుంచి లోక్‌పాల్ చైర్మన్, సభ్యుల నియామక దరఖాస్తులు స్వీకరించింది. దీనికి సంబంధించిన నోటిపికేషన్‌ను బుధవారంనాడు జారీ చేసింది. ఈ నెలాఖరులోగా లోక్‌పాల్ సభ్యులను నియమించాలని కేంద్రం భావిస్తోంది. ఇందులో భాగంగానే లోక్‌పాల్ చైర్మన్, సభ్యుల నియామకానికి గానూ సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజన ప్రకాశ్ దేశాయ్ నేతృత్వంలోని ఎంపిక కమిటీ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. చైర్మన్, సభ్యుల నియామకం కోసం గురువారం నుంచి 22 వరకు ఈ కమిటీ దరఖాస్తులు స్వీకరించనుంది. అనంతరం వీటిని పరిశీలించి ఉన్నత స్థాయి కమిటీకి పంపిస్తారు. లోక్‌పాల్ నియామకంపై ఎంపిక కమిటీ అనుసరిస్తున్న ధోరణిపై ఇటీవల సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి నెలాఖరులోగా లోక్‌పాల్ ప్యానెల్ కమిటీ సభ్యుల పేర్లను సిఫార్సు చేయాల్సిందిగా న్యాయస్థానం ఎంపిక కమిటీకి గడువు విధించింది. లోక్‌పాల్ ఎంపిక కమిటీలో ప్రధాని, విపక్ష నేతతో పాటు లోక్‌సభ స్పీకర్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్రపతి చేత ఎంపిక చేయబడిన ప్రఖ్యాత న్యాయనిపుణుడు ఇందులో సభ్యులుగా ఉంటారు.

ఈ నెల 25లోగా అర్హుల జాబితా

- పిఎం కిసాన్ పథకం కోసం పంపాలని కేంద్రం ఆదేశం
- అమలు మార్గదర్శకాల ముసాయిదా విడుదల
- గ్రామాల్లో లబ్ధిదారుల వివరాల ప్రదర్శన
- పార్లమెంట్ ఎన్నికల కంటే ముందే ప్రారంభం

మన తెలంగాణ/హైదరాబాద్: ఈ నెల 25వ తేదీ నాటికి రాష్ట్రంలో ఉన్న అర్హులైన సన్నచిన్నకారు రైతుల జాబితాను సిద్ధం చేసి పిఎం కిసాన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని కేంద్రం ఆదేశించింది. 25వ తేదీ నాటికి అర్హులైన రైతులందరి జాబితాను ఒకవేళ అప్‌లోడ్ చేయకపోయినా తర్వాత పంపిస్తే ఆ మేరకు రైతులకు ఏడాది పాటు ఎప్పుడైనా సొమ్మును వేస్తామని తెలిపింది. పథకం అమలుకు సంబంధించిన మార్గదర్శకాల ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. వీటికి సంబంధించి గురువారం అన్ని రాష్ట్రాల అధికారులతో క్యాబినేట్ సెక్రటరీ వీడియోకాన్ఫరెన్సు నిర్వహించనున్నారు. పిఎం కిసాన్ కింద గుర్తించిన లబ్ధిదారుల జాబితాను గ్రామాల్లో అందరికీ అందుబాటులో ఉండేలా ప్రదర్శిస్తామని తన మార్గదర్శకాల్లో పేర్కొంది. ఒకవేళ అర్హులై ఉండి జాబితాలో పేరు లేకుంటే అధికారులకు విన్నవించుకోవచ్చని స్పష్టంచేసింది. ఈ కార్యక్రమాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ కంటే ముందే ప్రారంభించి, కోడ్ ఉన్నప్పటికీ తర్వాత కొనసాగించాలన్నదే కేంద్ర సర్కారు వ్యూహంగా ఉంది. ఐదెకరాలలోపున్న ఒక కుటుంబం మాత్రమే రూ. 6 వేలు పొందడానికి అర్హులుగా నిర్ధారించారు. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31 నాటికి సాంకేతికంగా గుర్తింపు పొందిన అర్హులైన లబ్ధిదారులకు ఈ పథకం వర్తిస్తుంది.

తప్పుడు ధ్రువీకరణ ఇస్తే సొమ్ము వెనక్కి

పథకంలో లబ్ధిదారులే సొంతంగా తమ అర్హత ధ్రువీకరణ పత్రాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ తప్పుడు ధ్రువీకరణ పత్రం ఇస్తే ఇచ్చిన సొమ్మును వెనక్కు తీసుకుంటామని ముసాయిదా మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. కొన్నిచోట్ల ఎవరైనా నిర్ణీత ఐదెకరాల లోపు భూమిని వివిధ చోట్ల ఉండి ఉన్నా, ఇద్దరు ముగ్గురు కలిసి చేసుకుంటున్నా వారికి కూడా అందజేస్తారు. ఈ నెల ఒకటో తేదీని లబ్ధిదారుల అర్హతకు గడువుగా నిర్ధారించారు. ఏడాది వరకు ఇదే తేదీని ఆధారం చేసుకొని అర్హుల జాబితాను గుర్తిస్తారు. అంటే లబ్ధిదారుల భూమికి సంబంధించి ఎటువంటి మార్పులైనా గతేడాది డిసెంబర్ ఒకటో తేదీ నుంచి ఈ నెల ఒకటో తేదీ వరకు జరిగి ఉంటేనే పరిగణలోకి తీసుకుంటారు.

అనర్హుల జాబితా ఇదే

తాజా, మాజీ కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, మేయర్లు, జిల్లా పరిషత్ తాజా, మాజీ చైర్మన్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ప్రస్తుత, రిటైర్ అయిన ఉద్యోగులు, అధికారులు ఈ పథకానికి అనర్హులుగా ముసాయిదాలో పేర్కొన్నారు. స్వయంప్రతిపత్తి సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన అధికారులు కూడా అనర్హులే. (నాలుగో తరగతి ఉద్యోగులు మాత్రం అర్హులు) రూ. 10 వేల రూపాయలకు మించి పింఛన్ తీసుకునే ఉద్యోగులతో పాటు గతేడాది ఆదాయపు పన్ను చెల్లించిన వారంతా డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, సిఎలు, ఆర్కిటెక్టులు తదితర వృత్తి నిపుణులు అనర్హులు కానున్నారు. ఉన్నతాదాయ వర్గాలంతా అనర్హులు వివిధ సంస్థల కింద ఐదెకరాల లోపు భూమి ఉన్న వారు రైతు కుటుంబంలో ఎవరైనా రాజ్యాంగ పదవుల్లో ఉంటే వారికి వర్తించదు.

ఎలా ఇచ్చేది నిర్ణయించేది రాష్ట్ర ప్రభుత్వమే

జిల్లా స్థాయిలో పిఎంకిసాన్ పోర్టల్‌కు సంబంధించిన లాగిన్ అవకాశం కల్పిస్తారు. రైతులందరి వివరాలు అందులో ఉంటాయి. ఏ బ్యాంకు ద్వారా డబ్బును అందజేయాలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారణ చేయాలి. పోస్టాఫీసు, సహకార బ్యాంకు, లేదా ఇతర వాణిజ్య బ్యాంకుల్లో ఏవైనా వాటిని గుర్తించాలి. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా డబ్బు చేరుతుంది. లబ్ధిదారులకు సొమ్ము చేరిన వెంటనే వారి మొబైల్ ఫోన్‌కు ఎస్ఎంఎస్ వస్తుంది. జాతీయ స్థాయిలో సమీక్ష కమిటీకి క్యాబినెట్ సెక్రటరీ నేతృత్వం వహిస్తారు. అలాగే జిల్లా, రాష్ట్రస్థాయిలో ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలి. ఏదైనా ఫిర్యాదు వస్తే రెండు వారాల్లోగా పరిష్కరించాలి

కోర్టుపై ఇష్టమొచ్చినట్లు వ్యాఖ్యలా?

- లోతుగా పరిశీలించాల్సిన అవసరముంది
- కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ప్రశాంత్ భూషణ్‌కు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: సిబిఐ తాత్కాలిక డైరెక్టర్‌గా నాగేశ్వర రావు నియామకంపై కోర్టును విమర్శిస్తూ వ్యాఖ్యలు చేసినందుకు అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్, కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్లపై తన సమాధానం తెలియజేయాలని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, పౌర హక్కుల ఉద్యమకారుడు ప్రశాంత్ భూషణ్‌ను సుప్రీంకోర్టు బుధవారం కోరింది. ప్రశాంత్ భూషణ్ తన సమాధానం తెలియజేయడానికి న్యాయస్థానం మూడు వారాల గడువు ఇచ్చింది. కోర్టు పరిధిలో ఉన్న అంశంపై జనాభిప్రాయాన్ని ప్రభావితం చేసే విధంగా లాయర్లు కాని, ఇతర వ్యక్తులు కానీ ఎలాంటి వ్యాఖ్యలైనా చేయవచ్చా అనే అంశాన్ని తాము లోతుగా పరిశీలిస్తామని న్యాయమూర్తులు అరుణ్‌మిశ్రా, నవీన్ సిన్హాలతో కూడిన బెంచ్ తెలిపింది. కోర్టును విమర్శించడం అంటే న్యాయప్రక్రియలో జోక్యం చేసుకోవడమే కావచ్చని, అందువల్ల ఈ అంశాన్ని లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని బెంచ్ అభిప్రాయపడింది. ఈ వ్యవహారంపై తదుపరి విచారణను బెంచ్ మార్చి 7కు వాయిదా వేసింది. నాగేశ్వర రావు నియామకం విషయంలో కేంద్రం తరపున వాదించిన వేణుగోపాల్ కోర్టును తప్పుదోవ పట్టించారని ప్రశాంత్ భూషణ్ తన ట్వీట్‌లలో విమర్శించారు. కాగా ప్రశాంత్ భూషణ్ వ్యాఖ్యలు పెండింగ్‌లో ఉన్న కేసులో తప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వడంతో సమానమవుతుందని పేర్కొంటూ ఆయనపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని కేంద్రం మంగళవారం సుప్రీంకోర్టును కోరింది. కాగా వేణుగోపాల్ తన పిటిషన్‌లో సిబిఐ డైరెక్టర్ ఎంపికకు సంబంధించి ప్రధాని నరేంద్ర మోడీ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎకె సిక్రీ, లోక్‌సభలో అతిపెద్ద పార్టీ అయిన కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున ఖర్గేలతో కూడిన ఉన్నతస్థాయి కమిటీ సమావేశానికి సంబంధించిన మినిట్స్‌ను ప్రస్తావించారు. కేంద్రం కూడా వేణుగోపాల్ పిటిషన్‌లోని అంశాలను ప్రస్తావిస్తూ, వాటిని కూడా తన పిటిషన్‌లో భాగంగా పరిగణించాలని కోరింది. ప్రభుత్వం సుప్రీంకోర్టును తప్పుదోవ పట్టించినట్లుగా కనిపిస్తోందని, ఉన్నతస్థాయి ఎంపిక కమిటీ సమావేశానికి సంబంధించి తప్పుడు మినిట్స్‌ను సమర్పించినట్లుగా కనిపిస్తోందంటూ ప్రశాంత్ భూషణ్ ఈ నెల 1వ తేదీ చేసిన ట్వీట్లను వేణుగోపాల్ తన పిటిషన్‌లో ప్రస్తావించారు. అయితే అదే రోజు విచారణ సమయంలో ఈ సమావేశం మినిట్స్‌ను తాను కోర్టుకు సమర్పించిన విషయాన్ని వేణుగోపాల్ తన పిటిషన్‌లో గుర్తు చేస్తూ, ఈ ట్వీట్‌లతో అటార్నీ జనరల్‌గా తన నిజాయితీ, నిబద్ధతకు దురుద్దేశాలు ఆపాదించడానికి ఆయన ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించారని ఆరోపించారు. జనవరి 9,10 తేదీల్లో జరిగిన ఉన్నతస్థాయి కమిటీ సమావేశం వివరాలను ఫిబ్రవరి 1న తాను కోర్టుకు అందజేసిన విషయాన్ని వేణుగోపాల్ తన పిటిషన్‌లో ప్రస్తావించారు. నాగేశ్వర రావును సిబిఐ తాత్కాలిక డైరెక్టర్‌గా నియమిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ 'కామన్ కాజ్' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను ఆ రోజు అరుణ్ మిశ్రా నేతృత్వంలోని బెంచ్ విచారించింది.సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై కమిటీలోని ముగ్గురి సంతకాలు ఉన్నాయని అటార్నీ జనరల్ తన పిటిషన్‌లో ప్రస్తావించారు. ప్రశాంత్ భూషణ్ ట్వీట్లు న్యాయస్థానంపై ఉద్దేశపూర్వకంగా బురద చల్లడం, దాని అథారిటీని తక్కువ చేయడమేనని కూడా వేణుగోపాల్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఒక వేళ సమావేశం మినిట్స్‌ను తారుమారు చేసి ఉంటే అదేపేజిలో సంతకాలు ఉన్న కమిటీలోని సభ్యులు కూడా అందులో భాగస్వాములు అవుతారని వేణుగోపాల్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.





తొలి టి–20 మ్యాచ్‌లో ఓటమికి సమష్టి వైఫల్యమే కారణం. మూడు విభాగాల్లోనూ విఫలమయ్యాం. ఆశించిన స్థాయిలో ఆడలేక పోయాం. బౌలింగ్, ఫీల్డింగ్, బ్యాటింగ్‌లో చెత్త ప్రదర్శన చేశాం. దీంతో ఓటమి తప్పలేదు.

– భారత కెప్టెన్ రోహిత్ శర్మ

తొలి టీ-20లో భారత్ చిత్తు

సిఫెర్ట్ విధ్వంసం, చెలరేగిన సౌథి, చేతులెత్తేసిన టీమిండియా, న్యూజిలాండ్ ఘన విజయం

వెల్లింగ్టన్: భారత్‌తో జరుగుతున్న ట్వంటీ–20 సిరీస్‌లో ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు కళ్లు చెదిరే శుభారంభం చేసింది. టీమిండియాతో బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో కివీస్ 80 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0 ఆధిక్యాన్ని అందుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 219 పరుగుల భారీ స్కోరు సాధించింది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన భారత్ 19.2 ఓవర్లలో 139 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయం చవిచూసింది. వన్డే సిరీస్‌లో అద్భుతంగా రాణించిన భారత బ్యాట్స్‌మెన్, బౌలర్లు టి–20లో తేలి పోయారు. బౌలింగ్, బ్యాటింగ్ వైఫల్యంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. విధ్వంసక బ్యాటింగ్‌తో కివీస్‌కు భారీ స్కోరు అందించిన ఓపెనర్ టిమ్ సిఫెర్ట్ (84)కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది.



ధావన్ మెరిసినా

భారీ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన టీమిండియాకు ఓపెనర్ శిఖర్ ధావన్ మెరుపు ఆరంభం అందించాడు. కివీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ధావన్ స్కోరును పరిగెత్తించాడు. అయితే మరో ఓపెనర్ రోహిత్ శర్మ నిరాశ పరిచాడు. ఒక పరుగు మాత్రమే చేసి సౌథి వేసిన అద్భుత బంతికి పెవిలియన్ చేరాడు. మరోవైపు తర్వాత వచ్చిన విజయ్ శంకర్ కూడా ధాటిగా ఆడాడు. ఒకవైపు ధావన్, మరోవైపు విజయ్ చెలరేగడంతో భారత్ కోలుకున్నట్టే కనిపించింది. కానీ, 18 బంతుల్లో రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో 29 పరుగులు చేసి జోరుమీదున్న ధావన్‌ను ఫెర్గ్యూసన్ వెనక్కి పంపాడు. దీంతో భారత్ కష్టాలు మళ్లీ మొదటి కొచ్చాయి.

టపా..టపా

ధావన్ ఔటైనా వెంటనే భారత్ వరుస క్రమంలో వికెట్లు కోల్పోయింది. భారీ ఆశలు పెట్టుకున్న యువ సంచలనం రిషబ్ పంత్ నిరాశ పరిచాడు. జట్టుకు ఆదుకుంటాడని భావించిన రిషబ్ 10 బంతుల్లో 4 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. మరోవైపు ధాటిగా ఆడుతున్న విజయ్ శంకర్ కూడా భారీ షాట్‌కు ప్రయత్నించి వికెట్‌ను పారేసుకున్నాడు. శంకర్ 18 బంతుల్లో రెండు సిక్సర్లు, మరో రెండు బౌండరీలతో 27 పరుగులు చేసి సాంట్నర్ చేతికి చిక్కాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన స్టార్ ఆటగాడు దినేశ్ కార్తీక్ కూడా నిరాశే మిగిల్చాడు. కార్తీక్ ఐదు పరుగులు మాత్రమే చేసి వెనుదిరిగాడు. ఆ వెంటనే భారత్‌కు మరో షాక్ తగిలింది. మెరుపులు మెరిపిస్తాడని భావించిన స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య 4 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. దీంతో భారత్ 77 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయింది.



ధోనీ పోరాటం..

ఈ దశలో ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యతను సీనియర్ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోని తనపై వేసుకున్నాడు. అతనికి కృనాల్ పాండ్య అండగా నిలిచాడు. ఇద్దరు జాగ్రత్తగా ఆడుతూ వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. అయితే స్కోరును మాత్రం పెంచలేక పోయారు. దీంతో సాధించాల్సిన రన్‌రేట్ విపరీతంగా పెరిగింది. దీంతో భారత్ ఏదశలోనూ కోలుకోలేక పోయింది. సమన్వయంతో బ్యాటింగ్ చేసిన కృనాల్ 20 పరుగులు చేసి సౌథి బౌలింగ్‌లో ఔటయ్యాడు. మరోవైపు భువనేశ్వర్ కుమార్ (1), చాహల్ (1) కూడా నిరాశ పరిచారు. ఒంటరి పోరాటం చేసిన ధోనీ 31 బంతుల్లో ఒక సిక్స్, మరో ఐదు ఫోర్లతో 39 పరుగులు చేసి వెనుదిరిగాడు. ఈ వికెట్ కూడా సౌథి ఖాతాలోకే వెళ్లింది. కివీస్ బౌలర్లలో టిమ్ సౌథి మూడు వికెట్లు తీశాడు. ఫెర్గ్యూసన్, ఐష్ సోధి, సాంట్నర్‌లకు రెండేసి వికెట్లు లభించాయి.

సిఫెర్ట్ మెరుపులు

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్‌కు ఓపెనర్లు టిమ్ సిఫెర్ట్, కొలిన్ మన్రో కళ్లు చెదిరే శుభారంభం అందించారు. ఇద్దరు భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ పరుగుల వరద పారించారు. ఒకవైపు మన్రో, మరోవైపు సిఫెర్ట్ విధ్వంసక ఇన్నింగ్స్ ఆడడంతో స్కోరు సునామీల పరిగెత్తింది. కీలక ఇన్నింగ్స్ ఆడిన మన్రో 20 బంతుల్లో రెండు ఫోర్లు, మరో రెండు సిక్స్‌లతో 34 పరుగులు చేశాడు. కెప్టెన్ విలియమ్సన్ కూడా మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. మూడు సిక్సర్లతో వేగంగా 34 పరుగులు సాధించాడు. మరోవైపు విధ్వంసక ఇన్నింగ్స్‌తో అలరించిన ఓపెనర్ సిఫెర్ట్ సిక్సర్లు, ఫోర్ల వర్షం కురిపించాడు. అతన్ని కట్టడి చేసేందుకు భారత బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చెలరేగి ఆడిన సిఫెర్ట్ 43 బంతుల్లోనే ఆరు భారీ సిక్సర్లు, మరో ఏడు బౌండరీలతో 84 పరుగులు చేశాడు. చివర్లో స్కాట్ కూడా విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. చెలరేగి ఆడిన స్కాట్ 7 బంతుల్లోనే మూడు ఫోర్లు, సిక్స్‌తో 20 పరుగులు చేశాడు. దీంతో కివీస్ స్కోరు 219 పరుగులకు చేరింది.

స్కోరుబోర్డు :

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: టిమ్ సిఫెర్ట్ (బి) ఖలీల్ అహ్మద్ 84, కొలిన్ మన్రో (సి) శంకర్ (బి) కృనాల్ 34, విలియమ్సన్ (సి) హార్దిక్ (బి) చాహల్ 34, డి.మిఛెల్ (సి) కార్తీక్ (బి) హార్దిక్ 8, రాస్ టైలర్ (సి) ఖలీల్ (బి) భువనేశ్వర్ 23, గ్రాండోమ్ (సి) సిరాజ్ (బి) హార్దిక్ 3, మిఛెల్ సాంట్నర్ నాటౌట్ 7, స్కాట్ కుగులిన్ నాటౌట్ 20, ఎక్స్‌ట్రాలు 6, మొత్తం 20 ఓవర్లలో 219/6.

బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 4–0–47–1, ఖలీల్ అహ్మద్ 4–0–48–1, కృనాల్ పాండ్య 4–0–37–1, హార్దిక్ పాండ్య 4–0–51–2, చాహల్ 4–0–35–1.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) ఫెర్గ్యూసన్ (బి) టిమ్ సౌథి 1, శిఖర్ ధావన్ (బి) ఫెర్గ్యూసన్ 29, విజయ్ శంకర్ (సి) గ్రాండోమ్ (బి) సాంట్నర్ 27, రిషబ్ పంత్ (బి) సాంట్నర్ 4, మహేంద్ర సింగ్ ధోని (సి) ఫెర్గ్యూసన్ (బి) సౌథి 39, దినేశ్ కార్తీక్ (సి) సౌథి (బి) ఐష్ సోధి 5, హార్దిక్ పాండ్య (బి) డారి మిఛెల్ (బి) ఐష్ సోధి 4, కృనాల్ పాండ్య (సి) సిఫెర్ట్ (బి) సౌథి 20, భువనేశ్వర్ కుమార్ (సి) సిఫెర్ట్ (బి) ఫెర్గ్యూసన్ 1, చామల్ (బి) డారి మిఛెల్ 1, ఖలీల్ అహ్మద్ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు 7, మొత్తం 19.2 ఓవర్లలో 139 ఆలౌట్.

బౌలింగ్: టిమ్ సౌథి 4–0–17–3, స్కాట్ కుగులిన్ 2–0–34–0, ఫెర్గ్యూసన్ 4–0–22–2, మిఛెల్ సాంట్నర్ 4–0–24–2, డారి మిఛెల్ 2.2–0–13–1, ఐష్ సోధి 3–0–26–2.



భారత మహిళల ఓటమి

కివీస్‌తో టి–20 పోరు

వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో జరిగిన తొలి ట్వంటీ–20 మ్యాచ్‌లో భారత మహిళా జట్టు 23 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఆతిథ్య కివీస్ మహిళా జట్టు 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన భారత జట్టు 19.1 ఓవర్లలో 136 పరుగులకే కుప్పకూలింది. ఊరిస్తున్న లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన భారత్‌కు ప్రారంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ ప్రియా పునియా (4) తొలి ఓవర్‌లోనే పెవిలియన్ చేరింది. అయితే తర్వాత వచ్చిన జమిమా రోడ్రిగ్స్‌తో కలిసి మరో ఓపెనర్ స్మృతి మంధాన పోరాటం చేసింది. ఇద్దరు కివీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. మంధాన తన మార్క్ షాట్లతో అలరించింది. ప్రత్యర్థి బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న మంధాన జట్టు గెలుపు అవకాశాలను సజీవంగా ఉంచింది. జమీమా కూడా మంధానకు పూర్తి సహకారం అందించింది. ఇద్దరు కుదురుగా ఆడడంతో భారత్ స్కోరు 11.3 ఓవర్లలోనే వంద దాటింది. అయితే 34 బంతుల్లో ఏడు ఫోర్లు, మరో మూడు సిక్సర్లతో 58 పరుగులు చేసిన మంధానను అమెలియా కెర్ పెవిలియన్ పంపించింది. దీంతో 98 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఆ వెంటనే జమీమా కూడా వెనుదిరిగింది. కీలక ఇన్నింగ్స్ ఆడిన జమీమా ఆరు ఫోర్లతో 39 పరుగులు చేసింది. వీరిద్దరూ ఔటైనా తర్వాత భారత్ వరుస క్రమంలో వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (17) తప్ప మిగతవారు ఎవరూ కూడా రెండంకెలా స్కోరును అందుకోలేక పోయారు. దీంతో భారత్ ఇన్నింగ్స్ 136 పరుగుల వద్దరే ముగిసింది. భారత్ చివరి 9 వికెట్లను 34 పరుగుల తేడాతో కోల్పోవడం విశేషం. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్‌ను ఓపెనర్ సోఫి డివైన్ ఆదుకుంది. కీలక ఇన్నింగ్స్ ఆడిన డివైన్ 48 బంతుల్లో ఆరు ఫోర్లు, రెండు సిక్స్‌లతో 62 పరుగులు చేసింది. కెప్టెన్ సాటర్‌వైట్ 34 పరుగులు సాధించింది. వికెట్ కీపర్ మార్టిన్ 27 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది. ఈ విజయంతో కివీస్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0 ఆధిక్యంలో నిలిచింది.





ఓటమి కోరల్లో సౌరాష్ట్ర

పట్టుబిగించిన విదర్భ, రంజీ ఫైనల్

నాగ్‌పూర్: విదర్భ జట్టు వరుసగా రెండో రంజీ ట్రోఫీని చేజిక్కిచుకునేందుకు ఐదు వికెట్ల దూరంలో నిలిచింది. ఊరిస్తున్న లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన సౌరాష్ట్ర జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 58 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి ఓటమి కోరల్లో చిక్కుకుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించాలంటే సౌరాష్ట్ర మరో 148 పరుగులు చేయాలి. ఇప్పటికే కీలక ఆటగాళ్లందరూ పెవిలియన్ చేరడంతో సౌరాష్ట్ర గెలుపు అంత సులువు కాదనే చెప్పాలి. అయితే ఫైనల్‌కు చేరే క్రమంలో ఇలాంటి పరిస్థితి ఎదురైనా సౌరాష్ట్ర అద్భుత పోరాట పటిమతో విజయం సాధించిన విషయాన్ని ఇక్కడ మరువ కూడదు. మరోవైపు విదర్భను కూడా తక్కువ అంచన వేయలేం. బౌలింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై మరో ఐదు వికెట్లు తీయడం విదర్భకు కష్టమేమి కాదు. ఇప్పటికే ఆదిత్య సర్వాటే ఆల్‌రౌండ్‌షోతో అదరగొట్టాడు. ఇటు బ్యాట్‌తో, అటు బంతితోనూ రాణించి జట్టును విజయ పథంలో నడిపిస్తున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లను తీసిన ఆదిత్య రెండో ఇన్నింగ్స్‌లోనూ మరో మూడు వికెట్లను తీశాడు. దీంతో సౌరాష్ట్ర పీకల్లోతు కష్టాల్లో చిక్కుకుంది. ఓపెనర్లు హార్విక్ దేశాయ్ (8), స్నేల్ పటేల్ (12) నిరాశ పరిచారు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో జట్టును ఆదుకున్న పటేల్ ఈసారి నిరాశ పరిచాడు. స్టార్ ఆటగాడు చటేశ్వర్ పుజారా (0) ఖాతా తెరవకుండానే వెనుదిరిగాడు. అర్పిత్ వస్వదా (5), షెల్డన్ జాక్సన్ (7) కూడా పెవిలియన్ చేరారు. ఒంటరి పోరాటం చేస్తున్న విశ్వరాజ్ జడేజా 23 పరుగులతో క్రీజులో ఉన్నాడు. అంతకుముందు విదర్భ రెండో ఇన్నింగ్స్‌లో 200 పరుగులకు ఆలౌటైంది. ఆదిత్య 49 పరుగలు చేసి జట్టును ఆదుకున్నాడు.



ఇండియానా పోలీస్ వేదికగా జగుతున్న ఎన్‌బిఎ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో ఆటగాళ్ల హోరాహోరీ..లాస్‌ఎంజిల్స్–ఇండియానా పేసర్స్ జట్ల మధ్య ఈ పోరు జరిగింది.

ఆస్ట్రేలియాకే ఛాన్స్



షేన్‌వార్న్

మెల్‌బోర్న్: ఇంగ్లండ్ వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాకే కప్పు గెలిచే అవకాశాలు అధికంగా ఉన్నాయని దిగ్గజ క్రికెటర్ షేన్‌వార్న్ జోస్యం చెప్పాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియా జట్టు వరుస ఓటములు చవిచూస్తున్నా ప్రపంచకప్‌లో మెరుగైన ఆటను కనబరచడం ఖాయమన్నాడు. సవాళ్లను ఎదుర్కొని ముందుకు సాగే కంగారూలు ఈసారి కూడా విశ్వ విజేతగా నిలుస్తారనే నమ్మకాన్ని వార్న్ వ్యక్తం చేశాడు. గతంలో జరిగిన ప్రపంచకప్‌కు ముందు కూడా ఆస్ట్రేలియా ఇలాంటి కఠిన పరిస్థితినే ఎదుర్కొందన్నాడు. అయినా అందరి అంచనాలను తారుమారు చేస్తూ ప్రపంచకప్‌ను సొంతం చేసుకున్న విషయాన్ని మరువ కూడదన్నాడు. ఈసారి కూడా ఆసీస్ అలాంటి ప్రదర్శనే చేయడం ఖాయమన్నాడు. అయితే ఆస్ట్రేలియా గెలుపు అవకాశాలు మొత్తం సెలెక్టర్లపైనే ఆధారపడి ఉన్నాయన్నాడు. తాను ఊహించిన జట్టునే ఎంపిక చేస్తే వరల్డ్‌కప్‌ను దక్కించుకోవడం ఆస్ట్రేలియాకు కష్టమేమి కాదని వార్న్ స్పష్టం చేశాడు. ఇక, భారత్, ఇంగ్లండ్‌లకు కూడా ప్రపంచకప్ గెలిచే సత్తా ఉందన్నాడు. ఈ మూడు జట్ల మధ్యే తీవ్ర పోటీ ఉంటుందని వార్న్ పేర్కొన్నాడు.

ఓటమిపై అభిమానులు గరం..గరం

ముంబయి: న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టి–20లో టీమిండియా చిత్తుగా ఓడిపోవడంపై అభిమానులు సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పిస్తున్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో ఆటగాళ్ల చెత్త ప్రదర్శనతో పరువు తీశారని ధ్వజమెత్తారు. జట్టును ముందుండి నడిపించడంలో కెప్టెన్ రోహిత్ శర్మ ఘోరంగా విఫలమయ్యాడని వారు విమర్శించారు. విరాట్ కోహ్లి లేని లోటు స్పష్టంగా కనిపించిందని వారన్నారు. ప్రపంచకప్‌కు ముందు భారత్ ఇలాంటి చెత్త ప్రదర్శన కనబరచడాన్ని అభిమానులు జీర్ణించుకోలేక పోతున్నారు. కొత్త ఆటగాడు సిఫెర్ట్‌ను కట్టడి చేయడంలో భారత బౌలర్లు ఘోరంగా విఫలమయ్యారని వారు దుయ్యబట్టారు. సెలెక్టర్లు జట్టు ఎంపికలో తీసుకుంటున్న నిర్ణయాలే భారత్ పరాజయాలకు ముఖ్య కారణమని వారు ఆరోపించారు. చివరి వన్డేలో నిలకడగా రాణించిన కేదార్‌ను పక్కన బెట్టడాన్ని వారు తప్పుపట్టారు. ఇక, దినేశ్ కార్తీక్ చెత్త ప్రదర్శనపై కూడా వారు విమర్శలు గుప్పించారు. ధోని వంటి వెటరన్ ఆటగాడిని టి–20 ఫార్మాట్‌లో ఎందుకు ఆడిస్తున్నారో తెలపాలని మరికొందరూ సెలెక్టర్లను ప్రశ్నించారు. టి–20లలో మంచి రికార్డు కలిగిన రిషబ్ పంత్, ధావన్, రోహిత్‌లు చెత్త ఆటను కనబరచడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆటగాళ్లు తమ లోపాలపై దృష్టి పెట్టాలని అభిమానులు సూచించారు. మరోవైపు ధావన్‌పై కూడా అభిమానులు విరుచుకు పడ్డారు. అతని వైఫల్యం జట్టును వెంటాడుతోందని, కోహ్లి లేని సమయంలో జట్టును ఆదుకోవాల్సిన ధావన్ ఆ విషయం దృష్టి పెట్టడం లేదని దుయ్యబట్టారు.



ప్రజ్ఞేశ్, సాకేత్ ముందంజ



చెన్నై: ప్రతిష్టాత్మకమైన చెన్నై ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత స్టార్లు ప్రజ్నేశ్ గున్నేశ్వరన్, సాకేత్ మైనేని మూడో రౌండ్‌కు చేరుకున్నారు. బుధవారం జరిగిన రెండో రౌండ్‌లో టాప్ సీడ్ ప్రజ్నేశ్ 6–4, 6–4తో జర్మనీ ఆటగాడు డానియల్‌ను ఓడించాడు. ప్రారంభం నుంచే చెలరేగి ఆడిన ప్రజ్నేశ్ అలవోక విజయం సాధించాడు. మరో పోటీలో సాకేత్ 6–4, 6–3తో భారత్‌కే చెందిన విజయ్ సుందర్ ప్రశాంత్‌ను ఓడించాడు. మరో పోటీలో భారత ఆటగాడు అర్జున్ ఖాడే విజయం సాధించాడు.

గత ఏడాది తమ సహచర సైనికుడు ఔరంగజేబు అపహరణ, హత్యకు తెలిసో, తెలియకో సమాచారాన్ని లీక్ చేశారనే ఆరోపణలతో ముగ్గురు సైనికులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు బుధవారం సైనిక వర్గాలు తెలిపాయి. ఇంతవరకు వారిని అరెస్ట్ చేయడం గాని, నిర్బంధించడం గాని చేయలేదని పేర్కొన్నారు. ఈ కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని, హత్యతో సంబంధమున్న వారిని కోర్టుకు ఈడ్చేందుకు సహకారమందిస్తున్నట్లు తెలిపారు.

విశాల

అమెరికాకు రండి కానీ...

న్యాయబద్ధంగా రావాలని వలసదారులకు ట్రంప్ హితవు • మెక్సికో సరిహద్దులో గోడ కట్టి తీరుతా

అమెరికా కాంగ్రెస్ ప్రసంగంలో అధ్యక్షుడి పునరుద్ఘాటన





వాషింగ్టన్: ప్రతిభ ఉన్నవారు తమ దేశానికి రావాలన్న ఉద్దేశాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యక్తం చేశారు.అయితే తమ దేశానికి వచ్చే వారు న్యాయపరంగా రావాలని ఆయన కోరారు. ట్రంప్ మంగళవారం యుఎస్ కాంగ్రెస్‌నుద్దేశించి చేసిన వార్షిక స్టేట్ ఆఫ్ ది యూనియన్ ప్రసంగంలో వలసదారుల అం శాన్ని ప్రస్తావిస్తూ, అక్రమ వలసలు పెను ముప్పుగా పరిణమించాయని అన్నారు. 'అమెరికన్ల ఉద్యోగాలు, వారి భవిష్యత్తుకు రక్షణ కల్పిస్తూ వలస వ్యవస్థను రూపొందించడం మా నైతిక బాధ్యత. మా చట్టాలను గౌరవిస్తూ నేడు లక్షలాది మంది వలసదారులు అమెరికాలో నివసిస్తున్నారు. న్యాయపరంగా వచ్చే వలసదారులు మా దేశానికి ఎంతగానో ఉపయోగపడుతున్నారు. విదేశీయులు ఇంకా ఎక్కువ మంది అమెరికాకు రావాలనే నేను కోరుకుంటున్నాను. అయితే వారు న్యాయపరంగా రావాలి' అని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మాణం గురించిప్రస్తావించారు. మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మించి తీరుతామని ఆయన పునరుద్ఘాటించారు.ఈ గోడ నిర్మాణంతో అక్రమ వలసలు, స్మగ్లింగ్‌ను నిరోధించవచ్చని పేర్కొన్నారు. దేశంలో అక్రమ వలసలను అత్యవసరంగా పరిష్కరించాల్సిన సమస్యగా ఆయన అభివర్ణించారు. కోడి గుడ్డుకు ఈకెలు పీకే ధోరణిలో డెమొక్రాట్లు అమెరికాలో శాంతికి భంగం కలిగిస్తున్నారన్నారు. గోడ నిర్మాణానికి నిధుల మంజేరుపై వ్యతిరేకలతను వారు వీడాలన్నారు.గతంలో ఈ సభలో చాలా మంది సరిహద్దు గోడ నిర్మాణానికి అనుకూలంగా ఓటు వేశారని అంటూ.. అయినా గోడ నిర్మాణం జరగలేదన్నారు. తాను మాత్రం గోడను నిర్మించి తీరుతానన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

27న కిమ్‌తో భేటీ



ఫిబ్రవరి 27న వియత్నాంలో ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో మరోసారి భేటీ కానున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ సమావేశం రెండు రోజులు జరుగుతుందని చెప్పారు. ఉత్తరకొరియా అణ్వాయుధాలను వదిలిపెట్టేలా చూసే తన కృషి కొనసాగుతుందని చెప్పారు. గతంలో సింగపూర్‌లో తమ మధ్య జరిగిన సమావేశంతో సుహృద్భావ వాతావరణం నెలకొందని చెప్పారు. కొరియా ద్వీపకల్పంలో శాంతిని నెలకొల్పేందుకు తమ ప్రయత్నాలను కొనసాగిస్తామని చెప్పారు

చైనాను కాదు.. మన నాయకుల్ని అనాలి

అమెరికాను అలుసుగా తీసుకొన్నందుకు చైనాను నిం దించాల్సిన అవసరం లేదని ట్రంప్ అన్నారు. దీనికి తమ నాయకులదే తప్పని ఆయన తేల్చారు. వారే చైనాకు ఆ అవకాశమిచ్చారన్నారు. చైనాపై 250 బిలియనన్ డాలర్ల మేర పన్నులు విధించడం వల్ల ఖజానాకు బిలియన్ డాలర్ల కొద్దీ నిధులు సమకూరుతున్నాయని అన్నారు. అమెరికాలో ఉద్యోగాలను, మేధోసంపత్తిని చైనా దోచుకుంటోందని అన్నారు. తాము కఠినంగా వ్యవహరించి దానికి అడ్డుకట్ట వేశామని చెప్పుకున్నారు. అమెరికాను దోచుకోవడం ఎంతమాత్రం ఇక కుదరదని తేల్చి చెప్పామన్నారు. వాస్తవ పరిస్థితిలో మార్పు ఉంటే ఆ దేశంతో ఒప్పందం కుదుర్చుకుంటామని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక వ్యవస్థలో అద్భుతాలు జరుగుతున్నాయన్నారు. నిరుద్యోగిత గత అయిదేళ్లలో ఎన్నడూ లేనంత తక్కువగా ఉందని చెప్పుకొన్నారు.

రాజకీయ ఐక్యత అవసరం

అమెరికా శత్రువులను ఓడించాలంటే రాజకీయ ఐక్యత ముఖ్యమని ట్రంప్ అన్నారు.అత్యున్నతమైన ఎంపిక ఉండాలన్నారు. కొన్ని దశాబ్దాలుగా ఉన్న విభేదాలను వీడి కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. కోట్ల మంది ప్రజలు మనల్ని గమనిస్తున్నారని ఆయన డెమొక్రాట్లకు గుర్తు చేశారు. రెండు పార్టీల వలె కాకుండా ఒకే దేశంలాగా పని చేద్దామన్నారు.

తాలిబన్లతో చర్చలు



అఫ్గానిస్థాన్‌లో అన్ని వర్గాలతో నిర్మాణాత్మక చర్చలు సాగిస్తామన్నారు. ఈ వర్గాల్లో తాలిబన్లు కూడా ఉంటారని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం వల్ల దళాల ఉపసంహరణ సులభమై, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలపై మరింత ఎక్కువ దృష్టి పెట్టడానికి వీలవుతుందన్నారు. అయితే ఈ క్రమంలో ఒప్పందం కుదురుతుందో లేదో చెప్పలేనన్నారు. కానీ శాంతి సాధనకోసం తుది ప్రయత్నానికి సమయం ఆసన్నమైందన్నారు.అవినీతిపరులైన పాలకుల వద్ద అణ్వాయుధాలు ఉండకూడదనే ఉద్దేశంతోనే ఇరాన్‌తో తాము అణు ఒప్పందాన్ని రద్దు చేసుకున్నామని 80 నిమిషాలపాటు సాగిన తన ప్రసంగంలో ట్రంప్ చెప్పారు. ఇప్పటివరకు ఏ దేశంపై విధించనంత కఠినమైన ఆంక్షలను ఇరాన్‌పై విధించామన్నారు. అమెరికా 'ఇరాన్ వ్యూహం'లో దీనిని విప్లవాత్మకమైనదిగా అభివర్ణించారు.

బాధ్యతలు చేపట్టిన ప్రియాంక, సింధియా



న్యూఢిల్లీ : ఏఐసిసి ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక గాంధీ బుధవారంనాడు బాధ్యతల్ని స్వీకరించారు. తూర్పు ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్ని ఆమె చూస్తారు. ఇడి కార్యాలయంలో తన భర్త రాబర్ట్ వాద్రాను దించిన తర్వాత ఆమె తన పదవీ బాధ్యతల్ని చేపట్టారు. జనవరి 23న ప్రియాంక సోదరుడు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆమెను పార్టీ ప్రధాన కార్యదర్శిగా, తూర్పు ఉత్తరప్రదేశ్ పార్టీ ఇన్‌ఛార్జిగా నియమించారు. అక్బర్ రోడ్‌లోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో ఆమె సోదరుడి గది పక్కనే ప్రియాంక కార్యాలయం ఉంది. గురువారం ఆమె పార్టీ అధికారిక సమావేశానికి హాజరవుతారు. లోక్‌సభ ఎన్నికలకు అనుసరించాల్సిన వ్యూహాల గురించి చర్చించేందుకు రాహుల్‌గాంధీ గురువారంనాడు ప్రధాన కార్యదర్శులు, వివిధ రాష్ట్రాల పార్టీ ఇన్‌ఛార్జ్‌ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

బాధ్యతలు చేపట్టిన సింధియా

సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జ్యోతిరాదిత్య సింధియా బుధవారం ఎఐసిసి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. పశ్చిమ ఉత్తరప్రదేశ్ పార్టీ ఇన్‌ఛార్జిగా వ్యవహరించబోయే సింధియాను రాష్ట్రంలో పార్టీని పటిష్టం చేయడానికి నియమించారు. ప్రియాంక గాంధీతో పాటే ఆయన జనవరి 23న పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో నూతన



బాధ్యతలు చేపట్టిన తర్వాత సింధియా వినాయకుడి పూజలు చేశారు. పశ్చిమ ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన కొందరు పార్టీ కార్యకర్తలను కలుసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఎక్కువ లోక్‌సభ స్థానాలు గెలిచి, కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఉందని, అలాగే 2022 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని జ్యోతిరాదిత్య సింధియా చెప్పారు.

విద్యార్థులతో 'అప్నీ బాత్ రాహుల్ కే సాథ్'



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఇటీవల ఢిల్లీలోని ఒక రెస్టారెంట్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి సంబంధించిన వీడియోను కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ద్వారా విడుదల చేసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు వివిధ వర్గాలకు చెందిన ప్రజలతో చర్చించి, దేశం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వారి ద్వారా తెలుసుకునేందుకు అప్నీ బాత్ రాహుల్ కే సాథ్ పేరిట రాహుల్ గాంధీ ప్రచారం సాగిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆయన విద్యార్థులతో చర్చలు జరిపారు. కొంతమంది విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు రాహుల్ సమాధానాలు ఇవ్వడాన్ని ఈ వీడియోలో చూడవచ్చు. అగ్రవర్ణాలలోని పేదలకు రిజర్వేషన్లు, దళిత సమస్యలు, దివ్యాంగుల సమస్యలు, ఎల్‌జిబిటిక్యు(గే) వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు వంటి అంశాలకు సంబంధించిన ప్రశ్నలను విద్యార్థులు సంధించగా వాటికి రాహుల్ ఇచ్చిన సమాధానాలు ఈ మొదటి భాగం వీడియోలో ఉన్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడితో చర్చలపై విద్యార్థులు వెలిబుచ్చిన అభిప్రాయాలు కూడా ఇందులో ఉన్నాయి.



సంగీత నాటక అకాడమీ అవార్డుల ప్రదానం

న్యూఢిల్లీ: ప్రముఖ ఫ్లూట్ వాద్య కళాకారుడు రాజేంద్ర ప్రసన్న, కథక్ డాన్సర్ శోభా కోసర్, జానపద గాయకుడు అన్వర్ మంగానియర్, ఒడెస్సీ డాన్సర్ సుజాతా మహాపాత్ర, మరికొందరికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బుధవారం సంగీత నాటక అకాడమీ అవార్డుల్ని ప్రదానం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో అయిదు విభాగాల్లో మొత్తం 42 మందికి ఆయన 2017 సంవత్సరానికి అవార్డులు అందజేశారు. హిందుస్థానీ సంగీతంలో విశేష కృషి చేసిన గాయకులు ఉమాకాంత్, రమాకాంత్ గుండేచలకు సంయుక్తంగా అవార్డు లభించింది. సంగీత రంగంలో హిందుస్థానీ సంగీతంలో గాయకుడు లలిత్ జె రావు, తబలా విద్వాంసుడు యోగేష్ సంసి, కర్ణాటక సంగీతంలో గాయకురాలు ఎంఎస్ షీలా, వీణా విద్వాంసురాలు సుమ సుధీంద్ర, మృదంగం వాద్యంలో తివారూర్ వైద్యనాథన్, వేణు విద్వాంసులు శశాంక్ సుబ్రహ్మణ్యం, మధురాణి, సుగం సంగీత్‌కు హైమంతి శుక్లా, గుర్‌బాణీకి గుర్నాం సింగ్ అవార్డులు స్వీకరించారు. నృత్యరంగంలో రమా వైద్యనాథన్ (భరతనాట్యం), మాదంబి సుబ్రహ్మణ్యం నంబూర్ది (కథకళి), ఐఎన్. ఓయినం ఓంగబి ధోని దేవి (మణిపురి), దీపికా రెడ్డి (కూచిపూడి), రామకృష్ణ తలెక్‌దర్ (శాస్త్రీయం), జనమాజయ్ సాయిబాబు (చాఊ), అషిత్ దేశాయ్ (కంపోజర్) అవార్డులు అందుకున్నారు. రంగస్థలానికి చెందిన తొమ్మిది మంది ప్రముఖ కళాకారులకు, జానపదం, గిరిజన సంగీతం, డాన్స్, రంగస్థలం, పప్పెట్రీ వంటి సంప్రదాయక కళారూపాల్లో విశేష కృషి చేసిన పదిమంది కళాకారులు కూడా అవార్డులు అందుకున్నారు.

జిశాట్–31 ప్రయోగం విజయవంతం

కమ్యూనికేషన్స్,డిటిహెచ్ సేవలకు మరింత ఊతం



బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) తాజాగా మరో ఘనత సాధించింది. ఏరియాన్ స్పేస్ రాకెట్ ద్వారా ఫ్రెంచ్ గయానాలోని కౌరూ లాంచ్ కాంప్లెక్స్‌నుంచి కమ్యూనికేషన్స్ ఉపగ్రహం జి శాట్–31ని విజయవంతంగా నింగిలోకి పంపింది. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 2.31 గంటలకు ఉపగ్రహాన్ని మోసుకెళ్లిన రాకెట్ 42 నిమిషాలలో విజయవంతంగా నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఈ ఉపగ్రహం కమ్యూనికేషన్ సేవలను అందిస్తుంది. జిశాట్–31తో పాటుగా సౌదీ అరేబియాకు చెందిన1 హెల్లాస్ శాట్–4 ఉపగ్రహాన్ని కూడా ఏరియన్–5 రాకెట్ నింగిలోకి మోసుకెళ్లింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ డైరెక్టర్ ఎస్ పాండ్యన్ సహా ఇస్రో శాస్త్రవేత్తలు హర్షం వ్యక్తం చేశారు.15 సంవత్సరాల పాటు నిరాటంకంగా సేవలందించగల సామర్థ్యం కలిగిన జి శాట్–31 ఉపగ్రహం బరువు 2,536 కిలోలు. అత్యంత శక్తివంతమైన కెయు బ్యాండ్ వ్యవస్థ కలిగిన జిశాట్ –31 ఉపగ్రహం ఇస్రో సంప్రదాయ ఉపగ్రహాలయిన ఇన్‌శాట్, జిశాట్ ఉపగ్రహాలకు ఆధునిక రూపమని నిపుణులు చెబుతున్నారు. త్వరలో కాలం చెల్లనున్న కొన్ని ఉపగ్రహాల స్థానంలో సేవలకోసం దీన్ని ప్రయోగించారు. భారతీయ భూభాగాలు, ద్వీపాలతో పాటుగా అరేబియా సముద్రం, బంగాళాఖాతం పరిసరాల సమాచారాన్ని ఈ ఉపగ్రహం అందజేస్తుంది.ఈ ఉపగ్రహం వి శాట్ నెట్‌వర్క్స్, టెలివిజన్ అప్‌లింక్స్, డిటిహెచ్ టెలివిజన్, సెల్యులర్ బ్యాకప్‌లకు అనుకూలమైన సాంకేతికతలను సొంతం చేసుకుందని ఇస్రో పేర్కొంది.ఇప్పటికే భూ స్థిరకక్ష్యలో ఉన్న కొన్ని సమాచార ఉపగ్రహాలతో చేరి ఇది అదనపు సేవలను అందిస్తుంది. ఇస్రో రూపొందించిన 40వ కమ్యూనికేషన్ శాటిలైట్ ఇది.

లోక్‌సభకు పోటీ చేస్తా : హార్దిక్



న్యూఢిల్లీ: మరి కొద్ది నెలల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు పాటిదార్ నాయకుడు హార్దిక్ పటేల్ బుధవారం ప్రకటించారు. లక్నోలో జరిగిన ఒక ర్యాలీలో ప్రసంగిస్తూ ఆయన ఈ ప్రకటన చేశారు. 25 సంవత్సరాల హార్దిక్ వయసు రీత్యా అర్హత లేని కారణంగా 2014 ఎన్నికలలో పోటీ చేయలేకపోయారు. గుజరాత్‌లోని అమ్రేలి లోక్‌సభ స్థానం నుంచి పోటీచేయాలని భావిస్తున్న హార్దిక్ పటేల్‌కు కాంగ్రెస్ ఇదివరకే మద్దతు ప్రకటించింది. ఆయన ఎప్పుడు పోటీ చేయదలచినా తమ మద్దతు ఉంటుందని కాంగ్రెస్ వెల్లడించింది. అభ్యర్థిని నిలబెట్టకుండా హార్దిక్‌కు కాంగ్రెస్ మద్దతిచ్చే అవకాశం ఉంది. బిజెపికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ ఏకం కావాలని హార్దిక్ మొదటి నుంచి పిలుపునిస్తున్నారు.జనవరి 27న హార్దిక్ తన బాల్య స్నేహితురాలు కింజల్ పారిఖ్‌ను వివాహం చేసుకున్నారు.

అత్తగారింటికి తిరిగొచ్చిన కనకదుర్గ



మలప్పురం(కేరళ): శబరిమలలో అయ్యప్ప స్వామిని దర్శనం చేసుకున్నందుకు అత్తగారింటి నుంచి గెంటివేతకు గురైన 44 సంవత్సరాల కనకదుర్గ ఎట్టకేలకు కోర్టు ఉత్తర్వులతో తిరిగి అత్తగారింటికి చేరుకున్నారు. బిందు అమ్మిని అనే మహిళతో కలసి గత నెల 2న అయ్యప్పను దర్శించుకున్న కనకదుర్గకు తన సొంత ఇంట్లో తీవ్ర తిరస్కారం ఎదురైంది. అత్త దాడిలో గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందిన కనకదుర్గ తిరిగి ఇంటికి వెళ్లగా భర్త కూడా ఆమెను ఇంట్లోకి రానివ్వలేదు. దీంతో ఆమె కొంత కాలం ప్రభుత్వ సంరక్షణ గృహంలో ఉన్నారు. పెరింతల్‌మన్నలోని ఫస్ట్ క్లాస్ జుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో తన భర్త, ఇతర బంధువులపై గృహ హింస కింద ఆమె కేసు పెట్టగా దీన్ని గ్రామ న్యాయాలయకు బదిలీ చేశారు. ఇటీవలే కోర్టు ఆమె తన అత్తగారింట ఉండేందుకు ఆదేశాలు జారీచేసింది. కోర్టు ఉత్తర్వులతో ఆమె మంగళవారం అత్తగారింటికి చేరుకున్నారు. తాను ఈ రోజు తన బిడ్డలను చూడలేకపోయినప్పటికీ మరోసారి చూస్తానన్న నమ్మకం తనకు ఉందని ఆమె చెప్పారు. తనతో ఉండేందుకు తన కుటుంబం ఇష్టపడనప్పటికీ అన్నీ సర్దుకుంటాయని ఆశిస్తున్నానని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

పూజా పాండే అరెస్టు



లక్నో: గత నెల 30న మహాత్మాగాంధీ వర్ధంతి నాడు మహాత్ముని హత్యా దృశ్యాన్ని పునఃసృష్టించిన నేరారోపణపై అఖిల భారత హిందూ మహాసభ జాతీయ కార్యదర్శి పూజా శకున్ పాండే, ఆమె భర్త అశోక్ పాండేను అలీగఢ్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మహాత్మ గాంధీ చిత్రపటాన్ని తుపాకీతో కాలుస్తున్న దృశ్యాలతో కూడిన వీడియో ఒకటి బయటపడడడంతో దీన్ని పురస్కరించుకుని గత నెల 31న మరో ముగ్గురిని యుపి పోలీసులు అరెస్టు చేశారు. ఆనాటి నుంచి పరారీలో ఉన్న పూజా పాండేను యుపిలోని తప్పల్‌లో పోలీసులు అరెస్టు చేశారు. ఒకపక్క దేశమంతా మహాత్మా గాంధీ 71వ వర్ధంతిని పాటిస్తుండగా హిందూ మహాసభ సభ్యులు కొందరు దీన్ని అపహాస్యం చేస్తూ మహాత్ముడిని నాథూ రాం గాడ్సే కాల్చి చంపిన దృశ్యాన్ని అలీగఢ్‌లో తిరిగి సృష్టించారు. సోషల్ మీడియాలో దీనికి సంబంధించిన వీడియో ఒకటి వైరల్ అయింది. జాతిపిత చిత్రపటాన్ని పూజా పాండే కాలుస్తుండగా పక్కనే ఉన్న కార్యకర్తలు కొందరు మహాత్మా నాథూరాం గాడ్సే అమర్ హై అంటూ నినాదాలు చేయడం సంచలనం సృష్టించింది.

పాక్‌లో హిందూ ఆలయం ధ్వంసం

ఇస్లామాబాద్/కరాచి: సింధ్ ప్రావిన్సులోని ఒక హిందూ దేవాలయంపై ముష్కరులు జరిపిన దాడిని పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తీవ్రంగా ఖండించారు. ఆలయంపై దాడి జరిపి విధ్వంసం సృష్టించిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఖైర్‌పూర్ జిల్లాలోని కుంబ్ పట్టణంలోగల ఒక హిందూ ఆలయంపై కొందరు దుండగులు గత వారం దాడి జరిపి పవిత్ర గ్రంథాలను, విగ్రహాలను తగులబెట్టారు. మంగళవారం రాత్రి ఇమ్రాన్ ఖాన్ ఈ సంఘటనపై ట్విట్టర్ ద్వారా స్పందిస్తూ నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఇటువంటి దుశ్చర్యలు ఖురాన్ బోధనలకు విరుద్ధమైనవని ప్రధాని పేర్కొన్నారు. కాగా, హిందూ సమాజం ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. నివాస గృహాల మధ్యనే ఆలయం ఉండడంతో ఈ ఆలయానికి భద్రతను అక్కడి హిందూ సమాజం కల్పించలేదు. ఈ సంఘటన దరిమిలా హిందువులు నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. దేశంలోని హిందూ దేవాలయాల భద్రత కోసం ఒక ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని పాకిస్తాన్ హిందూ కౌన్సిల్ సలహాదారుడు రాజేశ్ కుమార్ హర్‌దాసాని డిమాండు చేశారు. ముస్లిం ప్రాబల్య పాకిస్తాన్‌లోని 22 కోట్ల జనాభాలో హిందువులు సుమారు 2 శాతం ఉంటారు. సింధ్ ప్రావిన్సులోని హిందూ జనాభా అధికం. ఉగ్రవాదుల నుంచి వేధింపులు ఎదుర్కొంటున్నట్లు హిందువులు తరచు ఫిర్యాదు చేస్తుంటారు.

బిజెడి ఎంపి లాడు కిశోర్ స్వైన్ మృతి



భువనేశ్వర్: దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బిజూ జనతాదళ్ సీనియర్ నేత, లోక్‌సభ్యుడు లాడుకిశోర్ స్వైన్ కన్నుమూశారు. ఆయన వయస్సు 71. ఒడిశాలోని అస్కా లోక్‌సభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న స్వైన్ కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.స్వైన్ మృతి పట్ల ప్రధాని మోడీ సంతాపం వ్యక్తం చేస్తూ ట్వీట్ చేశారు. గ్రామీణాభివృద్ధికి ఆయన చేసినసేవలను కొనియాడారు.

లోక్‌సభ నివాళి, వాయిదా

న్యూఢిల్లీ: బిజూ జనతాదళ్ (బిజెడి) సభ్యుడు లదు కిశోర్ స్వెయిన్‌కు బుధవారం సంతాపం ప్రకటించిన తర్వాత లోక్‌సభ కార్యకలాపాలను ఆరోజుకు వాయిదా వేశారు. బుధవారం సభ సమావేశమైన తర్వాత స్పీకర్ సుమిత్రా మహాజన్ నేటి ఉదయం భువనేశ్వర్‌లో బిజెడి సభ్యుడు మరణించారని తెలిపారు.ఒడిశాలో అస్కా లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎన్నికైన కిశోర్ స్వెయిన్ వయసు 71 సంవత్సరాలు. 2004 నుంచి 2009వరకు ఆయన ఒడిశా అసెంబ్లీ సభ్యుడిగా ఉన్నారు. గ్రామీణాభివృద్ధి, ఓబిసిల పార్లమెంటరీ కమిటీలో స్వెయిన్ సభ్యుడిగా ఉన్నారు. ఆయనకు నివాళి అర్పించిన సమయంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ, యుపిఎ చైర్‌పర్సన్ సోనియాగాంధీ సభలో ఉన్నారు.

దేశం విడిచి వెళ్లకుండా పాక్ మాజీ ప్రధానికి ఆంక్షలు

లాహోర్: అవినీతి ఆరోపణలు రావడంతో పాకిస్థాన్ మాజీ ప్రధాని యూసుఫ్ రాజా గిలానీని దేశం విడిచి వెళ్లకుండా ఇమ్మిగ్రేషన్ అధికారులు నిలువరించారు. ఒక సమావేశానికి హాజరయ్యేందుకు ఆయన బ్యాంకాక్ మీదుగా దక్షిణ కొరియాకు వెళ్లేందుకు మంగళవారం రాత్రి లాహోర్ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లినట్లు ఫెడరల్ ఇన్‌వెస్టిగేటివ్ ఏజెన్సీ తెలిపింది. ఆయన పేరు నో ఫ్లై జోన్లో ఉందని, దేశం విడిచి వెళ్లేందుకు అనుమతించబోమని విమానాశ్రయ అధికారులు తేల్చి చెప్పారు. ఇందుకు సంబంధించి హోంశాఖ నుంచి తమకు ఆదేశాలు ఉన్నట్లు తెలిపారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన గిలానీ, ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ప్రత్యర్థి పార్టీ నేతలను లక్ష్యంగా ఎంచుకుంటున్నారని విమర్శించారు.

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666